


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 161, పేజీలు - 08

శనివారం, అక్టోబర్ 19, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## మియాపూర్‌లో చిరుత సంచారం

**- స్థానికుల భయాందోళన**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో చిరుత సంచారం కలకలం రేపింది. మియాపూర్ మెట్రో స్టేషన్ వెనుకాల శుక్రవారం రాత్రి ఓ చిరుత సంచరించిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అటవీ అధికారుల సహాయంతో గాలింపు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియాలో ఈ వీడియోలు వైరల్‌గా మారగా అటవీ అధికారులు అక్కడ చిరుత ఆనవాళ్లు గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, చిరుత

2లో..

## ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు కుళ్లిన కోడి మాంసం

2లో..

# రేవంత్ ఆలౌట్ పాలిటిక్స్

## - బీఆర్ఎస్, బీజేపీలకు గడ్డు పరిస్థితేనా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజకీయాల్లో సీనియార్టీ ముఖ్యం కాదు. రాజకీయ వ్యూహాలే ముఖ్యం. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు అలాంటి వ్యూహాల్లో ఎవరికీ అందనంత ఎత్తులో కనిపిస్తున్నారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు ఆయన ఒక్క ప్రెస్ మీట్ ద్వారా చెక్ పెట్టారు. అంతే కాదు అసెంబ్లీలో చర్చకు సవాల్ విసరడం ద్వారా ఆ రెండు పార్టీలకు తేల్చుకోలేని సమస్యను తెచ్చి పెట్టారు. ఎందుకంటే మూసి ప్రక్షాళనను ఆ రెండు పార్టీలు వ్యతిరేకించలేవు. మారిపోయిన రాజకీయంలో స్వాగతిస్తే రేవంత్ ట్రాప్‌లో పడినట్లు అవుతుంది.

**- మూసి ప్రక్షాళనను సవాల్‌గా తీసుకున్న రేవంత్ రెడ్డి**

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మూసిని ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. ఆయన మనసులో ఓ విజన్ ఉంది. నగరం మధ్య నుంచి పోయే మూసీ నదిని అత్యంత సుందరంగా మారిస్తే అది ఆర్థిక వాహకం కూడా అవుతుందని ఆయన అనుకున్నారు. లండన్ లోని థేమ్స్ నదిని కూడా చూసి వచ్చారు. నగరాల నుంచి నదులు ప్రవహించే చోట్ల ఉన్న పరిస్థితుల కంటే హైదరాబాద్ బెటర్ పొజిషన్ లో ఉందని ఆయన నిర్ణయించుకున్నారు. అందుకే కొన్ని అధికార బృందాలకు ప్రత్యేకంగా మూసి మీద సర్వే చేసే పనులు అప్పగించారు. డీపీఆర్ రెడీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. విపక్షం రాజకీయం చేయాలని చూస్తున్నా రేవంత్ దాన్ని రాజకీయంగానే ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు.

**- రేవంత్‌పై ప్రజా వ్యతిరేకత పెంచేందుకు మంచి చాన్స్ అనుకున్న విపక్షాలు**

మూసి ప్రక్షాళన అనేది అధికారంలోకి వచ్చే ప్రతి పార్టీకి ఓ డ్రీమ్. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనుకన్నారు. కేసీఆర్ అనుకున్నారు. కానీ ఎవరూ

2లో..

## సిద్ధరామయ్య చుట్టూ మరింత బిగిసిన ఉచ్చు

**- ముడా స్కామ్‌లో ఈడీ తనిఖీలు**



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** కన్నడనాట సంచలనం రేపుతున్న మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ - ముడా కుంభకోణంలో ఈడీ దూకుడు పెంచింది. మైసూరులోని ముడా కార్యాలయంలో ఈడీ అధికారుల బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. 12 మంది అధికారుల బృందం మైసూరులోని ముడా ఆఫీస్‌కు వెళ్లి ముడా కమిషనర్ రఘునందన్ సహా పలువురు అధికారులను కలిసింది. అంతేకాకుండా ఈ తనిఖీల్లో పలు కీలక డాక్యుమెంట్లను ఈడీ అధికారులు సీజ్ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు ద్వారా తెలుస్తోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అందరు ముడా అధికారులను ఈడీ అధికారులు విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈడీ అధికారుల

2లో..

# 2029లో కూటమిగానే పోటీ

## - కలిసి నడవాలని నేతలకు చంద్రబాబు సూచన

**- మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో కీలక సమావేశం**

**- హాజరైన టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు**

**- పార్టీ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేసిన చంద్రబాబు**

మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇంఛార్జులు, ముఖ్య నేతలతో పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఇవాళ సమావేశమయ్యారు. వివిధ అంశాలపై నేతలకు దిశనిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మట్లాడుతూ 125 రోజుల పాలనలో మనం చేసిన మంచి పనులు సమీక్షించుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ఏ నాయకుడు ప్రవర్తించినా కఠిన చర్యలు ఉంటాయని సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు హెచ్చరించారు. విజయవాడలో రాష్ట్రంలోని టీడీపీ ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. కూటమి అధికారంలోకి రావడానికి టీడీపీ శ్రేణులు, నేతలు తీవ్రంగా శ్రమించారని కితాబు ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఐదేళ్లలో చాలా సమస్యలు ఎదుర్కొన్నారని వాటిని పార్టీ ఎప్పటికీ మర్చిపోదున్నారు. వాటిన్నింటిపై కసి తీర్చుకోవాలని పార్టీ కేడర్ ఆవేశంతో ఉందని గుర్తు చేశారు. గతంలో ఇలాంటి తప్పులే చేసి వైసీపీకి ప్రతిపక్ష హెూదా కూడా రాలేదని తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న మనం కూడా అలాంటి

2లో..

## అది బ్యూటిఫికేషన్ కాదు

# లూటిఫికేషన్ ప్రాజెక్ట్

## - రేవంత్ కు కేటీఆర్ కౌంటర్ ప్రజెంటేషన్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మూసీని మురికి కూపంగా మార్చింది గత ప్రభుత్వాలేనని అవి కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని కేటీఆర్ అన్నారు. సింహభాగం కాంగ్రెస్ ప్రభుత్వానిది అయితే కొద్దిభాగం టీడీపీ ప్రభుత్వానికి కూడా దక్కుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మూసీపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 1908లో వరదలు వచ్చినప్పుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య డిజైన్ చేసిన రిజర్వాయర్లు, పార్కులు తప్ప కేసీఆర్ వచ్చేదాకా ఏ ప్రభుత్వం కూడా మూసీ ప్రక్షాళన ప్రయత్నాలు చేయలేదన్నారు.

**- మూసీ ప్రక్షాళన కేసీఆర్ ప్రణాళిక**

కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రిపోర్టు తెప్పించుకున్నామని బీవోడీ, సీవోడీ ఈ రెండింటిలో కూడా మూసీ ప్రమాదభరితమైన స్థాయిలో ఉందని రిపోర్టు వచ్చిందని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో అక్కడ ఉండే పరిస్థితులను అధ్యయనం చేసి పునరుజ్జీవం, సుందరీకరణ చేసే విధంగా సంకల్పించామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దాదాపు రెండున్నర గంటల పాటు తాను ఏదో

2లో..

## గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేదు

**- గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జ్, బండి సంజయ్ ఆగ్రహం**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని కోరుతూ అశోక్‌నగర్‌లో ఆందోళనకు దిగిన అభ్యర్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేయడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ సీరియస్ అయ్యారు. న్యాయం కోసం నిరసన తెలిపితే కొడతారా? అని మండిపడ్డారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. అశోక్‌నగర్‌లో గ్రూప్ 1 అభ్యర్థులను కలిసి

2లో..

## సినిమా బాగుంటే ఆ పేరుతో మద్యం బ్రాండ్లు

**- ఇసుక, మద్యం పాలసీలపై వైఎస్ జగన్ మాస్ ర్యాగింగ్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ఏ సినిమా బాగుంటే ఆ సినిమా పేరుతో మద్యం బ్రాండ్లు తెచ్చారని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ పాలన 'దోచుకో.. పంచుకో.. తినుకో' అన్న చందంగా మారిందని.. సర్కారు కనీసం బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేకపోయిందని విమర్శించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 5 నెలల గడిచినా సూపర్ 6 లేదు సూపర్ 7 లేదని ఎద్దేవా చేశారు. ఉచిత ఇసుక పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆపద్ధర్మ సీఎంగా ఉంటూ కూడా చంద్రబాబు బ్రాండ్లు రిలీజ్ చేశారని వాటిని వైసీపీ హయాంలో వచ్చిన బ్రాండ్లంటూ అబద్ధాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. 'బూంబూం బీర్, ప్రెసిడెంట్ మెడల్ ఇవన్నీ చంద్రబాబు హయంలో

2లో..

## స్కిల్ యూనివర్శిటీకి

# అదానీ గ్రూప్ రూ.100 కోట్ల విరాళం

## - సీఎం రేవంత్ రెడ్డికి చెక్కు అందజేత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దిగ్గజ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ గొప్ప మనసు చాటుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తోన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి భారీ విరాళం ప్రకటించారు. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఫౌండేషన్ ద్వారా రూ. 100 కోట్ల విరాళం

2లో..

## యూనివర్సిటీలకు కొత్త వీసీలు

**- ఓయూ వైస్ ఛాన్స్‌లర్‌గా కుమార్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వీసీల పేర్లతో కూడిన నియామక దస్త్రాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించగా.. ఆయన సంతకం చేశారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారికంగా కొత్త వీసీల నియమాకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ఈ 9 యూనివర్సిటీల్లో ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ

2లో..

## గ్రూప్ 1 మెయిన్స్

# పరీక్షలు యథాతథం

## - హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక తీర్పు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించేందుకు లైన్ క్లియర్ అయింది. ఈ నెల 21వ తేదీ నుంచి గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు వేసిన పిటిషన్లను ఇప్పటికే సింగిల్ బెంచ్ కొట్టివేయగా వారు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా విచారణ

2లో..

# అక్టోబర్ 23న ఏపీ కేబినెట్ భేటీ

**- సచివాలయంలో భేటీ కానున్న మంత్రివర్గం**

**- కీలక నిర్ణయాలు ఉండే అవకాశం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం అక్టోబర్ 23వ తేదీ జరగనుంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాయం వేదికగా అక్టోబర్ 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఏపీ కేబినెట్ భేటీ జరగనుంది. ఈ విషయమై అన్ని ప్రభుత్వ శాఖలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ లేఖలు రాశారు. ఏపీ కేబినెట్ భేటీ నేపథ్యంలో అక్టోబర్ 21వ తేదీన సాయంత్రం 4 గంటలలోపు మంత్రివర్గ భేటీలో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపాదనలు

3లో..

ప్రజాప్రశ్న


# ఫాస్ట్‌పుడ్ సెంటర్లకు కుళ్లిన కోడి మాంసం

## - వెలుగులోకి విస్తుపోయే నిజాలు - కెమికల్స్‌తో చికెన్ కల్తీ
## - 7 క్వింటాళ్ల చికెన్ సీజ్(- మద్యం దుకాణాలు, బార్లకు కూడా సప్లయ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఫాస్ట్‌పుడ్ సెంటర్లు, మద్యం దుకాణాల్లోని పర్మిట్ రూమ్స్‌లో చికెన్ ఐటమ్స్ ఇష్టంగా తింటున్నారా.? అయితే మీకో షాకింగ్ న్యూస్. కుళ్లిన చికెన్‌తో ఆయా చికెన్ ఐటమ్స్ తయారు చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్ బేగంపేటలో తనిఖీలు నిర్వహించిన ఫుడ్ సెఫ్టీ అధికారులు భారీగా కుళ్లిన చికెన్‌ను సీజ్ చేసారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు క్వింటాళ్ల చికెన్‌ను అధికారులు సీజ్ చేశారు. బేగంపేటలోని బాలయ్య చికెన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం ఫుడ్ సెఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్కడ వందల కేజీలకొద్ది పేరుకుపోయిన కుళ్లిపోయిన కోడి మాంసాన్ని గుర్తించారు. చికెన్‌తో పాటుగా కొవ్వు పదార్థాలు సైతం స్వాధీనం చేసుకున్నారు. కుళ్లిన కోడి మాంసానికి కెమికల్స్ వేసి ఆ చికెన్‌ను నగరంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మద్యం దుకాణాల్లోని పర్మిట్ రూంలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ నగరంలోని జనతా బార్‌లకు సైతం ఈ కుళ్లిన కోడి మాంసాన్ని సప్లయ్ చేస్తున్నట్లు తేలింది. మొత్తం ఏడు క్వింటాళ్ల కుళ్లిపోయిన కోడి మాంసాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బాలయ్య చికెన్ సెంటర్‌ను సైతం సీజ్ చేసి.. జనతా బార్‌లకు పెద్ద ఎత్తున చికెన్ సరఫరా చేయటంపై ఆరా తీస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బార్లే కాకుండా ఇంకా ఎక్కడెక్కడ చికెన్ సరఫరా చేస్తున్నారనే విషయంపై విచారణ చేపట్టారు. బాలయ్య చికెన్ సెంటర్ యాజమాన్యంపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఏడు క్వింటాళ్ల కుళ్లిన చికెన్ దొరకటం అది కూడా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు, బార్లకు సరఫరా చేస్తున్నట్లు తెలియటంతో నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బయట ఫుడ్ తినేవారు జాగ్రత్తగా ఉండాలని ఫుడ్ సెఫ్టీ అధికారులు, డాక్టర్లు సూచిస్తున్నారు. బయట మార్కెట్‌లో చాలా వరకు కల్తీ ఫుడ్ విక్రయిస్తున్నారని.. బయట తినకపోవటమే మంచిదని చెబుతున్నారు. ఇంట్లో తయారు చేసుకున్న ఆహార పధార్థాలు మాత్రమే తినాలని లేదంటే అనారోగ్యం బారిన పడతారని హెచ్చరిస్తున్నారు.?



## మియాపూర్‌లో చిరుత సంచారం

సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా, మియాపూర్ మెట్రో వెనుక భాగంలో ఇప్పటికే తవ్వకాలు జరిగాయి. ఆ తవ్వకాలు జరిగిన స్థలం నుంచే చిరుత వెళ్లినట్లు వీడియోలో కనిపిస్తోంది. అయితే, అటవీ శాఖ అధికారులు దీన్ని నిర్ధారించాల్సి ఉంది. స్థానికులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## రేవంత్ ఆలౌట్ పాలిటిక్స్

చేయలేకపోయారు. ఎందుకంటే మూసిలో దశాబ్దాలుగా ఆక్రమణలు ఉన్నాయి. ఏకంగా కాలనీలకు కాలనీలే నిర్మాణం అయ్యాయి. వాటికి ప్రభుత్వాలే పర్మిషన్లు ఇచ్చాయి. కరెంట్, వాటర్ కనెక్షన్లు ఇచ్చాయి. ఇలాంటి ఆక్రమణల కారణంగా మూసీ కాస్తా మురికి కాలవ అయిపోయింది. వారందర్నీ ఖాళీ చేయించాలంటే ప్రజా వ్యతిరేకత వస్తుందని , పరిహారానికి వేల కోట్లు కేటాయించాలని ఆపేశారు. ఈ విషయాన్ని మూసి ప్రక్షాళన కార్పొరేషన్ చైర్మన్ గా పని చేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కూడా చెప్పారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళనను సీరియస్ గా తీసుకోవడంతో ఆయనపై ప్రజా వ్యతిరేకత పెంచేందుకు మంచి అవకాశం అనుకున్నాయి విపక్షాలు. హైడ్రా కూల్చివేతలు వారికి కలసి వచ్చాయి. అంతే ఒక్క ఇంటినీ కూలగొట్టనీయమని పేదలకు అండగా ఉంటామని హరీష్ రావు, కేటీఆర్, బీజేపీ నేత ఈటల రాజేందర్ మూసీ నిర్వాసిత కాలనీల్లో పర్యటించి భరోసా ఇచ్చారు. కావాల్సినంత రాజకీయం చేశారు.

### - మూసీ రాజకీయంలో పర్‌ఫెక్ట్ పాచిక వేసిన రేవంత్ రెడ్డి

ఈ రాజకీయానికి రేవంత్ పర్ ఫెక్ట్ పాచిక వేశారు. మూసీ మురికి కూపంగా ఉండటం వల్ల ఎన్ని సమస్యలు వస్తున్నాయో వివరించడమే కాకుండా ప్రజలు వద్దంటే ఆపేస్తానని అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, బీజేపీ ఎమ్మెల్యేలు అందరూ రావాలని సభను ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు పెడదామన్నారు. తాను సవాల్ చేయలేదని సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ఇప్పుడు రేవంత్ సవాల్‌కు బీఆర్ఎస్, బీజేపీ రియాక్ట్ కావాల్సి ఉంది. చిన్న వర్షం వస్తేనే మునిగిపోయే పరిస్థితికి వెళ్లిపోతున్న హైదరాబాద్‌కు రేపు ఏదైనా క్లౌడ్ బరస్ట్ బారిన పడితే ప్రజల్లో ఆగ్రహం వస్తుంది. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే మూసీని ప్రక్షాళన చేయాలని రేవంత్ అంటున్నారు. అవసరం లేదంటే అదే అసెంబ్లీల చెప్పాలని అంటున్నారు. అలా చెబితే హైదరాబాద్ ప్రజలు స్వాగతించే అకాశం ఉండదు. ముంచేసే సమస్య వచ్చినప్పుడు నిర్వాసితులకు న్యాయం చేసి ఆ సమస్యను పరిష్కరించుకోవడమే కీలకం. దాన్ని వ్యతిరేకిస్తే ఏం జరుగుతుందో రాజకీయ నేతలకు తెలుసు. ఆ విషయాన్ని రేవంత్ గట్టిగా పట్టుకున్నారు.ఇప్పుడు మూసి ప్రక్షాళనను వ్యతిరేకిస్తే ప్రజలకు వ్యతిరేకం అవుతారు. స్వాగతిస్తే..రేవంత్ చెప్పిందే నిజమని అంగీకరించినట్లవుతుంది. అది కూడా రాజకీయంగా నష్టమే చేస్తుంది. ఇది రేవంత్ ఆల్ ఔట్ ప్లాన్ అనుకోవచ్చు.

## సిద్ధరామయ్య చుట్టూ మరింత బిగిసిన ఉచ్చు

తనిఖీల సందర్భంగా కేంద్ర పారామిలటరీ ఫోర్స్ వారి వెంబడి భద్రత కోసం రావడం గమనార్హం. మైసూరులోని వివిధ ప్రాంతాల్లో ఈడీ అధికారుల సోదాలు కొనసాగాయి. అయితే ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గానీ ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో గానీ, వారికి సంబంధించిన వారి ఇళ్లల్లో సోదాలు జరగలేదని అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవలె అనారోగ్యం కారణంగా ముడా ఛైర్మన్ కే మరిగౌడ రాజీనామా చేయడం ఆ వెంటనే ఈడీ అధికారులు రంగంలోకి దిగడం సంచలనంగా మారింది. సిద్ధరామయ్య భార్య పార్వతి వివిధ ప్రాజెక్టుల కోసం మైసూరులోని ఇతర ప్రాంతాల్లో ఉన్న తన 3.16 ఎకరాల భూమిని ఇవ్వడంతో ముడా పరిధిలోని 14 ప్లాట్లను ఆమెకు కేటాయించారు. ఇందులో రూ.45 కోట్ల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిదిపై ఆరోపణలు వచ్చాయి. ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యతో పాటు మాజీ ఛైర్మన్ కే మరిగౌడ ప్రమేయం కూడా ఉన్నట్లు ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. అయితే ఈ ముడా స్కామ్ ఆరోపణలు రావడంతో ఆ ప్లాట్లను సిద్ధరామయ్య భార్య తిరిగి ముడాకు అప్పగించింది. ఈ కేసులో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని సీఎం సిద్ధరామయ్య కర్ణాటక హైకోర్టులో సవాల్ చేయగా. అక్కడ ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది.

## 2029లో కూటమిగానే పోటీ

తప్పులే చేస్తే రెండు పార్టీలకు తేడా ఉండదన్నారు.

### - మద్యం వ్యాపారాలకు దూరంగా ఉండండి: చంద్రబాబు

అలాగని తప్పులు చేసిన వారిని ఎవర్నీ వదిలి పెట్టే ప్రసక్తి లేదని చెప్పారు చంద్రబాబు. న్యాయపరిధిలో వారందరికీ శిక్షలు పడతాయని చెప్పుకొచ్చారు. అంతే కాని వైసీపీపై కక్ష సాధింపులకు అవకాశం లేదని స్పష్టం చేశారు అలా ఎవరూ కోరుకోవద్దన్నారు. అది రాష్ట్రానికి కూడా మంచిది కాదని ప్రజలు హర్షించబోరని అన్నారు. చిన్న ఉద్యోగి తప్పు చేస్తే సీఎంను తిడతారని అదే కార్యకర్త తప్పు చేస్తే సీఎంతోపాటు ప్రభుత్వాన్నే తిడతారని చెప్పుకొచ్చారు చంద్రబాబు. అందుకే కార్యకర్తలు, నేతలు అనవసరమైన విషయాల్లో కలుగుజేసుకోవద్దని సూచించారు. మద్యం వ్యాపారాలకు, ఇసుక దందాలకు దూరంగా ఉండాలన్నారు. కొత్తగా లిక్కర్ వ్యాపారంలోకి రావాలనే ఆలోచన వద్దని హితవు పలికారు.

### - సమస్యలు ఉన్నాయి - కేంద్రం సాయంతో నెట్టుకొస్తున్నాం

గత ప్రభుత్వం చేసిన తప్పులు కారణంగా రాష్ట్రంలో అనేక సమస్యలు ఇంకా ఉన్నాయని తెలియజేశారు చంద్రబాబు. వాటిని సరి చేసుకొని కేంద్ర సాయంతో ముందుకెళ్తున్నామని లీడర్లకు తెలియజేశారు. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం ఉంది కాబట్టే మనం చాలా వరకు నెట్టుకు రాగలుగుతున్నామని తెలిపారు. ఎన్ని కష్టనష్టాలు ఉన్నా అవసరమైనప్పుడు ప్రజలకు అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. విజయవాడ వరదల సమయంలో బాధితులకు అండగా ఉన్నామని తెలిపారు.

### - కూటమిగా వచ్చే ఎన్నికల్లో పోటీ

వచ్చే ఎన్నికల విషయంలో కూడా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 ఎన్నికల్లో కూడా కూటమిగానే ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు చంద్రబాబు. అందుకే అన్ని పార్టీల నేతలతో సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం, రాష్ట్రం చేస్తున్న మంచి పనులు ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. గెలిచాం కాబట్టి ఇప్పుడు అందరిపై బాధ్యత ఉందన్నారు చంద్రబాబు. ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీల్లో దాదాపు 80 మందికి వరకు కొత్తవారే ఉన్నారని పేర్కొన్నారు. ఎన్ని మనస్పర్థలు ఉన్నా ఓ కుటుంబ పెద్దగా అందరూ కలిసి ఉండాలని కోరుకుంటానని అన్నారు. ప్రజలు ఎదురు ప్రశ్నించే పరిస్థితికి రావద్దని హితవు పలికారు.(వచ్చే ఎన్నికల కోసం ప్రధానమంత్రి మోదీ ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నారని అలాంటి ఓర్పు సహనం అందరూ అలవర్చుకోవాలని సూచించారు చంద్రబాబు. హర్యానా సీఎం ప్రమాణ స్వీకారానికి వచ్చిన ప్రధానమంత్రి ఐదు గంటల పాటు కూర్చున్నారంటే ఆయన ఆలోచన ఏంటో తెలుసుకోవాలన్నారు. సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటా అందర్నీ కలుపుకుంటూ వెళ్తూ మూడోసారి ప్రధానిగా ఆరోసారి సొంత రాష్ట్రంలో పార్టీని గెలిపించారన్నారు. హర్యానాలో కూడా హ్యాట్రిక్ కొట్టారని తెలిపారు. చేసిన ప్రతి పనిలో ప్రజలు కనిపిస్తుంటే కచ్చితంగా ఇలాంటి ఫలితాలే వస్తాయని వివరించారు. ఎక్కడా తప్పు చేయకుండా నేతలతో తప్పు చేయనీయకుండా ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు.

## గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు యథాతథం

జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో యథావిధిగా సోమవారం నుంచి తెలంగాణలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మరోవైపు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రూప్ 1 పరీక్షల నిర్వహణకు సంబంధించి ఈనెల 15వ తేదీన తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను హైకోర్టు సింగిల్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ బెంచ్ తీర్పు వచ్చిన రెండు రోజుల తర్వాత అభ్యర్థులు మళ్లీ కోర్టు మెట్లెక్కారు. అయితే సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ముగ్గురు అభ్యర్థులు డివిజన్ బెంచ్ ముందు అప్పీల్ చేశారు. తాజాగా సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్, పరీక్షల నిర్వహణకే మొగ్గు చూపింది. తెలంగాణ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు మొత్తం 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. జూన్ 9వ తేదీన నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు మొత్తం 3.02 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. మరోవైపు గ్రూప్ 1 అభ్యర్థులు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జీవో 29ను రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. జీవో 29 వల్ల జరిగే నష్టాన్ని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు.. తమ లాయర్ వివరించినట్లు అభ్యర్థులు పేర్కొన్నారు. అయితే అక్టోబర్ 21వ తేదీన మొదటి కేసుగా తీసుకొని విచారిస్తామని సుప్రీంకోర్టు వాయిదా వేసినట్లు తెలిపారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చే లోపే జీవో 29ను రద్దు చేయాలని గ్రూప్ 1 అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

## అది బ్యూటిఫికేషన్ కాదు లూటిఫికేషన్ ప్రాజెక్ట్

విజ్ఞాన ప్రదర్శన చేస్తున్నానని అనుకుని తన పరువు తీసుకున్నారని కేటీఆర్ సెటైర్ వేశారు. ఆయన చెప్పినవన్నీ అవాస్తవాలేనన్నారు.

### - మూసి లూటిఫికేషన్ ప్రాజెక్ట్

రేవంత్ ప్రభుత్వం మూసీ లూటిఫికేషన్ అని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. పాపం బయటపడుతుందని చెప్పి రేవంత్ రెడ్డి తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి సర్వే జరగలేదని స్పష్టం చేశారు. సర్వే జరగలేదని ప్రజలే చెబుతున్నారని కానీ రేవంత్ మాత్రం మూడు నెలల పాటు సర్వే చేస్తున్నామని అబద్ధాలు ఆడుతున్నారన్నారు. ఒక్క మట్టి పెళ్ల కూలగొట్టలేదని రేవంత్ అంటున్నారని కానీ జేసీబీలతో, కూలీలను పెట్టి ఇండ్లు కూలగొడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా వచ్చాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఇండ్లను కూలగొట్టేందుకు వచ్చిన ఓ కూలీ కూడా బాధపడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వచ్చాయన్నారు.

### - గ్రాఫిక్స్‌తో మాయ చేసే ప్రయత్నం

కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తున్న క్రమంలో గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. లక్షన్నర కోట్ల కుంభణానికి కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అటకెక్కించారు. 420 హామీలతో ప్రజల గొంతు కోశారన్నారు. ముఖ్యమంత్రి మూసీ ప్రేమంతా ఢిల్లీకి పంపే మూటల కోసమే అని తేలిపోయిందన్నారు. నోట్ల రద్దు చేసినప్పుడు మోదీ చెప్పిన మాటల మాదిరిగా చోటే భాయ్ రేవంత్ మూసీపై రోజుకో మాట మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు.

## గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేదు

వారికి మద్దతు తెలుపుతానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 కారణంగా గ్రూప్ 1 అభ్యర్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమేనని బండి సంజయ్ విమర్శించారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై లాఠీచార్జ్ చేస్తున్నారని మండిపడ్డారు. 15 వేల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చి.. 60 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేదని బండి సంజయ్ విమర్శించారు.కేసీఆర్ అనాలోచిత విధానాలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేసే ఆలోచన లేదన్నారు. ప్రణాళిక ప్రకారమే జీవో 29 ఇచ్చారని ఆరోపించారు. నిరుద్యోగుల ఉసురు తగిలే బీఆర్ఎస్ ఓడిపోయిందన్న బండి సంజయ్ నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీకి లేదన్నారు. ప్రశ్నపత్రాలు లీకేజీ చేసి నిరుద్యోగుల భవిష్యత్ ను బీఆర్ఎస్ నాశనం చేసిందని బండి సంజయ్ ధ్వజమెత్తారు.

### - ఆందోళన చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల లాఠీ-ఛార్జ్

అక్టోబర్ 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ రోడ్లపైకి చేరుకున్నారు. ప్లకార్డులతో రోడ్లపైకి వచ్చిన 16 మందిని పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు లాఠీ ఛార్జి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. వందల సంఖ్యలో నిరసన చేపట్టిన అభ్యర్థులు గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షల్లో తప్పులు, జీవో 29 సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అశోక్ నగర్ లో పోలీసులు భారీగా మోహరించారు. శుక్రవారం రాత్రి ఈ ప్రాంతంలోని కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయడం గమనార్హం. కాగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభ్యర్థులపై లాఠీఛార్జిని ఖండించారు. గ్రూప్ -1 అభ్యర్థులకు తమ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. మరోవైపు, అక్టోబర్ 21 నుంచి నిర్వహించనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్-1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. దీంతో షెడ్యూల్ ప్రకారమే ఈనెల 21 గ్రూప్-1 పరీక్షలు జరగనున్నాయి.

## సినిమా బాగుంటే ఆ పేరుతో మద్యం బ్రాండ్లు

తీసుకొచ్చినవే. రాష్ట్రంలో 20 డిస్టిలరీస్ ఉంటే అందులో 14 డిస్టిలరీస్ లైసెన్సులు బాబు హయాంలో వచ్చినవే. వైసీపీ హయాంలో ఒక్క డిస్టిలరీకి కూడా పర్మిషన్ ఇవ్వలేదు. మా హయాంలో మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గించాం. మద్యాన్ని నియంత్రిస్తూనే ప్రభుత్వ ఆదాయం పెంచాం. చంద్రబాబు పాలనలో మద్యం ఏరులై పారుతోంది. రాష్ట్రంలో పేకాట క్లబ్స్ పెరిగిపోయాయి.' అని జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### - పజల ఆశలతో చెలగాటం

సీఎం చంద్రబాబు అబద్ధాలకు రెక్కలు కట్టారని ఎన్నికలప్పుడు ప్రజల ఆశలతో చెలగాటమాడుతూ తప్పుడు ప్రచారాలు చేశారని జగన్ మండిపడ్డారు. 'అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక అమలుకు క్లిష్ట పరిస్థితులు ఉన్నాయంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఓ వైపు ఉచిత ఇసుక అంటున్నారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం పడిపోయింది. ఇసుక ధరలు చూస్తే దారుణంగా ఉన్నాయి. గతంలో ఏడాదికి రూ.750 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చేది. ఈ 5 నెలల్లో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం సున్నా. రూ.10 వేలు ఇస్తామని చెప్పి వాలంటీర్లను మోసం చేశారు. పిల్లలకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. గ్రామస్థాయిలో మద్యం మాఫియా నడుస్తోంది. ఎమ్మార్పీ రేట్ల కంటే ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్నారు.' అంటూ జగన్ ధ్వజమెత్తారు. అధికార పార్టీ మనుషులకో ఇసుక తీసే కాంట్రాక్టులు కట్టబెట్టారని జగన్ మండిపడ్డారు. టెండర్‌కు 2 రోజులు మాత్రమే సమయం ఇచ్చారని అందరూ పండుగ బిజీలో ఉంటే దోచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. వైసీపీ హయంలో పారదర్శకంగా ఇసుక విధానం తెచ్చామని దోపిడీకి అవకాశం లేని విధంగా చేశామని చెప్పారు.

### - చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇచ్చిందా?

సీమెన్స్ ప్రాజెక్టు కోసం చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేశారని షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్ల నిధులు మళ్లించారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సామ్రాజ్యం ఉంటే గోబెల్స్ ప్రచారం చేసుకుంటారా.? అని ప్రశ్నించారు. 'తనకు ఈడీ క్లీన్ చిట్ ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. స్కిల్ స్కామ్‌లో ఈడీ ప్రెస్ నోటి రిలీజ్ చేసింది. చంద్రబాబుకు క్లీన్ చిట్ అని ఎక్కడైనా ఉందా.?. నిధులు మళ్లించినందుకే ఈడీ ఆస్తులను అటాచ్ చేసింది.' అని జగన్ పేర్కొన్నారు.

## యూనివర్సిటీలకు కొత్త వీసీలు

యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వ విద్యాలయం ఉన్నాయి. అయితే వీసీల నియామకానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం 1380కిపైగా అప్లికేషన్లు రావడంతో వీసీల ఎంపిక బాధ్యతను తెలంగాణ విద్యాశాఖ సెర్చ్ కమిటీలకు అప్పగించింది. ఆ దరఖాస్తులను అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన సెర్చ్ కమిటీ.. చివరికి ఒక జాబితాను తయారు చేసి ఇటీవలె గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించింది. ఆ జాబితాను పరిశీలించిన గవర్నర్.. చివరికి ఆమోదం కల్పించారు. దీంతో 9 వర్సిటీలకు వీసీలను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది.

**- యూనివర్సిటీ పేరు- కొత్త వీసీ** ఉస్మానియా యూనివర్సిటీ - ప్రొఫెసర్ కుమార్ కాకతీయ యూనివర్సిటీ - ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి మహాత్మా గాంధీ యూనివర్సిటీ - ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ తెలంగాణ యూనివర్సిటీ - ప్రొఫెసర్ యాదగిరి రావు పాలమూరు యూనివర్సిటీ - ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలుగు యూనివర్సిటీ - ప్రొఫెసర్ నిత్యానందరావు శాతవాహన యూనివర్సిటీ - ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ - అల్దాస్ జానయ్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం - ప్రొఫెసర్ రాజిరెడ్డి

## స్కిల్ యూనివర్శిటీకి అదానీ గ్రూప్ రూ.100 కోట్ల విరాళం

ఇచ్చారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రూ.100 కోట్ల విరాళానికి సంబంధించిన చెక్కును శుక్రవారం హైదరాబాద్‌లో అందజేశారు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు. ఈ మేరకు తెలంగాణ సీఎంఓ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. అందుకు సంబంధించిన ఫోటోలను పంచుకుంది. 'అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం కలిశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ప్రకటించిన రూ.100 కోట్ల చెక్కును అందజేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఈ గొప్ప ప్రయత్నానికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా అదానీ హామీ ఇచ్చారు.' అని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతకుమారితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### - మూడేళ్లలో 18 విభాగాలు

స్కిల్ యూనివర్శిటీలో మూడు దశల్లో 18 రంగాలకు చెందిన విభాగాల్లో యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. తొలిదశలో ఈ కామర్స్, హెల్త్ కేర్, ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్, యానిమేషన్ - విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, కన్‌స్ట్రక్షన్ రంగాలకు చెందిన స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. రెండో దశలో ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, తర్వాత డిజిటల్ డిజైన్, ఎలక్ట్రానిక్స్ - సెమీ కండక్టర్స్ ఉన్నాయి. మొదటి దశలో 2 వేల మందికి, రెండో దశలో 10 వేల మందికి, మూడో దశలో 20 వేల మందికి పెంచాలన్నది లక్ష్యం. వర్శిటీలో కోర్సును బట్టి 3 నెలల నుంచి ఏడాది వరకూ ఉంటుంది.

### - స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా..

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాను నియమించింది తెలంగాణ ప్రభుత్వం. ఆయన ఈ పదవిలో ఏడాది పాటు కొనసాగుతారని గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలోని ముచ్చర్ల, బేగరికంచె ప్రాంతంలో ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం చేపడుతోంది ప్రభుత్వం. మొత్తం 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ప్రతి ఏడాది లక్ష మందికిపైగా శిక్షణ ఇచ్చేలా రానున్న రోజుల్లో ఈ స్కిల్ యూనివర్సిటీని విస్తరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవంతిలో ఈ స్కిల్ యూనివర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

# థర్టీ ఇయర్ ఇండస్ట్రీకి కష్టకాలం తప్పదా

**నిజామాబాద్ :** ఎంత పనైపోయింది అధ్యక్ష. పెద్ద కుర్చీలో కూర్చుని.. గులాబీ దళపతితోనే లక్ష్మీ పుత్రుడని పిలిపించుకున్న పోచారానికి?సొంత నియోజకవర్గంలో కుంపటి కాకపుట్టిస్తోంది. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు హవా నడిపించిన మాజీ మంత్రి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి..కాంగ్రెస్‌లో కూడా అదే రేంజ్‌లో రాజకీయాలు నడిపిద్దామంటే పప్పులు ఉడకడం లేదట. దీంతో గత కొంతకాలంగా రగిలిపోతున్న పెద్దాయన? ఓ మాట అనేస్తే పోలా..అందరూ సైలెంట్ అయిపోతారని స్కెచ్ వేశారట.ఇంకేముంది తనకు కళ్లలో నలుసులా మారిన అనుమూల నేత, బాన్సువాడ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి మీద బాణం ఎక్కుపెట్టారు. అయితే అది కాస్త రివర్స్ అయి పోచారం వైపే దూసుకువస్తుండటంతో ఇప్పుడు పెద్దాయనకు ఏం చేయాలో పాలు పోవడం లేదట. అంతేకాదు మరో కొత్త బాణం బీఆర్ఎస్ నుంచి కూడా పోచారం వైపే దూసుకువస్తుండటంతో పెద్దాయనకు దిక్కుతోచడం లేదట. తానోటి అనుకుంటే ఇంకోటే అయిందని పరేషాన్‌లో పడిపోయారట మాజీ శాసనసభాపతి.బాన్సువాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి తర్వాత హస్తం గూటికి చేరారు. అప్పటికే కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిన ఏనుగు రవీందర్‌రెడ్డి బాన్సువాడ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్నారు. దీంతో ఏనుగు రవీందర్రెడ్డి చెప్పినట్లే అధికారులు నడుచుకుంటున్నారట. బదిలీలు, పనులన్నీ ఆయన కనుసైగల్లోనే జరుగుతున్నాయట. ఎన్నో ఏండ్లుగా బాన్సువాడను శాసించిన పోచారంకు ఇది మింగుడు పడటం లేదట. అధికారులు మాజీ ఎమ్మెల్యే మాటకే విలువ ఇస్తుండటంతో దీనికి ఎలాగో ఒకలా చెక్ పెట్టాలనుకున్న పెద్దాయన ఓ మాట అనేశారట.ఏనుగు రవీందర్ రెడ్డికి బాన్సువాడతో సంబంధమే లేదని.. ఏకంగా సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లే తనకు చెప్పారని చెప్పుకొచ్చారు. అధిష్టానం దగ్గర తన మాటే నడుస్తుందన్నట్లుగా ఈ డైలాగ్‌తో తనను పట్టించుకోని అధికారులకు, నేతలకు, కార్యకర్తలకు వార్నింగ్ ఇచ్చే ప్రయత్నం చేశారు పోచారం.దీంతో రంగంలోకి దిగారు నియోజకవర్గం ఇంఛార్జి ఏనుగు రవీందర్రెడ్డి. పోచారం వ్యాఖ్యలకు ఘాటుగా రియాక్ట్ అయ్యారు. తానెందుకు నియోజకవర్గాన్ని వదిలిపెట్టి వెళ్లాలంటూ ప్రశ్నించారు. తనకు అధిష్టానం ఏమీ చెప్పలేదని.. నియోజకవర్గానికి రావొద్దంటూ తనకెవరైనా చెప్పినట్లు పోచారం ప్రమాణం చేయదానికి సిద్ధమా అంటూ సవాల్ విసిరారు ఏనుగు రవీందర్ రెడ్డి. అంతేకాదు పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని?మరి ఆయా నియోజకవర్గాల్లోని ఓడిన నేతలంతా నియోజకవర్గాలను వదిలి వెళ్లాలా అంటూ పోచారంను మరింత చిక్కుల్లోకి నెట్టారు ఏనుగు.అధిష్టానం నిజంగానే ఏనుగు రవీందర్‌రెడ్డికి నియోజకవర్గానికి దూరంగా ఉండాలని చెప్పిందా.. లేక పోచారం ఊరికే తానే బాన్సువాడ బాస్ అని చెప్పుకునేందుకు బాంబ్ పేల్చారా అన్న చర్చ మొదలైంది. సిచ్యువేషన్‌ను తన కంట్రోల్ లోకి తెచ్చుకునేందుకు పెద్దాయన స్కెచ్ వేస్తే.. అది ఆయనని మరింత చిక్కుల్లోకి నెట్టిందనే టాక్ నియోజకవర్గంలో నడుస్తోంది.ఈ ఇద్దరి గోల ఇలా కొనసాగుతుండగానే సీన్ లోకి బీఆర్ఎస్ ఎంట్రీ ఇచ్చింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌ను కార్నర్ చేస్తూ..మాజీమంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో చేసిన పోస్టు మరింత దుమారం రేపుతోంది. బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచిన పోచారం కాంగ్రెస్‌లోకి వెళ్లడాని?తనకు తానే ఒప్పేసుకున్నారంటూ ఆయన మాటలను ట్యాగ్ చేస్తూ హరీశ్ విమర్శలు గుప్పించారు. పార్టీ ఫిరాయించినందుకే పోచారంకు వ్యవసాయశాఖ సలహాదారు పదవి ఇచ్చారా అంటూ కార్నర్ చేశారు. దీంతో పోచారం పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా అయిపోయిందట.తానొకటి అనుకుంటే ఇంకోటి అయిందని గొనుక్కుంటున్నారట. ఇలా ఇరుక్కుపోయానేంటని మదన పడుతున్నారట. ఇప్పటివరకు ఏనుగు రవీందర్ రెడ్డితోనే తలనొప్పి ఉందంటే ఇప్పుడు బీఆర్ఎస్‌కు కూడా దొరికిపోయానేంట్రా అంటూ తలపట్టుకుంటున్నారట. ఈ వ్యవహారానికి కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి ముగింపు ఇస్తుందో చూడాలి.

# తమ్ముళ్లు తగ్గొద్దు.. ధైర్యంగా చెప్పండి

- మంగళగిరిలో టీడీపీ ప్రజాప్రతినిధుల సమావేశం
- టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- మేనిఫోస్టో హామీల అమలుపై ధైర్యంగా చెప్పాలని సూచనా
- ఏపీకి ఒకటే రాజధాని అది అమరావతి అని స్పష్టం
- దీపావళికి ఉచిత గ్యాస్ పథకం ప్రారంభం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** హామీ అమలు ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్న అంశం ఇదే. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తోందని హామీల అమలు ఏమైందంటూ వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. మరీ ముఖ్యంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పదే పదే ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఎన్నికల సమయంలో చిన్నపిల్లలకు, మహిళలకు, వృద్ధులకు, నిరుద్యోగ యువతకు, రైతులకు ఇలా అందరికీ హామీలు ఇచ్చారని ఇప్పుడం ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అదే తాము అధికారంలో ఉండి ఉంటే ఇప్పటికే రైతుభరోసా, చేయూత, అమ్మ ఒడి ఇలా అన్ని పథకాలు ఇప్పటికే అమలు చేసి ఉండేవారమని చెప్తున్నారు. టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని సూపర్ సిక్స్ కాదు అవుట్ అంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఇక ఇదే విషయమై శుక్రవారం కూడా వైఎస్ జగన్ ప్రెస్ మీట్ పెట్టి విమర్శలు గుప్పించారు. అయితే వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శలకు సీఎం చంద్రబాబు నాయుడు కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు చంద్రబాబు. ఇదే సమయంలో వైఎస్ జగన్ పదే పదే చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కూటమి సర్కారు చేసిన పనులు ఇవీ అంటూ చంద్రబాబు లిస్ట్ విడుదల చేశారు. వైసీపీ విమర్శలకు దీటుగా బదులివ్వాలని ఎన్నికల మేనిఫెస్టో అమలుపై ధైర్యంగా చెప్పండంటూ పార్టీ నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీల అమలు మొదలుపెట్టామని త్వరలోనే మరిన్ని అమలు చేస్తామని చెప్పాలన్నారు."ఇచ్చిన మాట ప్రకారం చెత్తపన్ను రద్దు చేశాం. మత్స్యకారుల పొట్టగొట్టే 217 జీవో రద్దు చేశాం. స్వర్ణకారులు కార్పొరేషన్ పెట్టాం. గీత కులాలకు మద్యం షాపుల్లో రిజర్వేషన్లు ఇచ్చాం. అర్చకుల జీతాలు రూ.10 వేలకు పెంచాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలకు వేతనం పెంచాం. ధూపదీప నైవేద్యాలకు రూ.5 వేల నుంచి 10 వేలకు పెంచాం. వేద పాఠశాలల్లో చదువుకున్న వారికి నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తున్నాం. చేనేత వస్త్రాలకు జీఎస్టీ ఎత్తేయాలని కేంద్రాన్ని కోరతాం. కేంద్రం ఇవ్వకపోతే రీయింబర్స్ చేస్తాం. చేనేత కార్మికుల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా రూ.50 వేలు అందిస్తాం. పారదర్శక పాలనలో భాగంగా జీవోలు కూడా ఆన్ లైన్‌లో పెట్టాం" అని చంద్రబాబు చెప్పారు. అమరావతే రాజధానిగా ఉంటుందన్న చంద్రబాబు విశాఖ ఆర్థిక రాజధానిగా ఉంటుందన్నారు. అలాగే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఓర్వకల్లు, ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తామని చెప్పారు రైతులకు డ్రిప్‌లు అందిస్తున్నామనీ పాడి రైతులకు 90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. విశాఖ రైల్వే జోన్ క్లియర్ అయ్యిందన్న చంద్రబాబు రాజధాని రైతులకు రూ.400 కోట్లు బకాయిలు చెల్లించిన సంగతిని గుర్తుచేశారు. శాంతిభద్రతల విషయంలోనూ రాజీ పడకుండా నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్నామని వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీలకు జనాభా దామాషా ప్రకారం పదవులు ఇస్తున్నామని ఇంటి నిర్మాణానికి రూ.4.30 లక్షలు ఇవ్వడంతో పాటు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం అందిస్తామని చెప్పారు. ఇక దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామని ఇవన్నీ ధైర్యంగా చెప్పాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# 21 నుంచి గ్రూప్ వన్ మెయిన్స్

**హైదరాబాద్ :** గ్రూప్ 1 మెయిన్స్‌కు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి సీఎస్ శాంతికుమారి ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21వ తేదీ నుండి 27 వ తేదీ వరకు జరిగే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుండి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు పాల్గొనగా, సచివాలయం నుండి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరవుతుండగా, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు.పరీక్షలు నిర్వహించే అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు, విస్తృత స్థాయిలో సీనియర్ అధికారులతో పర్యవేక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు సీఎస్. జిల్లా కలెక్టర్లు నేరుగా ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారని, సంబంధిత పోలీస్ కమిషనర్లు కూడా బందోబస్తు ఏర్పాట్లను చేపడుతారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఏవిధమైన స్వల్ప సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా ఈ పరీక్షల నిర్వహణ విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, 2011 తర్వాత గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని, ప్రతీ అంశంలోనూ అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని, ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, వదంతులకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ఇటు, గ్రూప్ 1 జరిగే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విస్తృతమైన బందోబస్తుతోపాటు అంతా ప్రశాంతంగా కొనసాగేందుకు అన్ని చర్యలు చేపట్టామని డీజీపీ జితేందర్ తెలిపారు.ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా వీటిని పర్యవేక్షిస్తారు. పరీక్షల నిర్వహణలో ప్రతి స్టెప్‌లోనూ కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలు అందజేశారు అధికారులు. బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకై ప్రత్యేక సిబ్బంది నియామకం మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించరు దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంట సమయం అదనంగా కేటాయింపు ఎవరికైతే పరీక్ష రాయడానికి సహాయకులు (స్క్రైబ్) అవసరమో, ఆ అభ్యర్థుల హాల్ టికెట్లపై ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది

# సిద్ధప్పకు బిగిస్తున్న ఉచ్చు

**బెంగళూరు :** ఈడి అధికారులు కర్ణాటకలోని మైసూరు డెవలప్మెంట్ అథారిటీ (ముడా) ఆఫీసలు శుక్రవారం తనిఖీలు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యులు ముడా భూముల్లో కేటాయింపుల్లో అవినీతికి పాల్పడ్డారని.. ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందని ఆరోపణలు రావడంతో 12 మంది ఈడీ అధికారుల బృందం.. మైసూరు లోని ముడా ఆఫీసుతో పాటు పలు చోట్ల తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో ముడా కమిషనర్ రఘునందన్ తో పాటు స్పెషల్ ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసుకు చెందిన పలువురు అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆఫీసుల్లోని పలు కీలక ఫైల్స్‌ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ అధికారులందరికీ ముడా భూకుంభకోణంలో పాత్ర ఉందని అధికారులు అనుమానిస్తున్నట్లు జాతీయ మీడియా తెలిపింది.ఈడీ అధికారుల వెంట కేంద్ర పారామిలిటరీ బలగాలు కూడా తనిఖీల్లో పాల్గొనడం గమనార్హం. ఈడీ అధికారులు తనిఖీలు చేసిన ఆఫీసులన్నింటికీ ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లేదా ఆయన కుటుంబ సభ్యులతో లింక్ ఉన్నట్లు తెలుస్తోంది.ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అందరు ముడా అధికారులను ఈడీ అధికారులు.. విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది.ఇక ఈడీ అధికారుల తనిఖీల సందర్భంగా కేంద్ర పారామిలటరీ ఫోర్స్ వారి వెంబడి భద్రత కోసం రావడం గమనార్హం. మైసూరులోని వివిధ ప్రాంతాల్లో ఈడీ అధికారుల సోదాలు కొనసాగాయి. అయితే ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గానీ.. ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో గానీ, వారికి సంబంధించిన వారి ఇళ్లల్లో సోదాలు జరగలేదని అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవలె అనారోగ్యం కారణంగా ముడా చైర్మన్ కే మరిగౌడ రాజీనామా చేయడం.. ఆ వెంటనే ఈడీ అధికారులు రంగంలోకి దిగడం సంచలనంగా మారింది.సిద్ధరామయ్య భార్య పార్వతి.. వివిధ ప్రాజెక్టుల కోసం మైసూరులోని ఇతర ప్రాంతాల్లో ఉన్న తన 3.16 ఎకరాల భూమిని ఇవ్వడంతో ముడా పరిధిలోని 14 ప్లాట్లను ఆమెకు కేటాయించారు. ఇందులో రూ.45 కోట్ల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిదిపై ఆరోపణలు వచ్చాయి. ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యతో పాటు మాజీ చైర్మన్ కే మరిగౌడ ప్రమేయం కూడా ఉన్నట్లు ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. అయితే ఈ ముడా స్కామ్ ఆరోపణలు రావడంతో ఆ ప్లాట్లను సిద్ధరామయ్య భార్య తిరిగి ముడాకు అప్పగించింది. ఈ కేసులో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని సీఎం సిద్ధరామయ్య కర్ణాటక హైకోర్టులో సవాల్ చేయగా. అక్కడ ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది.ముడా భూ కుంబకోణంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాత్ర ఉందని ఆరోపణలు రావడంతో ఆయనను విచారణ చేసేందుకు కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ అనుమతులిచ్చారు. గవర్నర్ అనుమతలను వ్యతిరేకిస్తూ.. ముఖ్యమంత్రి సిద్దరామయ్య హై కోర్టులో సవాల్ చేశారు. కానీ ఆయన కోర్టు ఆయన విచారణకు హాజరుకావాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు ఈడీ అధికారులు సిద్దరామయ్య అండ్ ఫ్యామిలీపై గురి పెట్టారు.ముడా స్కామ్ లో సిద్దరామయ్య తనకు వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను నిర్వీర్యం చేస్తున్నారని ఈడీ ఇప్పటికే కోర్టుకు తెలిపింది. సిఎం భార్య ముడా భూములను తిరిగి ఇచ్చేసినా విచారణ మాత్రం ఆపేది లేదని ఈడీ అధికారులు తెలిపారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలైన బిజేపీ, జెడిఎస్ ముడా స్కామ్ లో సిబిఐ విచారణకు డిమాండ్ చేస్తున్నాయి. కానీ కర్ణాటక ప్రభుత్వం సిబిఐ విచారణకు రాష్ట్రంలో అనుమతిని నిరాకరించింది.

# రాజమండ్రికి అనిల్ తరలింపు

**హైదరాబాద్ :** గతంలో సోషల్ మీడియా వేదికగా చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసు బోరుగడ్డ అనిల్‌ను వెంటాడుతుంది. బుధవారం గుంటూరులో అనిల్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు గురువారం జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐదో అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు ఆయనకు ఈనెల 29 వరకు రిమాండ్ విధించింది. అనిల్‌ను పోలీసులు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.గుంటూరుకు చెందిన అనిల్ రిపబ్లికన్ పార్టీ ఏపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. వైసీపీ హయాంలో బోరుగడ్డ అనిల్ సోషల్ మీడియా వేదికగా హాట్ కామెంట్స్ చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ టార్గెట్‌గా విమర్శలు గుప్పించారు. దీంతో పలు పోలీస్ స్టేషన్‌లలో అనిల్‌పై కేసులు నమోదయ్యాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో బోరుగడ్డ అనిల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కొంతకాలం హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల గుంటూరులోని తన ఇంటికి వచ్చారు అనిల్. పట్టాభిపురంలో అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

# పోలీస్ స్టేషన్‌లోనే ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం..

**వరంగల్ :** జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడే సంఘటన జరిగింది. భార్యాభర్తల పంచాయతీలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి అక్కడే ఒంటిపై పెట్రోల్ పోసుకొని పట్టించుకున్నాడు. అతన్ని అడ్డుకుబోయిన పోలీసులకు ఆ నిప్పనీటుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో స్పందించిన తోటి సిబ్బంది హుటాహుటీన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.పాలకుర్తి మండలం కొండాపురం గ్రామ శివారు మేకలతండాకు చెందిన లాకవత్ శీను ? అతని భార్య రాధిక మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు చెలరేగుతున్నాయి. భర్త వేధింపులు భరించలేక మనోవేధన గురైన రాధిక పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శ్రీనును పోలీసులు పాలకుర్తి పోలీస్ స్టేషన్ పిలిపించారు. భార్యాభర్తలిద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రములో ఒక్కసారిగా ఊగిపోయిన శ్రీనివాస్ తన వాహనంలోని పెట్రోలు తీసి తన ఒంటిపై కోసుకున్నాడు. అంతటితో ఆగకుండా వెంటనే నిప్పంటించుకున్నాడు.అయితే ఇదంతా పోలీసుల ముందే జరగడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. కాపాడబోయిన ఎస్సై సాయి ప్రసన్నకుమార్, కానిస్టేబుల్ రవీందర్‌కు ఆ మంటలు అంటుకున్నాయి. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కానిస్టేబుల్ రవీందర్ చేతులు, కాళ్ళకు నిప్పు అంటుకుంది. గాయాలపాలైన శ్రీనుతోపాటు ఇద్దరు పోలీస్ సిబ్బందిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పాలకుర్తి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగ్గైన చికిత్స కోసం శీను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# అమెరికాలో బాలికపై లైంగిక వేధింపులు

**హైదరాబాద్ :** పెద్దమనిషిగా చెలామణి అయ్యాడు. తెలుగు వారికి అండగా నిలిచానన్నాడు. అంతా తానై ఉంటానంటూ భరోసా ఇచ్చాడు. ఇదంతా నిజమేనని నమ్మారు తెలుగువారు. ఇన్నాళ్ల తర్వాత అసలు రంగు తెలిసి అవాక్కయ్యారు. ఛీ. ఇంతటి నీచుడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అమెరికా వర్జీనియాలో తెలుగు వ్యక్తి ఫణి తాళ్లూరిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ బాలికపై పలుమార్లు లైంగికదాడికి తెగబడినట్లు వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లైంగికదాడితోపాటు నగ్నఫొటోలతో బెదిరించినట్లు బాధితురాలు ఆరోపించింది. వేధింపులు భరించలేక తల్లిదండ్రులతో కలిసి పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటకు వచ్చింది. 2022 నుంచి దర్యాప్తు చేపట్టిన అమెరికా పోలీసులు తాజాగా ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఫణి తాళ్లూరి అడల్ట్ డిటెన్షన్ సెంటర్‌లో ఉన్నాడు.అమెరికా చట్టాల మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడితే రాజీలతో ప్రమేయం లేకుండా సదరు నిందితులపై చట్ట ప్రకారం కోర్టుల ద్వారా విచారణ చేపట్టి శిక్ష విధిస్తారు. ఫణి తాళ్లూరిపై వస్తున్న ఆరోపణలు అన్ని రుజువైతే ఆయనకు 60ఏళ్ల శిక్ష పడే అవకాశముంది. అమెరికాలో లైంగికదాడి కేసులో తెలుగువాడి అరెస్టు కలవరం పుట్టించింది. తెలుగు కమ్యూనిటీలో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. ఫణి బాధితులు చాలామందే ఉన్నారనే చర్చ కొనసాగుతోంది. పదుల సంఖ్యలో మైనర్లపై ఫణి అఘాయిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నా.. బయటకు వచ్చింది ఒక్కరే అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఫణి తాళ్లూరు అసలు రంగు ఇప్పటికైనా బయట పడిందంటున్నారు ఔఖీఎలు. విరాళాల పేరుతో, సమాజ సేవ చేస్తున్నట్టు బిల్డప్ ఇస్తూ పెద్దమనిషిగా చలామణి అయ్యారని ఆరోపించారు. లైంగికదాడులతో ఫణి అసలు రంగు తెలియడంతో షాక్‌కు గురయ్యారు. తెలుగువారు ఎక్కువగా ఉండే 'వర్జీనియా యాష్‌బర్న్' ప్రాంతంలో ఫణి తాళ్లూరి బాధితులు ఇంకా ఎందరున్నారు..? వాళ్లు కూడా నోరు విప్పుతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది

# బోల్తా పడ్డ వన్య ప్రాణి లారీ

**అదిలాబాద్ :** నిర్మల్ జిల్లాలోని మొండిగుట్ట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వన్యప్రాణులను తరలిస్తున్న లారీ బోల్తా పడింది. దీంతో 2 మొసళ్లు రహదారిపై పడ్డాయి. అదృష్టవశాత్తు వన్యప్రాణులన్నీ సురక్షితంగా బయటపడ్డాయి. బీహార్ రాజధాని పట్నాలోని సంజయ్ గాంధీ జాతీయ జూపార్కు నుంచి వివిధ రకాల వన్యప్రాణులను రెండు వాహనాల్లో బెంగళూరులోని బన్నేర్‌గట్ట జాతీయ జూపార్కుకు తరలిస్తున్నారు. వీటిలో మరియాల్ జాతి 8 మొసళ్లు, రెండు తెల్ల ఏనుగులు, రెండు తెల్లపులులు సహా ఇతర జంతువులు ఉన్నాయి. ఈ క్రమంలో మామడ మండలంలోని మొండిగుట్ట గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ఓ ట్రక్కు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి సిమెంట్ స్తంభాన్ని ఢీకొట్టగా.. వాహనం రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో 8 మొసళ్లలో రెండు బయటపడ్డాయి.

# అక్టోబర్ 23న ఏపీ కేబినెట్ భేటీ

పంపాలని లేఖలో సూచించారు. మరోవైపు ఏపీ కేబినెట్ భేటీ ఇటీవలే జరిగింది. అక్టోబర్ 16వ తేదీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం కూడా లభించింది. ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన పాలసీలు, క్లీన్ ఎనర్జీ పాలసీలకు ఆమోదం లభించింది. ఇక ధరల నియంత్రణ, డ్రగ్స్ నియంత్రణ, ఉద్యోగాల కల్పనపై మంత్రులతో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే వారం రోజులు కూడా తిరగకుండానే మరోసారి మంత్రివర్గం భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి అక్టోబర్ పదో తేదీన ఏపీ కేబినెట్ భేటీ జరగాల్సింది.

అయితే రతన్ టాటా మరణంతో మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. అనంతరం అక్టోబర్ 16న ఏపీ కేబినెట్ భేటీ అయ్యింది. ఇది జరిగిన వారం రోజులలోనే అక్టోబర్ 23న మరోసారి భేటీ కానుంది. దీపావళి నుంచి ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో మొన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే ఈ పథకం అమలుకు పచ్చజెండా ఊపుతారని అందరూ భావించారు. అయితే మొన్నటి కేబినెట్ భేటీలో పారిశ్రామిక పాలసీలపైనా ప్రధానంగా చర్చ జరిగింది. ఇక అక్టోబర్ 31న దీపావళి పండుగ రానుంది. ఈ నేపథ్యంలో ఆలోపే మరోసారి మంత్రివర్గ సమావేశం నిర్వహించి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు ఆమోదం తెలపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే అక్టోబర్ 23న మంత్రివర్గ భేటీ జరనుంది. ఈ సమావేశంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు, విధివిధానాలతో పాటుగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుపైనా చర్చించనున్నట్లు సమాచారం. అలాగే సూపర్ సిక్స్ హామీల అమలు ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిసింది. అలాగే చెత్త పన్ను రద్దు, వరద ప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్, దేవాలయాల పాలకమండళ్ల నియామకంలో చట్ట సవరణ వంటి విషయాలపై చర్చించనున్నట్లు సమాచారం. కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపి దీపావళి కానుక కింద ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

# వరదలతో చెన్నై, బెంగళూరు ప్రజలకు కష్టాలు

**- హైడ్రా, మూసి ప్రక్షాళనకు నైతిక బలం వచ్చినట్లేనా ?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో గత రెండు నెలలుగా కూల్చివేతలు, మూసి ప్రక్షాళన అంశం హాట్ టాపిక్స్ గా ఉన్నాయి. చెరువులను కబ్జా చేసి నిర్మించిన ఇళ్లు, ప్రభుత్వ భూముల్లో నిర్మించిన భవనాలు, మూసిని ఆక్రమించేసి కట్టిన కాలనీలను ప్రభుత్వం ఖళీ చేయిస్తోది. కూల్చేస్తోంది. దీనిపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. తాము కూల్చివేతల్ని అడ్డుకుంటామని ప్రకటిస్తూ వస్తున్నాయి . అయితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మూసి ప్రకాళన, చెరువుల కబ్జాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని గట్టిగానే చెబుతున్నారు. హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఆయన అంటున్నారు. ప్రస్తుతం కొన్ని సమస్యల కారణంగా కూల్చివేతలు ఆగాయి.

## చెన్నై, బెంగళూరుల్లో వరదలతో కొత్త చర్చ

న్యాయపరమైన సమస్యల కారణంగా హైడ్రా కూల్చివేతలు ఆగాయి. ఈ సమయంలో చెన్నై , బెంగళూరు నగరాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఈ రెండు నగరాలు రోజంతా నీళ్లలో మునిగితేలుతున్నాయి. వాహనాలు ఎక్కడ మ్మునిగిపోతాయోనని చెన్నై వాసులు తమ కార్లను ఫ్లైఓవర్ల మీద పార్క్ చేసుకుంటున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. నిజానికి చెన్నైకి ఈ సమస్య గతంలోనూ వచ్చింది. అందుకే ముందు జాగ్రత్తగా వారు ఈ పని చేసుకున్నారు. ఇక బెంగళూరులోనూ అదే పరిస్థితి కనిపించింది. వర్షం దెబ్బకు నీళ్లు నిలబడిపోవడంతో ఎవరూ బయటకు రావొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే మనల్ని మనం సంస్కరించుకోవాలని తెలంగాణలో ఈ వానల వల్ల ప్రచారం ప్రారంభమయింది.

## హైదరాబాద్‌కు రికార్డు స్థాయి వర్షాలొస్తే నరకమే

నిజానికి వర్షాలు వస్తే ముంపు సమస్య ఉండేది చెన్నై, బెంగళూరుకు మాత్రమే కాదు. హైదరాబాద్‌కూ ఎక్కువే. నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో రెండు గంటల పాటు కురిసిన వర్షానికి సగం హైదరాబాద్‌లో విధ్వంసం కనిపించింది. వందేళ్లలో వచ్చిన వరద అని ప్రభుత్వం సరి పెట్టుకుంది. కానీ మళ్లీ వందేళ్ల దాకా రాదన్న గ్యారంటీ లేదు. ఇప్పుడు పడుతున్న వర్షాల కారణంగా గట్టిగా గంట సేద జడి వాన కురిస్తే జన జీవనం స్తంభించిపోతుంది. కాలనీల్లోకి నీళు వస్తాయి. అంతంతమాత్రంగా ఉన్న చెరువులు పొంగుతాయి. దీనికి కారణం నాలాలు సహా మూసి నది కూడా ఆక్రమణకు గురి కావడంతో చెరువుల్లో కొన్ని అడ్రస్ లేకుండా పోవడం కూడా ఈ పరిస్థితికి కారణం.

## హైదరాబాద్‌ను కాపాడుకోవాలంటున్న తెలంగాణ ప్రభుత్వం

కబ్జాలు చేసిన వారిని శిక్షిస్తే ఇళ్లు తొలగిస్తే ప్రజా వ్యతిరేకత వస్తుందన్న కారణంగా వెనుకడుగు వేస్తే హైదరాబాద్ భవిష్యత్‌కు పెను ప్రమాదమని కాంగ్రెస్ వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి. ముఖ్యంగా రేవంత్ రెడ్డి ఈ విషయంలో చాలా స్పష్టతగా ఉన్నారు. అక్రమార్కుల్ని కబ్జా దారుల్ని ఇబ్బంది పెడితే సామాన్య జనం వ్యతిరేకంగా మారబోరని.. హైదరాబాద్ ను కష్టాల నుంచి గట్టెక్కిస్తే అందరూ తనకు మద్దతుగా ఉంటారని అనుకుంటున్నారు. మూసిని ప్రక్షాళన చేయకపోతే మొదటికే మోసం వస్తుందని ఆయన ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇలాంటి విపత్తులు వచ్చినప్పుడు చెప్పుకోవడానికి ఓ అవకాశం ఉంటుంది. ప్రజలు కూడా ఆలోచించడానికి అవకాశం ఏర్పడుతుంది.

# 3 రోజులు... 15 బెదిరింపు కాల్స్

**ముంబై :** బాంబు పెట్టాం.. పేల్చిపారేస్తాం.. దమ్ముంటే కాపాడుకోండి..! అంటూ ఒక అజ్ఞాతవాసి నుంచి బెదిరింపు స్వరం. తీరాచూస్తే అంతా తూచ్. ఇదీ వరస. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ ఫ్లైట్లన్న తేడా లేదు. ఉత్తుత్తి బెదిరింపులతో వేలాదిమంది ప్యాసింజర్లు బెంబేలెత్తిపోయారు. ప్రాణాలు గుప్పిట పట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి. అటు.. ఏవియేషన్ యంత్రాంగానిక్కూడా చుక్కలు కనిపించాయి.గత మూడు రోజుల్లోనే మొత్తం 15 బాంబ్ థ్రెట్స్ నమోదయ్యాయి. అక్టోబర్ 16, బుధవారం.. ఈ ఒక్కరోజులోనే ఆరు విమానాలకు బాంబు బెదిరింపులొచ్చాయి. కాకపోతే అన్నీ ఫేకే..! అందరూ క్షేమం. మూడు ఇండిగో, రెండు స్పైస్‌జెట్.. ఒకటి ఆకాశ ఎయిర్.. మొత్తం ఆరు ప్లేన్లలో ప్రయాణికుల్ని బెంబేలెత్తించాయి బోగస్ ఫోన్‌కాల్స్.ఢిల్లీ నుంచి చికాగో వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం.. అగంతకుల బెదిరింపు కారణంగా దారిమళ్లించాల్సి వచ్చింది. సీక్రెట్‌గా ఒక రిమోట్ ఎయిర్‌పోర్ట్‌లో దింపి.. అందులోని 200 మంది ప్రయాణికుల్ని కాపాడారు. వీళ్లను ఎయిర్‌లిఫ్ట్ చేయడం కోసం.. రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన అఅ-330 యుద్ధ విమానాన్ని వాడారు.ఇటీవలే తిరుపతి విమానాశ్రయానికే బెదిరింపు లేఖ వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా సీఐఎస్ఎఫ్ అధికార వెబ్‌సైట్‌కు పంపిన లేఖను గోప్యంగా ఉంచింది ఎయిర్‌పోర్ట్ అథారిటీ. పోలీసులకు ఫిర్యాదు చేసి, ఈ-మెయిల్ ఆధారంగా నిందితుడ్ని పట్టుకునే ప్రయత్నం జరుగుతోంది.ఒకవైపు ప్యాసింజర్లకు అసౌకర్యం.. మరోవైపు ఫ్లయిట్ షెడ్యూల్స్ మార్చాల్సి రావడం..! ఫేక్ కాల్స్‌తో ఈ హైరానా పడలేకున్నాం అంటూ ప్రైవేట్ ఎయిర్‌లైన్ సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతోంది. అందుకే.. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్.. ప్లస్ హోమ్ మినిస్ట్రీ.. కలిసి కూర్చుని.. హైలెవల్ మీటింగ్ పెట్టుకుని.. వాట్‌టు డూ.. వాట్‌నాట్ టూడూ అని చర్చించాయి. అగంతకుల్ని పసిగట్టి.. వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిసైడయ్యాయి.ఫేక్ గాళ్లందరికీ అడ్డా సోషల్ మీడియానే. ఎక్కువగా ట్వీట్ల ద్వారానే అగంతకులు ఓవరాక్షన్‌కు పాల్పడుతున్నట్టు తేలింది. వీలైతే వీళ్లను మళ్లీ విమానమెక్కనివ్వకుండా నో-ఫ్లై లిస్టులో చేర్చాలని, ఆర్థికంగా నష్టపోయిన విమానయాన సంస్థలకు వాళ్లతోనే పరిహారం ఇప్పించాలని.. ఐదేళ్ల జైలు శిక్ష వేయాలని ప్రపోజల్స్ వస్తున్నాయి. ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం, 1934 సబార్డినేట్ చట్టాలకు సవరణలు చేసేందుకు కేంద్రంలోని ఉన్నత అధికార వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి న్యాయనిపుణులతో మాట్లాడి లీగల్ ఒపీనియన్ తీసుకుంటోంది కేంద్ర సర్కార్. అటు.. వరుస బెదిరింపుల వెనక ఏదైనా విదేశీ హస్తం ఉందా అనే అనుమానాల్ని పరిశీలిస్తోంది కేంద్ర ప్రభుత్వం.

# నాకు న్యాయం చేయండి..

**తాండూరు** బషీరాబాద్ పోలీస్ స్టేషన్ నందు పెట్రోల్ డబ్బాతో గిరిజన మహిళ ఆత్మహత్యయత్నం చేసింది. నాకు న్యాయం చేయండి అంటూ ఓ గిరిజన మహిళ పోలీస్టేషన్ మెట్లు ఎక్కింది. పెట్రోల్ డబ్బా వెంట తెచ్చుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన బషీరాబాద్ పోలీస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. బషీరాబాద్ మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన దేవీబాయికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. చాలా ఏళ్ల క్రితం దేవీబాయి భర్త చనిపోయాడు. అయితే దేవీబాయి నాలుగు నెలల క్రితం తన పెద్ద కూతురును అదే గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిపించింది. అప్పటికే కూతురుకు కంసాన్పల్లి తాండాకు చెందిన యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. పెళ్లి అయిన కొన్ని రోజుల తరువాత కూతురు ప్రేమికుడితో వెళ్లిపోయింది. ఆ తరువాత కూతురు, ప్రేమికుడిని పిలిపించి ఇరు కుటుంభ సభ్యులతో కుల పంచాయతీని పెట్టారు. ఈ పంచాయతీలో భర్త కుటుంబికులు ప్రేమికుడి నుంచి రూ. 14లక్షల పరిహారం ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. ఇందుకు ప్రేమికుడు రెండు నెలల గడువులో భర్త కుటుంబానికి ఇస్తానని అంగీకరించారు.ఇచ్చిన సమయం దాటినా కూడా ప్రేమికుడు డబ్బులు ఇవ్వక పోవడంతో కూతురు భర్త కుటుంభీకులు దేవీబాయిపై ఒత్తిడి తీసుకవచ్చారు. ఈ క్రమంలో తనకు న్యాయం చేయాలంటూ దేవీబాయి బషీరాబాద్ పోలీస్టేషన్కు వచ్చింది. వెంట పెట్రోల్ బాటిల్ తీసుకవచ్చి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. గమనించిన పోలీసులు డబ్బా తీసుకుని దేవీబాయిని సముదాయించారు. ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడుతామని ఎస్ఐ గఫార్ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

## గర్భిణీకి పురిటి నొప్పులు

# డోలీలో 5 కి.మీ. ప్రయాణం

**అనకాపల్లి** గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో గర్భిణీని డోలీలో సుమారు 5 కిలో మీటర్లు మోసుకెళ్లిన ఘటన ఏపీలో అనకాపల్లి జిల్లాలో చోటు చేసుకుంది. కూటమి గవర్నమెంట్ వచ్చినా ఇక్కడ ప్రజలు సమస్యలు తీరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనకాపల్లి జిల్లాలో రోలుగుంట మండలం పితృగడ్డ కొండ శిఖరంలో కొర్ర దేవి అనే గర్భిణీకి గురువారం రాత్రి 12 గంటలకు పురిటి నొప్పులు వచ్చాయి.

దాంతో భర్త కొర్ర రమేష్ కుటుంబ సభ్యుల సహకారంతో డోలీలో కొర్ర దేవిని 5 కి.మీ. మోసుకెళ్లారు. అనంతరం అంబులెన్స్కు ఫోన్ చేయగా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆటోలో బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించారు.

## లారీ ఢీకొని పారేస్ట్ ప్రొటెక్షన్ వాచర్ మృతి



**తిరుపతి** తొట్టంబేడు మండల పరిధిలోని బసవయ్యపాలెం దగ్గర గల సింగమాల ఫారెస్టు చెక్ పోస్టు లో ప్రొటెక్షన్ వాచర్ గా వెంకటేష్ విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి ఒంటి గంట సమయములో పెద్ద కన్నలి ఎస్టీ కాలనీ సమీపంలో హైవే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బందికి అంతకుముందు జరిగిన ఒక ఆక్సిడెంట్ లొకేషన్ చూపించాడానికి వెళు తున్నాడు. వారి వాహనాన్ని జాతీయ రహదారిపై వేగంగా ఒక ఐచర్ వాహనం ఢీకొట్టడం తో వెంకటేష్ వాహనములో నే మృతి చెందాడు. ఈ ఘటన లో ఇద్దరు కానిస్టేబుళ్ల కు స్వల్ప గాయాలు అయ్యాయి.

# ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు దుర్మరణం

**అన్నమయ్య** అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గం లోని ములకలచెరువు బస్టాండు కూడలిలో ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు దుర్మరణం చెందిన విషాదకర సంఘటన శుక్రవారం ఉదయం ఏడు గంటలకు జరిగింది. ఘటనపై సీఐ రాజారమేష్ తెలిపిన వివరాలు. మండలంలోని గుట్టకిందపల్లెకు చెందిన నరసింహులు కొడుకు రైతు శంకరప్ప(54), సొంతపని మీద ములకలచెరువుకు వచ్చాడు. బస్టాండ్ లో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి శంకరప్పను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితున్ని 108లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

# దేవస్థానాలలో ఆన్లైన్ సేవలు

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన దేవాలయాల్లో సేవలను బుక్ చేయడం ఇప్పుడు మరింత సులభతరంగా మారింది. ఈ సేవలు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉండనున్నాయి. దీని ద్వారా భక్తులు ఇంటి వద్ద నుంచే తమ పూజలు, హాల్ బుకింగ్స్ వంటి అవసరాలను పూర్తి చేసుకోవచ్చు. రాష్ట్రంలోని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, వరంగల్‌లోని రుద్రేశ్వర ఆలయం (రామప్ప దేవాలయం), వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, కాళేశ్వరం శివ ఆలయం వంటి ప్రసిద్ధ దేవాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.అనేక ప్రసిద్ధ దేవాలయాలు ఇప్పుడు తమ సేవలను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందిస్తున్నాయి. భక్తులు తమకు కావాల్సిన పూజలను లేదా వివాహాల కోసం హాల్‌లను ముందుగానే బుక్ చేసుకోవచ్చు. ఈ విధానం భక్తులకు చాలా సౌలభ్యంగా ఉంటుంది, ముఖ్యంగా శుభ ముహూర్తాల సమయంలో వివాహాల సంఖ్య ఎక్కువగా ఉండే కారణంగా, ఫంక్షన్ హాల్స్ కోసం పోటీ పెరుగుతుంది.ఈ సేవల కోసం ప్రత్యేక వెబ్‌సైట్లు ఏర్పాటు చేయబడ్డాయి, అక్కడ భక్తులు ఆలయాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో సేవలను బుక్ చేసుకోవచ్చు. పూజల రుసుములు, వివాహాల కోసం హాల్స్ ఖాళీగా ఉన్న తేదీలు వంటి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.సుందరాచలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వంటి దేవాలయాలు కూడా ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించాయని కథనం తెలియజేస్తుంది.ఆన్లైన్ బుకింగ్ అన్ని ం ఒజాజూ టనీశ్రీతినీ ద్వారా చేసుకోవచ్చు ప్రసాదాలను సైతం ఇంటి వద్ద నుండే బుక్ చేసుకునే వెసలు బాటను కల్పించారు. దీంతోపాటు దేవస్థానం యొక్క చరిత్రను సైతం ఆన్లైన్లో తెలుసుకునే విధంగా యాప్ను తీర్చిదిద్దారు. మరోవైపు స్వామివారి సేవలకు సంబంధించిన వాటిని సైతం ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు. సుప్రభాతం అభిషేకం సహస్రనామ అర్చన నిత్య కళ్యాణం తోపాటు 11 రకాల పూజలను ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు.ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 8 దేవస్థానాలలో ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు.

# ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా చేరడం లేదు..

## - ఏమిటీ పరిణామం.. ఎందుకీ దుస్థితి?

**హైదరాబాద్ :** సర్కార్ ఉద్యోగం కోసం గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సిటీకి వచ్చి మరీ కష్టపడుతుంటారు. ఏళ్లుగా ఖర్చులు చేస్తూ.. నిద్రాహారాలు మాని కష్టపడి చదువుతారు. అయితే.. ప్రభుత్వ కొలువు దక్కినా కొందరు గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగం చేసేందుకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దేశంలో ప్రభుత్వ ఉద్యోగం కోసం లక్షలాది యువత ఎదురుచూస్తూనే ఉంది. డిమాండుకు అనుగుణంగా ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించకపోవడంతో నానాటికీ నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. అయితే.. ఇక్కడ మాత్రం వింత పరిస్థితి కనిపించింది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినప్పటికీ జాయిన్ కాకుండా కొంత మంది దూరంగా ఉండిపోయారు. అది అక్కడో ఇక్కడో కాదు.. తెలంగాణ రాష్ట్రంలోనే కనిపించిన పరిస్థితి. ఉద్యోగానికి ఎంపికై కూడా పదుల సంఖ్యలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాకపోవడంపై ఆశ్చర్యం నెలకొంది.సర్కార్ ఉద్యోగం కోసం గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సిటీకి వచ్చి మరీ కష్టపడుతుంటారు. ఏళ్లుగా ఖర్చులు చేస్తూ.. నిద్రాహారాలు మాని కష్టపడి చదువుతారు. అయితే.. ప్రభుత్వ కొలువు దక్కినా కొందరు గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగం చేసేందుకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో చేయడం ఇష్టం లేకనో.. ఆ కొలువులు లేకనో కానీ నియామక పత్రాలు అందుకున్న చాలా మంది ఇప్పటికీ జాయిన్ కాకపోవడం ఆందోళన కలిగించే అంశం.టీజీపీఎస్సీ ద్వారా రాష్ట్ర నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)ల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో భాగంగా మొత్తంగా 687 మంది ఎంపికయ్యారు. 674 మంది మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. వారంతా నియామకపత్రాలు అందుకున్నారు. మిగిలిన 13 మంది మాత్రం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరవ్వలేదు. నియామకపత్రాలు అందుకున్న వారు ఈనెల 25 నాటికి పోస్టింగ్ వచ్చిన చోట రిపోర్టింగ్ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు కేవలం 310 మంది మాత్రమే రిపోర్టు చేశారు. గత నెల 26న నియామక పత్రాలు అందజేయగా.. రిపోర్టు చేయడానికి 8 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. యువ ఇంజినీర్లకు తొలి పోస్టింగును గ్రామీణ ప్రాంతాల్లోని ఇస్తామని, ఎలాంటి ఒత్తిళ్లు తీసుకురావద్దని రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పోస్టింగ్ ఇచ్చే సమయంలో చెప్పారు. అన్ని రకాల సదుపాయాలు ఉంటాయని భరోసా ఇచ్చారు.ఇక. హైదరాబాద్ చీఫ్ ఇంజినీర్ పరిధిలో 10 మంది ఏఈఈలకు పోస్టింగ్ ఇస్తే ఇప్పటికీ 9 మంది రిపోర్టు చేశారు. మహబూబ్‌నగర్ సీఈకి 48 మందిని కేటాయిస్తే కేవలం 8 మంది రిపోర్టు చేశారు. ఇక నల్లగొండ సీఈకి 76 మందిని కేటాయిస్తే 49 మంది, సూర్యాపేటకు 32 మందిని కేటాయిస్తే కేవలం ఇద్దరు మాత్రమే రిపోర్టు చేశారు. ఆదిలాబాద్ సీఈకి 24 మందిని కేటాయిస్తే 15 మంది, వనపర్తికి 53 మందిని కేటాయిస్తే 16 మంది, వరంగల్‌కు 30 మందిని కేటాయిస్తే కేవలం ఏడుగురు మాత్రమే రిపోర్టు చేశారు. అలాగే.. గజ్వేల్ పరిధిలో 72 మందిని కేటాయిస్తే 12 మంది, కరీంనగర్ సీఈకి 45 మందిని కేటాయిస్తే 14 మంది మాత్రమే ఇప్పటివరకు విధుల్లో చేరారు. ఈ 8 ఎనిమిది రోజుల్లో మిగితా క్యాండిడేట్స్ విధుల్లో చేరుతారా..? లేదంటే జాబ్స్‌ను వదిలేస్తారా..? అనేది తెలియకుండా ఉంది.

# రైల్వేలకు మహర్దశ

**సికింద్రాబాద్ :** తెలంగాణలో రైల్వే లైన్ల అభివృద్ధిపై భారత రైల్వే దృష్టిపెట్టింది. గడిచిన పదేళ్లలో రైలుమార్గాల విస్తరణ, విద్యుదీకరణ, మూడో లైన్ పనులు చేస్తోంది. కొత్త రైలు మార్గాలను కూడా ప్రతిపాదించింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం మూడు రైల్వే స్టేషన్లతోపాటు కొత్తగా చర్లపల్లి రైల్వే టెర్మినల్ కూడా అందుబాటులోకి వస్తుంది. అయినా రైళ్ల రద్దీకి అనుగుణంగా జంక్షన్లు లేవు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రద్దీ, భవిష్యత్‌లో పెరగనున్న రైళ్లను దృష్టిలో ఉంచుకుని మరో రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు?నడికుడి మార్గంలో నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వే స్టేషన్‌ను రైల్వే జంక్షన్‌గా మార్చాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించిందిఇదిలా ఉంటే.. దామచర్ల మండలం వీర్లపాలెం వద్ద 20 వేల మెగావాట్ల సామర్థ్యంలో తెలంగాణలోనే అతిపెద్ద థర్మల్ విద్యుత్ పస్లాంటును నిర్మిస్తున్నారు. దీనికి సమీపంలోనే విష్ణుపురం రైల్వే స్టేషన్ ఉంది. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ప్రతీరోజు 21 వ్యాగన్ల బొగ్గు పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి సరఫరా చేయాల్సి ఉంటుంది. జాన్‌పహాడ్ మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్‌కు అదనంగా మరో లైన్ నిర్మిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని విష్ణుపురం స్టేషన్‌ను జంక్షన్‌ను చేయాలని అధికారులు ప్రతిపాదించారు.రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలంటే.. మూడు రైలు మార్గాలు ఒకేచోట కలవాలి. విష్ణుపురం వద్ద గుంటూరు?బీబీనగర్ రైల్వేలైన్ మార్గం ఒక్కటే ఉంది. దీనిని రెండు వరుసలుగా విస్తరిస్తున్నారు. మిర్యాలగూడ?గుంతకల్లు రైల్వేలైన్ సైతం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ మార్గంలో రైల్లు నడిపితే రద్దీ పెరుగుతుంది.

విష్ణుపురం రైల్వే స్టేషన్ రద్దీగా మారుతుంది. ఇక గుంటూరు?జాన్‌పహాడ్ లైను, వీర్లపాలెం థర్మల్ ప్లాంటు ట్రైన్ మార్గాలు సైతం ఇక్కడే కలుస్తాయి. ఈ నేపథ్యంలో ఇక్కడే జంక్షన్ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రైల్వే లైన్ల నిర్మాణం జరుగుతోంది. త్వరలోనే జంక్షన్‌కు అవసరమైన విద్యుత్, రైల్వే సురక్షిత సౌకర్యాలు కల్పించనున్నారు.రైలు ప్రమాదాల నివారణకు భారత రైల్వే సంస్థ ఇటీవలే కవచ్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. ఈ టెక్నాలజీని కూడా విష్ణుపురం జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు 5 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అనుసంధానంగా రైల్వే జంక్షన్‌లో అవసరమైన పనులు జరిపించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

# ఫుట్ పాత్‌లపై హైడ్రా గురి...

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరం?లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ట్రాఫిక్ విభాగంతో కలిసి పని చేయాలని నిర్ణయించింది హైడ్రా. ట్రాఫిక్ సమస్యకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కూడా ఓ కారణంగా భావిస్తున్న హైడ్రా.. ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసింది. త్వరలోనే ఆపరేషన్ ఫుట్ పాత్‌ను స్టార్ట్ చేయనుంది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ కమిషనర్ విశ్వప్రసాద్ సమావేశమయ్యారు. ట్రాఫిక్ సమస్య సహా ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్చించారు. ఎక్కడెక్కడ ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయో గుర్తించి, ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఆ తర్వాత బుల్‌డోజర్లతో వెళ్లి కూల్చేయనున్నారు. కేవలం ఫుట్‌పాత్‌పై ఆక్రమణలే కాదు.. ఆ ప్లేస్‌లో ప్రభుత్వానికి చెందిన ఎలాంటి షాపులున్నా, ఏమాత్రం ఆలోచించకుండా కూల్చేయనున్నారు.ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపుతో పాటు డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని హైడ్రా నిర్ణయం తీసుకుంది. హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు లేని సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులతో కలిసి హైడ్రా డీఆర్ఎఫ్ బృందం కలిసి పని చేసేలా ఏర్పాట్లు చేయాలని వారు సమావేశంలో చర్చించారు.రెండు విభాగాలు కలసి పని చేయాలని, ముఖ్యమైన సమయాల్లో హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది కూడా రంగంలోకి దించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్షం పడినప్పుడు వరద నీరు (వాటర్ లాగింగ్) చేరే ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి నీటిని తొలగించేందుకు డీఆర్ఎఫ్ బృందాలతో ట్రాఫిక్ పోలీసులు కలిసి పని చేస్తాయని అధికారులు తెలిపారు. వెంటనే నీరు తొలిగించేలా హార్స్ పవర్ ఎక్కువ ఉన్న మోటర్ల వినియోగంచనున్నట్లు వెల్లడించారు. ఆ నీటిని ఎక్కడకు తోడాలనేదానిపై చర్చ జరిగినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు, వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, కొత్త లైన్లను వేసి వరదకు శాశ్వత పరిష్కారం చూపడం వంటివి చేస్తామని వారు తెలిపారు.వర్షం పడినప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని డిసైడ్ అయ్యారు. తక్షణమే నీరు తొలిగించేలా హైపవర్ మోటర్లను వినియోగించాలని నిర్ణయించారు. హైడ్రా, ట్రాఫిక్ విభాగం కలిసి వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, కొత్త లైన్లను వేసి వరదకు శాశ్వత పరిష్కారం చూపనున్నారు.అలాగే జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగాలతో కలిసి నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటమే కాదు.. నగర ప్రజలు సాఫీగా నడచుకుని వెళ్లే విధంగా ఫుట్‌పాత్‌లను రూపొందించాలని నిర్ణయించింది హైడ్రా. అలాగే కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించాలని డిసైడైంది. మొత్తంగా.. పలు విభాగాలు, ప్రజల భాగస్వామ్యంతో భాగ్యనగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది హైడ్రా.

## అక్టోబర్ 20నపానుగల్ లో సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు



**వనపర్తి** పానగల్ మండల కేంద్రంలో ఆదివారం అక్టోబర్ 20వ తేదీన సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్ తెలిపారు. వనపర్తి సిపిఐ ఆఫీసులో మాట్లాడారు. సిపిఐ రాజకీయ విధానం క్యాడర్లోకి బలంగా తీసుకువెళ్లి, గ్రామాల్లో పార్టీని పటిష్టం చేయటం, ప్రజా సమస్యలపై పోరాటం లక్ష్యాలుగా తరగతులు ఉంటాయన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ఎండి యూసఫ్, ఉమామహేశ్వర్, జిల్లా కార్యదర్శి విజయరాములు 'సమకాలీన రాజకీయాలు', 'వివిధ రాజకీయ పార్టీలు సిపిఐ విశిష్టత"పార్టీ నిర్మాణం'అంశాలపై ప్రసంగిస్తారన్నారు. జిల్లా పార్టీ బాధ్యులు పాల్గొనాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి కళావతమ్మ, గోపాలకృష్ణ, పట్టణ నాయకులు జయమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

# అన్విత... మోసాల పంట...

**హైదరాబాద్ :** తెలంగాణలో రియల్ భూం కొన్ని కంపెనీలకు కాసుల పంట కురిపిస్తోంది. వివాదాస్పద భూముల్లో పాగా వేయడం, కస్టమర్లకు అంటగట్టి తప్పించుకోవడం షరా మామూలే. కొన్ని కంపెనీలు అయితే ప్రీలాంచ్ పేరుతో డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేస్తాయి. దీనికి చక్కటి ఉదాహరణ సాహితీ ఇన్‌ఫ్రా. సామాన్యుల సొంతింటి కలను ఆసరాగా చేసుకుని ప్రీలాంచ్ పేరుతో డబ్బులు వసూలు చేసే కంపెనీలు చాలానే ఉన్నాయి. వాటిలో అన్విత బిల్డర్స్ ఒకటి. తాజాగా ఈ కంపెనీకి సంబంధించిన ఆఫీసులు, ఓనర్ల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలకు దిగడంతో ఈ కంపెనీ వ్యవహారాలపై చర్చ జరుగుతోంది.అన్విత బిల్డర్స్ కార్యాలయాల్లో ఐటీ అధికారులు సుదీర్ఘ సోదాలు నిర్వహించారు ఐటీ అధికారులు. వచ్చిన ఆదాయానికి చెల్లించిన పన్నులకు మధ్య భారీగా తేడాలు ఉన్నట్టు గుర్తించారు. అంతేకాదు భారీగా పన్ను ఎగవేసినట్టు కూడా తేలింది. అన్విత బిల్డర్స్ కార్యాలయాల్లో భారీగా రికార్డులను సీజ్ చేశారు. జూబ్లీహిల్స్, రాయదుర్గం, చైతన్యపురి, మలక్‌పేట్, కొల్లూరులోని ఎండీ బొప్పన అచ్యుతరావు, డైరెక్టర్ బొప్పన అనూప్ ఇళ్లు, ఆఫీసుల్లో ఈ సోదాలు చేశారు అధికారులు. సింగపూర్, దుబాయ్‌లో ఇంటీరియర్ బిజినెస్ ద్వారా భారీగా ఆదాయాన్ని సంపాదించినట్టు గుర్తించారు అధికారులు. అసలు ఈ కంపెనీకి పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చాయన్న దానిపై యాజమాన్యం, డైరెక్టర్లపై ప్రశ్నల వర్షం కురిపించారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు కూడా తేల్చినట్టు తెలుస్తోంది.నిజానికి అన్విత బిల్డర్స్ చేస్తున్న ప్రాజెక్టులన్నీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. బాచుపల్లి లో భువి రెసిడెన్సీ పేరుతో 2021లో ఓ చిన్న ప్రాజెక్ట్ చేపట్టగా, అది 2023లో పూర్తి చేసింది. తర్వాత కొల్లూరుపై కన్నేసింది. అన్వితా ఇవానా, అన్విత హై9 పేరుతో దశల వారీగా ప్రాజెక్టులు చేపట్టింది. అలాగే అన్విత అమరి, అన్విత కమర్షియల్ పేర్లతో మొత్తం 60 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టింది. ఇవన్నీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. కానీ, ప్రీలాంచ్ పేరుతో ముందుగానే డబ్బులు వసూలు చేసింది. ఇవానా ప్రాజెక్టును 22.15 ఎకరాల్లో రెండు దశల్లో పూర్తయ్యేలా చేపట్టింది.

మొదటి దశలో 12.9 ఎకరాల్లో 15 అంతస్తుల్లో రెండు టవర్ల నిర్మాణం ఉంటుందని, 2024 డిసెంబర్‌కు పూర్తి చేస్తామని చెప్పింది. రెండో దశలో 9.25 ఎకరాల్లో 36 అంతస్తుల్లో 4 భారీ టవర్లను నిర్మిస్తామని, 2027లో దీన్ని పూర్తి చేస్తామని కస్టమర్లను నమ్మించింది. ఇది రూ.2వేల కోట్ల మెగా ప్రాజెక్ట్. ఇంత మొత్తంలో డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనేది పెద్ద ప్రశ్న. ప్రీలాంచ్ పేరుతో కొంత వసూళ్లు చేసినా, ఇంకా ఇతర ప్రాజెక్టుల్లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. త్వరలో నీలాద్రి ఫామ్స్ పేరుతో ఫామ్ ల్యాండ్ ప్రాజెక్ట్‌నూ చేపడుతున్నట్టు చెప్పింది. ఇక, సంస్థ డైరెక్టర్ బొప్పన అనూప్ అనేక కంపెనీల్లో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. చిన్న వయసులోనూ ఇన్ని సంస్థల్లో కీలకంగా వ్యవహరించడంతో ఐటీ శాఖకు అనేక అనుమానాలు కలిగాయి. దీంతో సోదాలకు దిగింది. కీలక విషయాలు వెలుగుచూశాయి.

# ఎవరికి వారే.. యమునా తీరే...

## - కమలంలో నేతల కవ్వింతలు

**హైదరాబాద్ :** తెలంగాణలో భారతీయ జనతా పార్టీకి ప్రజా సమస్యలు పట్టవా? మత విద్వేషాల మీద వున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై ఉండదా?.. రోజుకొక వివాదంతో రచ్చ చేస్తోన్న నేతల తీరు మారదా? ఒకరు హిందువులపై నోరు పారేసుకుంటే మరొకరు సొంత పార్టీపైనే విమర్శలు గుప్పిస్తుంటారు. సొంత పార్టీ కార్యలయం ఉండగా.. దాన్ని వదిలేసి ప్రెస్ క్లబ్‌ను నమ్ముకుని రాజకీయం చేస్తుంటారు. ఇక ఎప్పుడో మొదలైన పాత, నేతల మధ్య రచ్చకి తెర పడదు. దాంతో తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ కంటున్న కలలు నెరవేరే పరిస్థితే లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.బీజేపీ ఆ పార్టీకి ప్రధాన బలం కులం, మతం సెంటిమెంట్లు.. అందుకే ఆ పార్టీలో ఎంట్రి ఇచ్చిన వారందరూ హిందుత్వ అస్త్రంతోనే రాజకీయం చేయాలని చూస్తుంటారు. అందుకు నిదర్శనంగా నిలుస్తున్నారు తెలంగాణ బీజేపీ నేతలు. పదవులు లేని నేతలే కాదు, బీజేపీ ప్రజాప్రతినిధులు కూడా అదే వాయిస్ వినిపిస్తుంటారు. గతంలో మసీదులు తవ్వితే శవాలు వస్తే మీకు శివ లింగాలు వస్తే మాకు అంటూ సంచలన వాఖ్యలు చేసి వార్తల్లోకి ఎక్కిన కేంద్ర మంత్రి బండి సంజయ్ నుంచి నేటి నిజామాబాద్ ఎంపీ ధర్మపూరి అరవింద్ వరకు విద్వేషాలతో కూడిన ప్రసంగాలతో వివాదాలకు అడ్రెస్ గా నిలుస్తున్నారు.మత మీటర్ లేనిదే కిలో మీటర్ నడవలేని నేతల్లో రాజాసింగ్, బండి సంజయ్ లు ముందుంటారు. గల్లీ లీడర్ ఏం మాట్లాడినా చెల్లుబాటై ఉండొచ్చు. కానీ ఒక గౌరవప్రదమైన పదవుల్లో ఉన్నమనే సోయి లెకుండా నోటికొచ్చింది మాట్లాడుతున్న తీరు ఆ పార్టీలో దుమారం లేపుతున్నాయి. హిందుత్వం ముసుగున రెచ్చగొట్టి రాజకీయాలు చేయడం తప్ప, రాజాసింగ్, బండి సంజయ్ కు ఏం తెలియదనే విమర్శలు వస్తున్నాయి. మంత్రి పదవిలో వుండి నోటికొచ్చింది మాట్లాడటాన్ని ఏమంటారో బండి సంజయ్‌కు కాకపోయిన ఆ పార్టీ హైకమాండ్ కైనా తెలియాలి కదా అని అన్ని పార్టీల నుంచి విమర్శలు వస్తున్నాయి. అంతేకాదు రాజాసింగ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినా తీరు మారలేదనే టాక్ వినిపిస్తోంది. ఇట్లాంటి మత మీటరు కలిగిన నేతలకు గౌరవప్రదమైన పదవులు అప్పగించడం పట్ల బీజేపీజాతీయ నేతలు కూడా ప్రత్యర్థులకు టార్గెట్ అవుతున్నారు.హైదరాబాద్ పేరు మారుస్తాం. మజీదులు తవ్వితే శవాలు వస్తే మీకు, శివ లింగాలు వస్తే మాకు వంటి మాటలు మనుషుల మధ్య విద్వేషాలు పెంచుతాయి తప్ప.. మీ పార్టీ మైలెజ్ పెరుగుతుందని అనుకోవడం అవివేకమే అవుతోంది తప్ప మరోకటి కాదన్న విమర్శలు వస్తున్నాయి. రెండు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన బండి సంజయ్ పై ఇటు పొలిటికల్‌గాను.. కేంద్రమంత్రిగా వ్యవహరిస్తున్న తీరుపై అన్ని వర్గాల్లోను వ్యతిరేకత వస్తుంది.ప్రభుత్వాన్ని పడగొడుతాం, ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారంలోకి వస్తాం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి వుంటే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపించే వాళ్ళం, కేసీఆర్‌ఆస్తులను జప్తు చేసేవాళ్లం, కవిత బెయిల్ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు అయ్యి అభిషేక్ మనుసింగ్ ను తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపించారనే ప్రకటనలు చేసి ఆయన నవ్వుల పాలయ్యారనే టాక్ వినిపించింది. అంతేకాదు కవిత బెయిల్ వచ్చిన రోజే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒప్పందం ప్రకారమే కవితకు బెయిల్ వచ్చిందని బండి సంజయ్ నోరు పారేసుకుని, సుప్రీం కోర్ట్ పరువు తీశారనీ, ఆయనను వెంటనే హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలనే డిమాండ్లు కూడా వినిపించాయి.సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఏపీసోడ్లో ఆ పార్టీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడీ రాకేష్ రెడ్డి హిందువులకు చీము నెత్తురు లేదా, గాజులేసుకుని కూర్చొన్నారా అనే రేంజ్ లో విరుచుకుపడ్డారు. ఇక మాధవి లత రూటే సపరేట్. మాటకు ముందు, మాటకు వెనక సనాతనం, హిందుత్వం తప్ప ప్రజలు, ప్రజా సమస్యలు అనే ముచ్చటే వుండదనే టాక్ ఉంది. ముత్యాలమ్మ టెంపుల్ అంశంలో ఒక కేంద్ర మంత్రి సమగ్ర విచారణ జరగాలని అంటారు, ఇంకో కేంద్రమంత్రి వెళ్లి నోరు పారేసుకుంటున్నారు. బీజేపీ చేస్తేనే హిందుత్వ యాగాలా..? పూజలా..? మిగిత ఎవరు చేసినా అవి హిందుత్వ యాగాలు పూజలు కాదా..? బీజేపీ నాయకులే హిందువులా ఇంకేవరు హిందువులు కాదా అనే ప్రశ్నలు అన్ని వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.తాజాగా ఆ పార్టీ నిజమాబాద్ ఎంపీ ధర్మాపురి అరవింద్ ఆ జాబితాల్లోకి చేరారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్ లో స్పందించిన ఆయన నుపుర్ శర్మకు మద్దతు తెలిపినందుకు రాజస్థాన్ లో ఒకర్ని గొంతు కోసి చంపేశారనీ, దాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. అంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే గొంతులు కోసే పద్దతిని ప్రోత్సహిస్తారా..? లేక బీజేపీ అధికారంలో వున్న రాష్ట్రాలలో గుడులు, మజీదులు, చర్చీలు దాడులకు గురికావడం లేదా అన్న ప్రశ్నలకు అరవింద్ సమాధానం చెప్పాలంటున్నారు. అంతేకాదు బీజేపీ ఎంపీనని మర్చిపోయినట్లు సొంత పార్టీపైనే నిప్పులు చెరిగిన ఆయన దెబ్బకు ముత్యాలమ్మ ఎపిసోడ్ సైడ్ అయిపోయింది.మొత్తం మీదా బీజేపీలో ప్రజా ప్రతినిధులు వివాదాస్పద వాఖ్యలతో అసలే అంతమాత్రంగా ఉన్న పార్టీ పరువును మరింత బజారున పడుస్తున్నారని కాషాయ కేడర్ అసహనం వ్యక్తం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణలో పుంజుకోవాలని పార్టీ పెద్దలు కంటున్న కలలు కల్లలుగానే మిగిలిపోతాయంటున్నారు

## చంద్రబాబును కలిసిన నలుగురు ఐఏస్ అధికారులు

**విజయవాడ :** ఏపీలో రిపోర్ట్ చేసిన నలుగురు ఐఏఎస్ అధికారులు ఇవాళ చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందే కేంద్రం, డీఓపీటీ ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న నలుగురు ఐఏఎస్ అధికారులు ఏపీకి వెళ్లారు.గురువారం ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ను కలిసి రిపోర్ట్ చేశారు. దీంతో ఐఏఎస్ ఆఫీసర్ల అంతర్రాష్ట్ర బదిలీల కథ తాత్కాలికంగా సుఖాంతమైంది. వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్ సీఎస్ ను కలిసి తమ జాయినింగ్ రిపోర్ట్ సమర్పించారు.ఇక ఈ నలుగురు ఐఏఎస్ ఆఫీసర్లకు ఎలాంటి శాఖలు కేటాయించనున్నరోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదే సమయంలో ఆమ్రపాలీకి ఏ శాఖ ఇవ్వనున్నారోనన్న చర్చ అధికార వర్గాల్లో మొదలైంది. దీంతో ఆమెను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన టీంలోకి తీసుకోనున్నారని సమాచారం. ఈ క్రమంలోనే నేడో రేపో అధికారిక ఉత్తర్వులు జారీ కానున్నట్లు తెలుస్తోంది.డైనమిక్ ఆఫీసర్ గా పేరు తెచ్చుకున్న ఆమ్రపాలీని కేంద్రం నుంచి రప్పించిన తెలంగాణ సర్కార్, కీలకమైన జీహెచ్ఎంసీ కమిషనర్ గా పోస్టింగ్ నియమించింది. గతంలోనూ ఆమె ప్రధాని కార్యాలయం పీఓంలోనూ విధులు నిర్వర్తించారు. అక్కడ దక్షిణాది రాష్ట్రాల వ్యవహారాలను పర్యవేక్షించారు. సుదీర్ఘకాలం కేంద్రం, తెలంగాణలో పనిచేసిన ఆమ్రపాలి ఇప్పుడు ఏపీలో పనిచేయనున్నారు. దీంతో పవన్ కల్యాణ్ ఆమె సేవలను తన శాఖలోనే వినియోగించుకోనున్నారని ప్రభుత్వ వర్గాల్లో ఓ చర్చ మొదలైంది. ఇప్పటికే కేరళ కేడర్ కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారి మైలవరపు కృష్ణతేజను పవన్ తన ఓఎస్డీగా నియమించుకున్నారు. పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, అడవులు, పర్యావరణం లాంటి శాఖలను నిర్వర్తిస్తున్న డిప్యూటీ సీఎం, ఈ నలుగురు ఐఏఎస్ అధికారుల్లో మెజారిటీ వాళ్లకు బాధ్యతలు అప్పగించనున్నారట.సొంతూరు ప్రకాశం జిల్లా అయినప్పటికీ ఆమ్రపాలికి వైజాగ్ అంటే కొట్టినపిండే. అక్కడే చదవుకున్నారు కూడానూ. ఆమె తండ్రి వెంకట్ రెడ్డి ఏయూలో ఎకనామిక్స్ ప్రొఫెసర్ గా విధులు నిర్వర్తించారట. దీంతో వైజాగ్ మున్సిపాలిటీ కమిషనర్ గానూ ఈమెను నియమించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

# సెకండ్ లెవల్ లీడర్లపై దృష్టి

**కడప :** సజ్జలకు పోలీసులు నోటీసులివ్వడంతో జగన్ అలర్ట్ అయ్యారా? కీలక నేతలకు ఇబ్బందులు తప్పవని ముందుగానే అధినేత ఊహించారా? సీనియర్లను పక్కనపెట్టి కొత్తవారికి ఛాన్స్ ఇస్తున్నారా? రాబోయే ఐదేళ్లు పార్టీ నడిపేందుకు ఈ విధంగా స్కెచ్ వేశారా? అందుకోసమే అనుబంధ సంఘాలతో భేటీ అవుతున్నారా? అవుననే సమాధానం వస్తోంది.వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మాటల్లో మార్పు వచ్చినట్టు పైకి కనిపిస్తోంది. కొద్దిరోజులపాటు నేతలకు, కేడర్‌కు దూరంగావున్న ఆయన, క్రమంగా యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తోంది. ఏదో విధంగా నిత్యం వార్తల్లో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతీ చిన్న విషయాన్ని అద్దంలో చూపించే ప్రయత్నం చేస్తున్నారు కూడా. నెగిటివ్‌ని అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారాయన.గడిచిన వంద రోజులు ప్రశాంతంగా ఉన్న మాజీ సీఎం, టెన్షన్ పట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఓ వైపు చంద్రబాబు సర్కార్ కేసులను సీఐడీకి ఇవ్వడం, మరోవైపు నేతలకు నోటీసులు తదితర పరిణామాలతో మాజీ సీఎం కలవరం పడుతున్నట్లు కనిపిస్తోంది. లేటెస్ట్‌గా గురువారం జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో భేటీ అయ్యారు జగన్.వైసీపీ నేతలకు జగన్ పలు అంశాలపై కీలక దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో కూడా నిర్మాణాత్మకంగా ఎలా ఉండాలనేది వివరించారు. పని తీరుపై పరిశీలన, మానిటరింగ్ ఉంటుందని గుర్తు చేశారు. గతంలో మాదిరిగా సోషల్ మీడియాలో నేతలంతా యాక్టివ్‌గా ఉండాలన్నది ప్రధాన ఉద్దేశం.జిల్లా అధ్యక్షుల పనితీరు ఆధారంగా ప్రమోషన్లు ఉంటాయని చెప్పకనే చెప్పారు జగన్. బాగా పని చేసేవారికి రేటింగ్స్ ఇస్తామని, రిపోర్టుల ప్రకారం నిర్ణయాలు కూడా ఉంటాయని చెప్పకనే చెప్పేశారు. కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుందన్నది అధినేత మాట. ఈ సమావేశానికి సీనియర్ నేతలు సైతం హాజరయ్యారు.జగన్ వ్యవహారశైలిని కొందరు నేతలు క్షుణ్ణంగా గమనిస్తున్నారు. నాయకుడు అనేవాడు ప్రజల్లో నుంచి రావాలని గతంలో జగన్ పదే పదే చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ సమావేశానికి ముందు జగన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు టీడీపీకి చెందిన ఓ నేత. తూర్పు గోదావరి ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు వైసీపీ కండువా కప్పుకున్నారు.

అస్సాంలో పట్టాలు తప్పిన రైలు..

# ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డ్ అత్మహత్య



హైదరాబాద్దఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి వెంకట్ రెడ్డి నగర్ లో నివాసం ఉండే హోం గార్డు వెంకట రమణయ్య(39) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పంజగుట్ట ఏసీపీ కార్యాలయంలో వెంకట రమణయ్య హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, బాడీని పోస్ట్ మార్టం కి పంపి, దర్యాప్తు చేస్తున్నారు...

# ఏం చేయాకున్నా కుక్కను కొట్టినట్లు కొట్టారు

**- సందీప్ రెడ్డి**



ఓయూ పోలీసులు నా దగ్గరికి వచ్చి పోలీస్ స్టేషన్ కి రావాలని పిలిచారు. ఎలాంటి నోటీసు లేకుండా నన్ను ఎందుకు పోలీస్ స్టేషన్ పిలుస్తున్నారని అడిగానని బాధితుడు సందీప్ రెడ్డి అన్నారు. నా భార్య ప్రెగ్నెంట్ కావడంతో హాస్పిటల్ కి వెళ్తున్నాను అని చెప్పాను.. లేదు ఇప్పుడే రావాలంటే పోలీసులు చెప్పారు. మా భార్యను ఇంట్లో దింపేసి పోలీసుల వెంబడి పోలీస్ స్టేషన్ కి వచ్చాను. పోలీస్ స్టేషన్ వచ్చాక ఓయు సిఐ చాలా అసభ్య పదజాలంతో మాట్లాడాడు. అలా ఎందుకు మాట్లాడుతున్నారని అడిగినందుకు నాపై దాడి చేశారు. 15 మంది పోలీసులు కలిసి కుక్కను కొట్టినట్టు నన్ను నా తమ్ముళ్లు ఇద్దరిని కొట్టారు. ఎందుకు తీసుకొచ్చారు రీసన్ చెప్పలేదు. పోలీసులు తప్పయింది అని చెప్పి మళ్ళీ ఇంటికి పంపిస్తున్నారు. అసలు నాపై ఎలాంటి ఫిర్యాదు రాకుండానే పోలీస్ స్టేషన్ పిలిచి కొట్టారు. నన్ను కొట్టిన పోలీసులపై అడిషనల్ డీసీపీ నరసయ్యకు ఫిర్యాదు చేశాను. వాళ్లపై చర్యలు తీసుకోకుంటే డీజీపీ వరకు వెళ్లి ఫిర్యాదు చేస్తానని అన్నారు.

# దక్షిణాది కేంద్రంగా ప్రియాంక రాజకీయాలు

**బెంగళూరు :** కాంగ్రెస్ పార్టీలో వారసులు కీలక బాధ్యతలు పంచేసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఉత్తరాది బాధ్యతను రాహుల్ గాంధీ తీసుకుంటున్నారు. దక్షిణాది బాధ్యతను ప్రియాంక గాంధీ చేపట్టబోతున్నారు. కేరళలోని వయనాడ్ ఉపఎన్నికల బరిలో ఆమె నిలబడాలని నిర్ణయించుకున్నారు. పార్టీ కూడా అంగీకరించింది. ఇంత కాలం కుటుంబబాధ్యతల కారణంగా నేరుగా ఎన్నికల బరిలోకి దిగడానికి వెనుకాడుతూ వచ్చారు. వరుసగా మూడో సారి కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఇక ఆమె కూడా నేరుగా రంగంలోకి దిగాల్సిన అవసరం ఏర్పడింది. ప్రియాంక కూడా రెడీ అయ్యారు. రాజీవ్ గాంధీ కుమార్తె రూపు రేఖల్లో ఇందిరాగాంధీలా ఉండే ప్రియాంకా గాంధీకి దేశవ్యాప్తంగా క్రేజ్ ఉంది. చాలా కాలంగా ఆమె పరోక్ష రాజకీయాల్లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారాలు చేస్తున్నా నేరుగా ఎన్నికల బరిలోకి ఎప్పుడూ దిగలేదు. తాజాగా వాయనాడ్ ఉప ఎన్నికల బరిలో దిగాలని ప్రియాంక నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా టిక్కెట్ ప్రకటించింది.కేరళలోని అద్భుతమైన ప్రకృతి టూరిజానికి కేంద్రమైన వాయనాడ్ లో ముస్లింల ప్రాబల్యం అధికం. అక్కడ గత రెండు సార్లు రాహుల్ గాంధీ గెలిచారు. ఈ సారి ఆయన సోనియా ఖాళీ చేసిన రాయ్ బరేలీ నుంచి కూడా గెలవడంతో వాయనాడ్ వదులుకున్నారు. ప్రియాంక గాంధీకి రాజకీయ ఆరంగేట్రానికి అది సేఫ్ సీటుగా భావించారు. వాయనాడ్ లో ప్రియాంక గాంధీ గెలవడం పెద్ద విషయం కాదు. దేశం అంతా మిత్రపక్షాలుగా ఉన్న కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కేరళలో మాత్రం ప్రత్యర్థులు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ వాయనాడ్‌లో వరుసగా గెలుస్తూ వస్తోంది. పోటీ చేసిన రెండు సార్లు దాదాపుగా నాలుగు లక్షల మెజార్టీని రాహుల్ గాంధీకి ఇచ్చారు అక్కడి ప్రజలు. ఈ సారి ఉపఎన్నికల్లో కూడా ప్రియాంకా గాంధీనే విజయం సాధించే అవకాశం ఉంది. అయితే ఎంపీ అవడం ప్రియాంకా గాంధీకి పెద్ద విషయం కాదని.. అంతకు మించిన మిషన్‌తోనే ఆమె దక్షిణాదిలో అడుగు పెడుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.వాయనాడ్ నుంచి ఎంపీగా గెలిచిన తర్వాత దక్షిణాది మొత్తం కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దుకునే ప్రయత్నాలను ఆమె చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీకి దక్షిణాది చాలా ముఖ్యం. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగోసారి ఓడిపోకుండా ఉండాలంటే కర్ణాటక, తెలంగాణలో పార్టీని చక్కదిద్దుకోవాలి. ఏపీలో వచ్చిన అవకాశాల్ని వినియోగించుకోవాలి. కర్ణాటకలో అంతర్గత కుమ్ములాటలతో ఆ పార్టీ ఇబ్బంది పడుతోంది. తెలంగాణలో అంది వచ్చిన అవకాశాన్ని నిలబెట్టకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి రావొచ్చు. కేరళలోనూ కాంగ్రెస్‌కు ఆమె స్టార్ లీడర్ గా ఉంటారు. వయనాడ్ ఎంపీ హోదాలో ఇక ప్రియాంక ఆ ప్రయత్నాలు చేస్తారని అనుకోవచ్చు. కాంగ్రెస్ మరో సారి ఢిల్లీలో అధికారంలోకి రావాలంటే ప్రియాంకా గాంధీ ప్రయత్నాలు కూడా కీలకమే.

# బోరుగడ్డ అనిల్ పై 17 కేసులు

**గుంటూరు** సోషల్ మీడియా లో పొలిటికల్ లీడర్స్ పై అసభ్యకరంగా మాట్లాడిన బోరుగడ్డ అనిల్ కుమార్ పై 17 కేసులు ఉన్నాయని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. ,జూన్ 5తేదీ నుండి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడని,2021లో 50 లక్షలు డిమాండ్ చేసి బెదిరించిన కేసులో అరెస్ట్ చేసామని,సోషల్ మీడియాలో రాజాకీయ నాయకుల పై టార్గెట్ చేసి మాట్లాడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.కృష్ణా, అనంతపురం, ప్రకాశం జిల్లాలో చాలా కేసులు నమోదు అయ్యాయని,గుంటూరులో 8 కేసుల్లో నిందితుడుగా ఉన్నాడని,4 కేసులు విచారణలో ఉన్నాయి,మరో 4 కేసుల మీద పీటీ వారింట్ నమోదు జరిగిందని తెలిపారు.2019 లో బోరుగడ్డ అనిల్ కుమార్ పై ఆరండల్ పేట స్టేషన్ లో రౌడీ షీట్ ఉందని,ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించామని తెలిపారు

# హోటల్‌లో అగ్ని ప్రమాదం

**కదిరి** శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని జీవిమాను సర్కిల్ లోని ఓ హోటల్ లో రాత్రి మంటలు చెలరేగాయి. స్థానికులు అందించిన వివరాలు మేరకు.. ఓ హోటల్ లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జలమయమయిన ఖాద్రీ ఆలయం

**కదిరి** శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో కురిసిన భారీ వర్షానికి శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి భారీగా వర్షపు నీరు బయటకు ప్రవహిస్తోంది. ఏకధాటిగా వర్షం కురవడంతో ఆలయంలో నీరు నిండి ప్రధాన ద్వారం నుంచి బయటకు వచ్చింది. దీంతో వర్షం దాటికి ఆలయంలోని భక్తులు ఇబ్బంది పడ్డారు.

# దిగుమతుల నుంచి ఎగుమతుల స్థాయికి....

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మహమ్మారి ఆర్థిక వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది.. ఇప్పుడిప్పుడే పలు దేశాలు కోలుకుంటుంటుండగా.. మరికొన్ని దేశాలు అలానే ముందుకు సాగుతున్నాయి.. అయితే.. భారతదేశం అలా కాదు.. ఆర్థిక వ్యవస్థే కాదు.. ఎన్ని అవాంతరాలు వచ్చినా ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వడంతోపాటు.. మరింత బలంగా మారింది.. దానికి ప్రధాన కారణం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే.. కరోనా తర్వాత.. ప్రధాని మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది.. ఆర్థిక వ్యవస్థను గట్టేక్కించేందుకు పలు సంస్కరణలు తీసుకువచ్చింది. దీంతో విదేశీ పెట్టుబడులు సైతం భారీగా పెరిగాయి.. మేక్ ఇన్ ఇండియా.. ఆత్మనిర్భర్ భారత్, సబ్ కా సాత్ సబ్ కా వికాస్.. లాంటి నినాదాలతో పెట్టుబడులను ఆకర్షించింది. అంతేకాకుండా.. పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా సంస్కరణలు, మార్గనిర్దేశం, సహాయ సహకరాలను పెంచడం కూడా వ్యాపార వర్గాలను ఆకట్టుకునేలా చేసింది.. దానికి నిదర్శనం సెమీ కండక్టర్స్ రంగంలో భారీ పెట్టుబడులు.. మొబైల్ తయారీ యూనిట్లు పెరగడం.. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీలు వాటి సంబంధిత పరిశ్రమలు పెరగడం..మోదీ 2.0 కి మించి? ఇప్పుడు 3.0 సర్కార్ పాలన అన్ని వర్గాలను ఆకట్టుకోవడంతోపాటు.. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా దూసుకెళ్తోంది.. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి అంటే.. 2047లో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని.. వికసిత్ భారత్ నినాదంతో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక నినాదంతో ముందుకు సాగుతోంది.. ఆర్థిక శ్రేయస్సు, సామాజిక పురోగతి, పర్యావరణ స్థిరత్వం ఇలా అన్ని విషయాలతోపాటు.. తిరుగులేని శక్తిగా మార్చాలన్నదే ప్రధాని మోదీ నినాదం.. సంకల్పం.. దానికోసం ఇప్పటికే.. దూరదృష్టితో రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నారు.ముఖ్యంగా ఎంఎస్ఎంఈ (స్టార్టప్‌లు) సెక్టర్‌లను విస్తరించడం, ప్రోత్సాహకాలను అందించడం నుంచి వ్యాపార రంగానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చేలా నిర్ణయాలను తీసుకుంటోంది.. అలాగే ప్రతి రంగంలో కూడా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది.. డిజిటల్ ఇండియా నినాదంతో డిజిటల్ కనెక్టవిటీ, యూపీఐ పేమేంట్స్ పెరగడం, టెలికాం రంగంలో మార్పులు.. ప్రతి మూలకు ఇంటర్నెట్ సౌకర్యం.. ఇలా అన్ని రంగాల్లో సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్నాయి.భారతదేశం గత దశాబ్దంలో మొబైల్ ఫోన్స్ ను దిగుమతి చేసుకుంటే.. ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. ఇప్పుడు మొబైల్ ఫోన్ల యూనిట్లు 200పైగా ఉన్నాయి.. ప్రస్తుతం ఏకంగా ఆరు రెట్లు మొబైల్స్ను ఇండియాలోనే తయారు చేస్తున్నాం.. ఎగుమతి చేస్తున్నాం.. మేక్ ఇన్ ఇండియా అని చాటిచెబుతున్నాం.. అంటే.. మన సాంకేతిక పరిజ్ఞానం ఎంతలా పెరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు..ప్రపంచ ఉఆఖ ర్యాంకింగ్ 2024 జాబితా ప్రకారం.. భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది.. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, చైనా, జపాన్, జర్మనీ తర్వాత భారత్ ఉంది.. కరోనా నష్టం నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకోవడానికి 12 ఏళ్లు పడుతుందని భారతీయ రిజర్వు బ్యాంకు నివేదిక తెలిపింది.. అయితే.. ఈ నివేదికలు, అంచనాల మధ్య ఆర్థిక వ్యవస్థలో భారత్ మరింత ముందుకు చేరుకుంటుందని.. వ్యాపార రంగంతోపాటు.. అన్ని రంగాల్లో ఇదే దూకుడును ప్రదర్శిస్తుందని వ్యాపార దిగ్గజాలు పేర్కొంటుండం ఆసక్తికరంగా మారింది.భారతదేశం బలమైన ఆర్థిక వృద్ధిగా కొనసాగుతుందని ఒపెక్ అంచనా వేసింది.. ఒపెక్ తన తాజా నెలవారీ అప్‌డేట్‌లో అక్టోబరులో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్వల్ప క్షీణతను చవిచూసిందని అయినప్పటికీ.. తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని తెలిపింది. 2024-25లో 6.8 శాతంతో వృద్ధిని సాధిస్తుందని పేర్కొంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ 2024 రెండవ త్రైమాసికంలో స్వల్పంగా మందగమనాన్ని ఎదుర్కొంది.. మొదటి త్రైమాసికంలో 7.8% నుంచి 6.7% వార్షిక వృద్ధిని నమోదు చేసింది.

ఈ మందగమనానికి ప్రధానంగా ఎన్నికల సీజన్‌లో ప్రభుత్వ వ్యయం తగ్గుముఖం పట్టింది. మందగమనం ఉన్నప్పటికీ, 2021 నుండి ఆర్థిక వ్యవస్థకు సగటున 54% సహకారం అందించిన సేవల రంగం, గత త్రైమాసికంలో 6.7%తో పోలిస్తే, 2ఖ24లో వృద్ధి 7.2%కి వేగవంతమై, స్థితిస్థాపకతను కనబరిచింది. సెప్టెంబరులో నిరుద్యోగం రేటు ఆగస్టులో 8.5% నుంచి 7.8%కి తగ్గడంతో కార్మిక మార్కెట్లో సానుకూల ధోరణిని నివేదిక హైలైట్ చేసింది. 2024 పూర్తి సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి దాని మునుపటి అంచనాలకు అనుగుణంగా 6.8% వద్ద బలంగా ఉంటుందని ాఖఇఅ అంచనా వేసింది. ప్రభుత్వ మద్దతు, ఎన్నికల తర్వాత పునరుద్ధరించబడిన వ్యయం, నిరంతర వినియోగదారుల వ్యయం సంవత్సరం ద్వితీయార్థంలో వృద్ధిని పెంచుతాయని భావిస్తున్నట్లు తెలిపింది.మోదీ ప్రభుత్వం డిజిటల్ కనెక్టివిటీ ప్రాముఖ్యతను గుర్తించి.. అభివృద్ధికి బాటలు వేసింది. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు. చిన్న చిన్న అవసరాలను సైతం గుర్తించి ఎన్నో అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. సాధికారత, సమ్మిళిత డిజిటల్ దేశం వైపు మమ్మల్ని నడిపించడానికి కృషిచేస్తామన్నారు.

# తమిళ రాజకీయాల్లోకి జనసేనాని..?

**చెన్నై :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరు ఇటీవల రాజకీయ చర్చల్లో తెగ వినిపిస్తోంది. కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాలేదు పవన్ పేరు.. దేశ రాజకీయాల్లో కూడా పవన్ పేరు ఇప్పుడు తీవ్ర చర్చకు వస్తున్న పరిస్థితి. దీనికి ప్రధాన కారణం పవన్ వైఖరని చెప్పవచ్చు. మరి ఇంతలా పవన్ కళ్యాణ్ అన్నింటా వైరల్ అయ్యేందుకు దారి తీసిన పరిస్థితులలో మొదటగా.. తమిళులపై ప్రేమ కురిపించడమే. ఒకరితో విభేదం, మరొకరితో సన్నిహితంగా ఉంటూ తమిళ రాజకీయాల్లో కూడా తన హవా కొనసాగిస్తున్నారు పవన్ కళ్యాణ్. అసలు డిప్యూటీ సీఎం పవన్ మదిలో ఏముంది ? ఎందుకు ఇంత తమిళులపై ప్రేమ కురిపిస్తున్నారనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.డిప్యూటీ సీఎం పవన్ ఇటీవల సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి ఆజ్యం పోసింది మాత్రం తిరుమల లడ్డు వ్యవహారమే. దీక్ష చేపట్టిన పవన్.. తిరుమల శ్రీవారిని దర్శించి దీక్షను విరమించారు. అలాగే తిరుపతి వేదికగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం వారాహి డిక్లరేషన్ ప్రకటించేందుకు వారాహి సభను సైతం నిర్వహించారు. ఈ సభలో పవన్ చేసిన ప్రసంగంకు తమిళనాట వేడెక్కిందని చెప్పవచ్చు. పవన్ తన ప్రసంగంలో తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ ను టార్గెట్ చేస్తూ.. సనాతనధర్మం గురించి గతంలో స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగానే విమర్శించారు. అది కూడా తమిళంలో నేనున్నాను.. సనాతనధర్మ పరిరక్షణ కోసం.. ఎవరినైనా ఎదురిస్తాను అంటూ వార్నింగ్ ఇచ్చినట్లుగా పవన్ ప్రసంగం సాగిందఇక తమిళ సోషల్ మీడియా పవన్ ను ట్రోలింగ్ చేసే స్థాయికి వెళ్లిందంటే.. అక్కడ పవన్ వ్యాఖ్యల సెగ ఏ మేరకు తాకిందో చెప్పనవసరం లేదు. అలా చెప్పిన పవన్.. కొద్దిరోజులకు డీఎంకే బద్ధశత్రువైన అన్నాడీఎంకే వ్యవస్థాపకులు ఎంజీఆర్ ను పొగుడుతూ.. ట్వీట్ చేశారు. ఇక డీఎంకే నుండి ట్వీట్ ల వర్షం కురిసి, ఏకంగా పవన్ ను ట్రోలింగ్ చేయగా, అందులోకి సినీనటుడు ప్రకాష్ రాజ్ కూడా ఎంటర్ అయ్యారు. ప్రకాష్ రాజ్, స్టాలిన్ కు మద్దతుగా ట్వీట్ లు చేస్తూ పవన్ టార్గెట్ చేశారు. ఇలా తమిళనాట పవన్ వ్యాఖ్యలు రచ్చ రచ్చకు దారి తీశాయి.ఇది ఇలా ఉంటే తాజాగా అన్నాడీఎంకే పార్టీ 53 వసంతాలు పూర్తి చేసుకోగా, పవన్ చేసిన ట్వీట్ తమిళ రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. 53 వ వార్షికోత్సవం సందర్భంగా, పార్టీ నాయకత్వం, సభ్యులు, మద్దతుదారులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. దీనిని 1972 అక్టోబర్ 17న పురాణ “పురాత్చి తలైవర్” తిరు ఎంజి రామచంద్రన్ స్థాపించారు. తమిళనాడులో అన్నాడీఎంకే వేగంగా బలీయమైన రాజకీయ శక్తిగా మారింది. ఎంజీఆర్ పేదల అభ్యున్నతికి లోతుగా కట్టుబడి ఉన్నారు, ఎవరూ ఆకలితో లేరని, ప్రతి వ్యక్తికి గౌరవంగా జీవించే హక్కు ఉందని భరోసా ఇచ్చారంటూ.. దివంగత ముఖ్యమంత్రి జయలలిత, అలాగే పన్నీర్ సెల్వం, ఇతర నేతలను కూడా ప్రశంసించారు.ఈ ట్వీట్ వెనుక, తమిళుల మైత్రికి పవన్ పాకులాడుతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే ఇటీవల తమిళ నటుడు కార్తీ హైదరాబాద్ లో తన సినిమా సత్యం సుందరం ప్రమోషన్ వేదికలో పాల్గొన్నారు. అక్కడ యాంకర్ లడ్డు గురించి చేసిన వ్యాఖ్యలకు కార్తీ అడ్డుతగిలినట్లుగా ఆన్సర్ ఇచ్చారు. దీనితో కార్తీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు పవన్. కార్తీ కూడా వెంటనే స్పందించి సారీ చెప్పేశారు. ఆ సమయంలో కూడా పవన్ ను టార్గెట్ చేస్తూ తమిళ సోషల్ మీడియా పవన్ తప్పు చేశారంటూ కోడై కూసింది. దీనితో పవన్ కూడా మళ్లీ వివరణ ఇచ్చుకున్నారు. అలా తమిళుల చేత కొంత వ్యతిరేక పవనాలు వీయించుకున్న పవన్.. ఆ పరిస్థితిని సద్దుమణిగించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కూడా పొలిటికల్ అనలిస్టులు తెలుపుతున్నారు.ఏదిఏమైనా ఏపీ డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్.. అన్నాడీఎంకేకు మద్దతుగా నిలిచినప్పటికీ, తమిళనాట ఏదో స్కెచ్ వేస్తున్నారని, అందుకే అన్నాడీఎంకే మైత్రి కోసం పాకులాడుతున్నట్లు గాసిప్స్ ఊపందుకున్నాయి. మరి ఇది వాస్తవమో.. కాదో కానీ పవన్ ట్వీట్ మాత్రం రాజకీయ చర్చలకు దారితీసింది.

# వ్యాక్సిన్ రాజధానిగా భారత్...

**న్యూఢిల్లీ :** గత సంవత్సరంలో ప్రపంచంలో అందించిన సగం వ్యాక్సిన్‌లను భారతదేశం ఉత్పత్తి చేసింది. మొత్తం ఎనిమిది బిలియన్ డోస్‌లలో నాలుగు బిలియన్ డోస్‌లు భారతదేశంలో తయారు చేయబడ్డాయి. యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ నిర్వహించిన ఇండియా లీడర్‌షిప్ సమ్మిట్ 2024లో కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ ఈ సమాచారాన్ని అందించారు. ఫార్మాస్యూటికల్స్ రంగంలో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఆవిర్భవించిందని, జెనరిక్ ఔషధాల ఉత్పత్తి, ప్రధాన సరఫరాదారుగా ప్రపంచంలోనే మూడవ స్థానంలో ఉందని ఆయన అన్నారు. ప్రపంచం మొత్తం కరోనా మహమ్మారితో పోరాడుతున్నప్పుడు కూడా భారతదేశం.. మన దేశంలో తయారు చేసిన వ్యాక్సిన్‌ను ప్రపంచానికి అందజేసింది. భారతదేశం అనేక దేశాలకు ఉచిత వ్యాక్సిన్‌ను అందించింది. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు భారతీయ ఔషధ పరిశ్రమ భారీ పొదుపును అందించిందని పుణ్య సలీల శ్రీవాస్తవ అన్నారు. 2022 సంవత్సరంలో భారతీయ కంపెనీలు ఉత్పత్తి చేసే ఔషధాల వల్ల అమెరికా ఆరోగ్య వ్యవస్థకు 219 బిలియన్ డాలర్లు ఆదా అవుతాయి. 2013 నుండి 2022 వరకు ఈ పొదుపు 1.3 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు.గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 8 బిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లను తయారు చేసి పంపిణీ చేయగా.. వాటిలో సగం భారత్‌లోనే తయారయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ సెక్రటరీ పుణ్య సలీల శ్రీవాస్తవ తెలిపారు. గురువారం యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ నిర్వహించిన వార్షిక ఇండియా లీడర్‌షిప్ సమ్మిట్ 2024లో ఆమె ఈ మేరకు ప్రసంగించారు. భారత్ ఫార్మాస్యూటికల్స్‌లో గ్లోబల్ లీడర్‌గా అవతరించిందని, మూడవ అతిపెద్ద ఉత్పత్తిదారుగా, జనరిక్ మెడిసిన్ కీలక సరఫరాదారుగా నిలిచినట్లు పుణ్య తన ప్రసంగంలో తెలిపారు. ఈ రంగంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు గణనీయమైన సహకారం అందించేందుకు దారితీస్తుందన్నారు. ఇందులో యూఎస్ హెల్త్‌కేర్ సిస్టమ్ సహకారం కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా వెలుపల అత్యధిక సంఖ్యలో యూఎస్ ఎఫ్డీయే - ఆమోదించబడిన ఔషధ కర్మాగారాలు కలిగి ఉండటమే అందుకు నిదర్శనం. అమెరికా వెలుపల ఉన్న యూఎస్ ఎఫ్డీయే- ఆమోదించబడిన ప్యాంట్‌లలో వీటి సంఖ్య దాదాపు 25 శాతంగా ఉంది. భారత్ కంపెనీల్లో తయారు చేసిన మందుల పంపిణీ ద్వారా 2022లో యూఎస్ హెల్త్‌కేర్ సిస్టమ్‌కి 219 బిలియన్ డాలర్ల పొదుపును అందించాయి. 2013 ? 2022 మధ్య మొత్తం 1.3 ట్రిలియన్ డాలర్ల పొదుపును అందించాయని ఆమె పేర్కొన్నారు. మందులు మాత్రమే కాకుండా వ్యాక్సిన్ ఉత్పత్తిలో కూడా భారత్ ముందుంది. ప్రపంచ వ్యాక్సిన్ల తయారీలో గణనీయమైన వాటాతో ముందుగు సాగుతుంది. భారత్ ‘ప్రపంచ ఫార్మసీ’గా దాని పాత్రను నొక్కి చెబుతుందని ఆమె చెప్పారు. ప్రపంచంలో తయారయ్యే వ్యాక్సిన్‌లలో 50 శాతం ఒక్క భారత్‌లోనే తయారవుతున్నట్లు పుణ్య తెలిపారుగత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది బిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లను తయారు చేసి పంపిణీ చేయగా, నాలుగు బిలియన్ డోస్‌లు భారత్లోనే తయారు చేసినట్లు ఆమె చెప్పారు. పటిష్టమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్ధారించడానికి భారత్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను సంస్కరించిందని, జాతీయ వైద్య కమిషన్ చట్టం, ఇతర సంబంధిత చట్టాలలో కాలం చెల్లిన నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌లను భర్తీ చేసిందని ఆమె పేర్కొన్నారు. ఇది వైద్య, నర్సింగ్ కాలేజీల సంఖ్య, నమోదులో గణనీయమైన పెరుగుదలకు దారితీసిందన్నారు. ఇది ఆరోగ్య సంరక్షణలో వృత్తిపరమైన లభ్యతలో అసమానతలను పరిష్కరిస్తుందని ఆమె చెప్పారు. పర్యవసానంగా జాతీయ, ప్రపంచ అవసరాలను తీర్చగల ఆరోగ్య శ్రామిక శక్తిని ఉత్పత్తి చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రయత్నాలు భారత్‌లో ఆరోగ్య సంరక్షణ నాణ్యత, స్థాయి, ఖర్చు క్రమంగా మెరుగుపరిచాయని పుణ్య పేర్కొన్నారు.2013-2014.. 2021-2022 మధ్య కాలంలో మొత్తం ఆరోగ్య వ్యయం వాటా 25 శాతం తగ్గడమే మా విస్తరించిన ఆరోగ్య సంరక్షణ సేవలకు నిదర్శనమని ఆమె చెప్పారు. హెల్త్ కేర్ సెక్టార్‌లో ఇండో-యుఎస్ భాగస్వామ్యంపై పుణ్యా మాట్లాడుతూ.. కోవిడ్ వంటి మహమ్మారిని ఎదుర్కోవడంలో సంసిద్ధత, యాంటీ-మైక్రోబయల్ రెసిస్టెన్స్‌లలో.. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ( ఎన్సీడీసీ), యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి ) మధ్య ఉన్న బలమైన భాగస్వామ్యాన్ని తెలుపుతుంది. యూఎస్ సిడిసి సహకారంతో నిర్వహిస్తున్న ఎన్సీడీసీ, ఎఅఓఫీ ఫీల్డ్ ఎపిడెమియాలజీ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను భారత్ అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 200 మందికి పైగా ఎపిడెమిక్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ అధికారులు ట్రైనింగ్ పొందారని, మరో 50 మంది శిక్షణ పొందుతున్నారని ఆమె అన్నారు. బయో-ఫార్మాస్యూటికల్ సప్లై చైన్, ప్రపంచ సరఫరా గొలుసులను ఆప్టిమైజ్ చేయడానికి, బలోపేతం చేయడానికి బయో-5 కూటమి ద్వారా సింగిల్-సోర్స్ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించనున్నట్లు తెలిపారు.ఉమ్మడి వ్యూహాత్మక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రారంభించడానికి భారత్-యుఎస్ కూడా అంగీకరించాయి. 2023లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ క్యాన్సర్‌పై పోరాటానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. యూఎస్-భారత్ క్యాన్సర్ మూన్‌షాట్ డైలాగ్ ఆగస్టులో ప్రారంభించినట్లు తెలిపారు. యుఎస్-ఇండియా బయోమెడికల్ పరిశోధన సహకారాన్ని పెంపొందించడం, గర్భాశయ క్యాన్సర్‌పై దృష్టి సారించడం దీని ప్రధాన లక్ష్యమని పుణ్య పేర్కొన్నారు. ఇది ఎయిమ్స్, టాటా మెమోరియల్ హాస్పిటల్ వంటి సంస్థలతో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్లు ఆమె తెలిపారు. ఇది ‘వన్ వరల్డ్, వన్ హెల్త్’ విజన్‌ను ప్రతిబింబిస్తుందన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో క్యాన్సర్ పరీక్షలు, రోగనిర్ధారణకు 7.5 మిలియన్ డాలర్ల నిధులు కేటాయించామన్నారు. రేడియోథెరపీ, క్యాన్సర్ నివారణకు గవి, క్వాడ్ ప్రోగ్రామ్‌ల కింద ప్రపంచ దేశాలకు భారత్ 40 మిలియన్ల వ్యాక్సిన్లు అందిస్తుందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో భారత్-యుఎస్ ఉమ్మడి భాగస్వామ్యం ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడానికి సహకారం అందిస్తుందని పుణ్య తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# మా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

**- ఈనెల 29 నుంచి సమ్మెకు దిగుతాం**

**- ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సంఘం**

**పల్నాడు జిల్లా అధ్యక్షుడు సాయిబాబా రాజు**

**నరసరావుపేట :** ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ స్యలు పరిష్కరించకపోతే ఈ నెల 29 నుంచి సమ్మెకు దిగుతామని పల్నాడు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిబాబా రాజు పేర్కొ న్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారు తున్నా ఆరోగ్యశ్రీ సిబ్బంది జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదన్నారు.

ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకాన్ని ఇన్సురెన్స్ విధానంలోకి మార్పు చేసినా పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి న్యాయం జరగడం లేదన్నారు. అందరికీ 17 సంవత్సరాల సర్వీసు ను పరిగణనలోకి తీసుకుని కాంట్రాక్ట్ లోక్యాడర్ కల్పించి సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

చనిపోయిన సిబ్బం దికి రూ.15 లక్షల ఎక్స్రేషియా చెల్లించాలని అన్నారు. పదవీ విరమణ పొందిన, అవుతున్న సిబ్బందికి రూ.10లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఏపీలో కొత్త పింఛన్లు... మార్గదర్శకాలు సిద్ధం!

**తిరుమల :** కొత్త పింఛన్ల కోసం లక్షల మంది ఎదురుచూస్తున్నారు. గత కొన్నేళ్లుగా పింఛన్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. అదే సమయంలో వైసీపీ హయాంలో అనర్హులకు ఇచ్చినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ తరుణంలో కొత్త పింఛన్ల మంజూరు తో పాటు అనర్హుల పింఛన్లను తొలగించనున్నట్లు తెలుస్తోంది.ఏపీ ప్రభుత్వం సంక్షేమ పాలనకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా కీలక సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. అర్హత ఉండి పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వారికి గుడ్ న్యూస్ చెప్పింది. వచ్చే జనవరి నుంచి కొత్త పింఛన్లు అందించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను సైతం అధికారులు సిద్ధం చేశారు. అయితే అదే సమయంలో అనార్హుల పెన్షన్లు కూడా తొలగించనున్నారు. వారికి పింఛన్లు రద్దు చేస్తూ.. అర్హత ఉన్నవారికి అమలు చేసే కసరత్తు చేస్తోంది ప్రభుత్వం. తాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని పెంచుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అన్నట్టుగానే పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచారు. ఏప్రిల్ నుంచి పాత బకాయిలతో సహా జూలైలో చెల్లించారు. అక్కడ నుంచి పెంచిన మొత్తాన్ని నెలనెలా అందిస్తూ వచ్చారు. ఇప్పుడు తాజాగా అర్హత ఉన్న వారికి పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం డిసైడ్ అయ్యింది. దీనికి ముహూర్తంగా జనవరిని నిర్ణయించింది. దీంతో వేలాదిమంది లబ్ధిదారులకు మేలు జరగనుంది. అదే సమయంలో అర్హత లేని వారి పింఛన్లు తొలగించనున్నారుకూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జన్మభూమి కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జనవరి నుంచి జన్మభూమి 2 ప్రారంభించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. అదే సమయంలో గ్రామ సభల్లో కొత్త పింఛన్ల పంపిణీ మొదలు పెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ కొత్త పింఛన్ల పంపిణీకి సంబంధించి అధికారులు మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం అనర్హులకు సైతం పింఛన్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.గత నాలుగు నెలల టిడిపి కూటమి పాలనలో అనర్హుల పింఛన్ల అంశం తెరపైకి వచ్చింది. ఎక్కడికక్కడే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వాటన్నింటినీ పరిశీలించి తొలగించనున్నట్లు తెలుస్తోంది.వైసిపి ప్రభుత్వం కొత్త పెన్షన్ దరఖాస్తులను పక్కన పెట్టింది. తాము మరోసారి అధికారంలోకి వస్తే పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే అనూహ్యంగా ఆ పార్టీ ఓడిపోయింది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. కొత్త పింఛన్ల మంజూరు తో పాటు అనర్హుల ఏరివేత కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనుంది. అధికారులు ఇచ్చిన నివేదికపై ఈ ఉప సంఘం అధ్యయనం చేయనుంది. ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది. మొత్తానికి అయితే ఏపీలో పింఛన్ల పంపిణీ ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో.. దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

## పార్టీ ప్రక్షాళన పనిలో జగన్

**విజయవాడ :** వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పార్టీ ప్రక్షాళనలో భాగంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుసగా నేతలతో సమావేశం అవుతున్న ఆయన మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో అధ్యక్షులను మార్చిన జగన్ ఇప్పుడు కోఆర్డినేటర్లను మార్చారు. సీనియర్లకు ఆ బాధ్యతలు అప్పగించారు. విజయసాయి రెడ్డికి మళ్లీ ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించారు. పార్టీ కీలక నేతలతో జగన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ భేటీకి పార్టీ జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు హాజరయ్యారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో సాగిందీ సమావేశం. బూత్ లెవల్‌లో పార్టీ ప్రక్షాళనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేడర్‌ను మళ్లీ ఉత్సంగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసేందుకు ప్రణాళిక రచించారు. ఇప్పటికే మంగళగిరి, రేపల్లె నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహించి కొత్త ఇన్‌ఛార్జ్‌లను జగన్ నియమించారు. ఇకపై మిగతా నియోజకవర్గాలపై ఫోకస్ చేయాలని పార్టీ నేతలు కోరారు. దీనికి సంబంధించిన ప్రణాళికను కూడా విడుదల చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలను సెంట్రిక్‌గా చేసుకొని కోఆర్డినేటర్లను జగన్ నియమించారు. కొందరు సీనియర్ లీడర్‌కు రెండు జిల్లాలు మరికొందరికి మూడు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఎంపీ మిథున్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల బాధ్యతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు. ఆళ్ళ అయోధ్య రామిరెడ్డికి మాత్రమే ఒక్క ఉమ్మడి కృష్ణా జిల్లా కోఆర్డినేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఈస్ట్, వెస్ట్ గోదావరిని బొత్స సత్యనారాయణకు, ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం జిల్లా బాధ్యతలు విజయసాయిరెడ్డికి, కడప, అనంతపురం, కర్నూలును వైవీ సుబ్బారెడ్డికి అప్పగించారు. ఇప్పటి వరకు వైసీపీ నుంచి బయటకు వెళ్లే వాళ్లనే చూశాం. ఇన్ని నెలల తర్వాత తొలిసారి అధికార పార్టీ నుంచి ఓ నేత వైసీపీలో చేరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణ వైసీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిసహా అన్ని పదవులకు రాజీనామా చేసి జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. జగన్ మోహన్ రెడ్డి మురళీకృష్ణకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన తర్వాత కేడర్‌లో ఒక్కసారిగా నిస్తేజం ఏర్పడింది. అప్పడప్పుడు జగన్ బయటకు వస్తున్నప్పటికీ మునుపటి జోష్ కనిపించడం లేదు. మరోవైపు కేసుల్లో ఇరుకున్న వాళ్లు జైలుపాలు అవుతున్నారు. ఇది కూడా పార్టీలో ఓ విధమైన నిరాశకు కారణం అవుతుంది. అందుకే ఇప్పటి వరకు జిల్లా పార్టీని ప్రక్షాళన చేసిన జగన్... ఇప్పుడు నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టారు. ఇప్పటి వరకు బాధ్యతలు అప్పగించిన నేతలందా ప్రజల్లో ఉండాలని జగన్ సూచించారు. వారి పని తీరుపై ఎప్పటికప్పుడు రిపోర్టులు తీసుకుంటామని అన్నారు. వాటి ఆధారంగానే ఆ నేతల భవిష్యత్ ఆధార పడి ఉంటుందని చెప్పుకొచ్చారు.

## సజ్జలకు మద్దతు ఇవ్వని నేతలు

**గుంటూరు :** సిపి కీలక నేత, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆల్మోస్ట్ నెంబర్ 2 స్థానంలో చక్రం తిప్పిన సజ్జల రామకృష్ణారెడ్డి ప్రస్తుతం అదే పార్టీలో ఒంటరి వారు అయ్యారా అనే చర్చ ఏపీ రాజకీయాల్లో జరుగుతోంది. రెండు రోజుల క్రితం ఆయన విదేశాల నుండి తిరిగి వస్తున్న సమయంలో ముంబై ఎయిర్పోర్టులో పోలీసులు ఆపారు. సజ్జల విదేశాలకు పారిపోతున్న సమయం లో పోలీసులు అడ్డుకున్నారంటూ వార్తలు గుప్పుమన్నాయి. నిజానికి జరిగింది వేరు. ఆయన బాలీ నుండి తిరిగి వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. తర్వాత ఆయనకు సుప్రీంకోర్టు ప్రొటెక్షన్ ఉందన్న విషయం తెలిసి ఆయనను వదిలేసారు.నిజానికి సజ్జలకు ఒక విధంగా ఇది పాజిటివ్ న్యూసే. కానీ విచిత్రంగా వైసిపి నుండి కీలక నేతలు ఎవరూ సజ్జల పై వచ్చిన వార్తలను ఖండించే ప్రయత్నం చేయలేదు. మరోవైపు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఇంకా సజ్జలపై లుక్ అవుట్ నోటీస్ అమలు లో ఉన్నట్టు కూడా చెప్పారు. తర్వాత మంగళగిరి పోలీసులు సజ్జలను తమ ముందు హాజరు కావాలంటూ నోటీసులు అందజేశారు. 2021 అక్టోబర్ 19న జరిగిన టిడిపి కార్యాలయం పై దాడి ఘటన లో విచారించేందుకు సజ్జల రామకృష్ణారెడ్డికి ఈ నోటీసులు అందాయి. దీనిపై కూడా సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే ప్రెస్ మీట్ పెట్టి తనను తాను సమర్థించుకోవలసి వచ్చింది.వైయస్ జగన్మోహన్ రెడ్డి చెల్లెలు, ప్రస్తుత ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు పదేపదే చెప్పే మాట జూఖీ కాంగ్రెస్ లో జ అంటే వై.వి సుబ్బారెడ్డి, గా అంటే విజయసాయిరెడ్డి, ఖీ అంటే సజ్జల రామకృష్ణారెడ్డి అనీ .పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిజంగానే పవర్ అంతా ఈ ముగ్గురి మధ్య నడిచేది అనే ప్రచారం బలంగా ఉండేది. దానివల్ల వీళ్ళ మధ్య ఈగోలు కూడా పెరిగిపోయాయని అందువల్ల పవర్ సెంటర్ అనేది వీళ్ళ ముగ్గురి మధ్య మారుతూ వచ్చేది అనేది వైసిపి నేతల మధ్యే నడిచిన చర్చ. ఈ ముగ్గురిలోనూ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో చాలా క్లోజ్ గా ఉండేవారు. ఉద్యోగుల పిఆర్సి సమస్య అయినా,ఇతర కీలక అంశాలైనా సజ్జల ద్వారానే జగన్ వరకు వెళ్లేదనేది ఆ టైంలో జరిగిన కాదనలేని నిజం. అందుకే అప్పట్లో విపక్షాలు సజ్జలను "సకల శాఖల మంత్రి " అంటూ విమర్శించేవారు. బహుశా ఆ ప్రయారిటీ నే సజ్జలను వైసీపీలోని ఇతర కీలక నేతల కోపానికో, అసూయకో గురి చేసిందంటారు ఎనలిస్ట్ లు. 2024లో ఎప్పుడైతే పార్టీ ఓడిపోయిందో చాలామంది వేళ్ళు సజ్జల వైపే గురి పెట్టాయి. జగన్ కు పార్టీకి మధ్య సజ్జల అడ్డుగోడలా మారారు అనేది వారి ఆరోపణ. దానికి తగ్గట్టే ఇటీవలి కాలంలో సజ్జల పార్టీ కార్యక్రమాల్లో కాస్త నెమ్మదిగానే ఉంటున్నారు.

ఇక ఎన్నికల ముందు బాగా యాక్టివ్ గా ఉన్న ఆయన కుమారుడు సజ్జల భార్గవ్ కూడా ఓటమి తర్వాత ఎక్కడా కనిపించడం లేదు.టిడిపి కార్యాలయం పై దాడి కేసులో ఇప్పటికే దేవినేని అవినాష్, లేళ్ళ అప్పిరెడ్డి, తలశిల రఘురాం లాంటివాళ్ళు కేసులు ఎదుర్కొంటుండగా తాజాగా అదే కేసు లో సజ్జల కూడా విచారణకు హాజరు కావలసి వచ్చింది. అయితే సజ్జల స్థాయి వ్యక్తి ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడో లేక కనీసం "ముంబై ఎయిర్‌పోర్టులో అరెస్ట్ అయ్యారు " లాంటి వార్తలు వైరల్ అయినప్పుడో వాటిని ఖండిస్తూ పార్టీ లోని ఇతర నేతలు ఒక ప్రకటన జారీ చేయడమో లేక ప్రెస్ మీట్ పెట్టడమో చేస్తారని అందరూ భావించారు. అయితే విచిత్రంగా అలాంటి సూచన ఏది ఇప్పటివరకూ కనిపించలేదు. దానితో సజ్జల రామ కృష్ణారెడ్డిని వాళ్లు లైట్ తీసుకుంటున్నారా లేక గతంలో అచల పాటించిన ఒంటెద్దు పోకడలు ఆయనను ఇతర నేతలకు దూరం చేసాయా అన్న చర్చ ఏపీ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. మరి ఇప్పటికైనా సజ్జలకు మద్దతుగా వైసిపి నుండి ఎవరన్నా కీలక నేతలు బయటకు వస్తారో లేదో అన్నదానిపై ఈ చర్చ క్లైమాక్స్ ఆధారపడి ఉంది.

# 3 విభాగాలుగా అమరావతి

**అమరావతి :** అమరావతిలో నిర్మాణ పనులు పునః ప్రారంభించి పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అమరావతి నిర్మాణానికి సంబంధించిన ఏడు అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. నిర్మాణాలు పునః ప్రారంభించిన తర్వాత అన్నింటికీ ఓ కాలపరిమితితో ముందుకెళ్లాలని నిర్ణయించారు.సీఆర్డీఏ చట్టం 2014 ప్రకారం అథారిటీ అకౌంట్స్‌ను ఏటా జులై 31లోగా అకౌంటెంట్ జనరల్‌కు ఇవ్వాలి. 2014 నుంచి 2017 సంబంధించిన రిపోర్ట్‌లను 2018లోనే ఏజీకి సమర్పించారు. 2017-18 నుంచి ఆడిటింగ్ జరగలేదు. 2017-18, 2018-19, 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్ రిపోర్ట్ ఏజీ ఇవ్వాలని తీర్మానం చేశారు. అమరావతి నిర్మాణంలో భాగంగా చేపట్టే నిర్మాణాలకు సామాజిక, పర్యావరణ అనుమతులు అవసరం అవుతాయి. కేంద్ర,రాష్ట్ర, స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలి. ప్రపంచ బ్యాంకు,ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులు వస్తున్నందున ప్రతి విషయంలో జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతులు త్వరగా వచ్చేందుకు ప్రత్యేకంగా ఎన్విరాన్ మెంటల్ అండ్ సోషల్ మేనేజ్ మెంట్ యూనిట్ ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ అధికారుల భవనాల పాత టెండర్ రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని నిర్ణయించింది. 524.70 కోట్లు ఖర్చు చేస్తే పెండింగ్ పనులు పూర్తి అవుతాయని తెలిపింది. ఈ భవనాల నిర్మాణాన్ని సీడ్ యాక్సిస్ రోడ్డు, ఈ3- ఔ11, ఈ3-ఔ12 జంక్షన్ సమీపంలో 2017లో ప్రారంభించారు. అప్పట్లో ఎన్ సీ సీ సంస్థ ఈ కాంట్రాక్ట్ దక్కించుకుంది.15.65 ఎకరాల విస్తీర్ణంలో స్టిల్ట్ ప్లస్ 12 అంతస్తులతో మొత్తం 18 టవర్లలో 432 ఫ్లాట్ల నిర్మాణం 444 కోట్లతో ప్రారంభించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్ పనులు, ఇంటీరియర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, హెచ్వీఏసీ, ఎంఈపిఎఫ్, ఐసీటీ వర్క్స్ పెండింగ్‌లో ఉన్నాయి. డిజైన్, బిల్డ్, ఐటెమ్ రేట్ కాంట్రాక్ట్ సిస్టమ్‌పై టెండర్లు పలువనున్నారు. రెండు మూడు రోజుల్లో టెండర్ పిలిచి 20 రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారు.సీడ్ యాక్సిస్ రోడ్,ఈ3-ఔ11 జంక్షన్ వద్ద సీఆర్డీఏ ప్రాజెక్ట్ ఆఫీస్ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. మొత్తం 3.62 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 భవనాన్ని 2 లక్షల 42వేల 481చదరపు అడుగుల విస్తీర్ణంలో పనులు స్టార్ట్ చేశారు. అదనంగా పార్కింగ్,ల్యాండ్ స్కేపింగ్ 2.51 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇప్పటికి 61.48 కోట్లు ఖర్చు పెట్టారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ సిస్టమ్స్, ఇతర వర్క్స్ బ్యాలెన్స్ ఉన్నాయి. వాటిని పూర్తి చేసేందుకు 160 కోట్లు పెట్టాలి. దీనికి టెండర్లు పిలిస్తే నాలుగు కంపెనీలు పోటీ పడ్డాయి. పోటీలో ఒ1గా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన కేపీసీ ప్రాజెక్ట్స్‌కు పనుల అప్పగించబోతున్నారు. నాలుగైదు రోజుల్లో పనులు స్టార్ట్ అవుతాయిఅమరావతి నిర్మాణంలో 3 కీలక విభాగాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఒకటి అమరాతి ప్రభుత్వ సముదాయం, రెండోది ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మౌలిక సదుపాయాలు, మూడోది ట్రంక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్. మొత్తం రెండు దశల్లో అభివృద్ధి పనుల పూర్తికి అంచనాలు సిద్ధం చేశారు. మొత్తం 15 వేల కోట్లు ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్ మెంట్ బ్యాంక్ నుంచి తీసుకుంటారు. ట్రంక్ ఇన్ ఫ్రా పనుల కోసం డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్ నియమించనున్నారు. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులన్నీ అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏడీసి)చూస్తోంది. ఇందులో కేపిటల్ సిటీలో 34 రోడ్లు, మురికినీటి కాలువలు, నీటిసరఫరా నెట్ వర్క్‌లు ఉన్నారు. వీటితోపాటు పవర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, వరద నివారణ పనులు, పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్, శాఖమూరు, నీరుకొండ,కృష్ణయ్యపాలెం రిజర్వాయర్‌ల విస్తరణ కూడా దీని కిందికే వస్తుంది. ఐదేళ్లగా అమరావతి పనులు నిలిచిపోవడంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు టెక్నికల్ స్టడీ చేస్తారు. దీని టెండర్లను ఆర్వీ అసోసియేట్స్ సంస్థ ఎల్ వన్‌గా నిలిచి టెండర్ దక్కించుకుంది.

వివిధ పనుల ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ పనుల ఖర్చులను అంచనా వేస్తుందీ సంస్థ. వరద పనులు కోసం టెండర్ డాక్యుమెంట్‌ల రూపకల్పన వంటి అంశాలతో డీపీఆర్ సిద్ధం చేయనుంది. 2015 వరకూ అందుబాటులో ఉన్న వర్షపాతం డేటా ఆధారంగా అమరావతిలో వరద నివారణ పనుల కోసం బ్లూ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. 2015 నుంచి 2024 వరకూ ఉన్న వర్షపాతం డేటాతో అప్ డేట్ చేయాల్సి ఉంది. వైకుంఠపురం వద్ద 5650 క్యూసెక్కుల నీటిని పంప్ చేసేలా పంపింగ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలి. రెండో దశ డీపీఆర్ తయారీకి సలహాదారును నియమించేందుకు సీఆర్డీ అథారిటీ ఓకే చెప్పింది.

## ఇసుక, లిక్కర్‌లో జోక్యంపై ఆగ్రహం

**కాకినాడ :** ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగా ఎమ్మెల్యేల వల్లే వస్తుంది. సంపాదన కోసం వారు నియోజకవర్గంలో ప్రతి దాంట్లో కమిషన్లు తీసుకోవడం.. ప్రతి పని తమ కనుసన్నల్లో జరగాలని కోరుకోవడం వల్ల ఇలాంటి పరిస్థితి వస్తుంది. గత అనుభవాలతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ సారి రూటు మార్చారు. ఎమ్మెల్యేలను మొదటి నుంచి కట్టడి చేసి సరైన మార్గంలో వెళ్లేలా చేయాలనుకుంటున్నారు. అందుకే సమయం, సందర్భం వచ్చినప్పుడల్లా హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. తాజాగా కేబినెట్ భేటీలోనూ అదే చెప్పారు. ప్రత్యేకంగా టీడీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసి అవే హెచ్చరికలు వినిపించబోతున్నారు. గత ప్రభుత్వం ఇసుక దోపిడికి పాల్పడిందని టీడీపీ ఆరోపిస్తూ వచ్చింది. అందుకే తాము రాగానే ఉచిత ఇసుక పాలసీ ఇస్తామని హామీ ఇచ్చింది. అన్నట్లుగానే ఉచిత ఇసుక పాలసీ తెచ్చింది. కానీ చాలా చోట్ల నుంచి విమర్శలు వస్తున్నాయి. దీనికి కారణం ఎమ్మెల్యేల జోక్యమేనని ఆరోపణలు వచ్చాయి. తాజాగా లిక్కర్ పాలసీ విషయంలో కొంత మంది ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్నారని నివేదికలు చంద్రబాబుకు వచ్చాయి. సిండికేట్ అయ్యారని.. లాటరీల్లో దుకాణాలు వచ్చిన వారిని బెదిరించారని ఇలా పలు రకాలుగా చెప్పుకున్నారు. దీంతో చంద్రబాబు నేరుగా ఇంటలిజెన్స్ నుంచి నివేదికలు తెప్పించుకుని ఇలాంటి పనులు చేస్తున్న వారికి హెచ్చరిక సంకేతాలు పంపించారు. ఎమ్మెల్యేలు ఇలా అక్రమ సంపాదనకు అలవాటు పడకుండా చేసేందుకు చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మొదట్లోనే వారిని అడ్డుకుంటే సమస్య ఉండదని అనుకుంటున్నారు. నిజానికి ఇసుక, లిక్కర్ అనేది ఎమ్మెల్యేలకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటిగా ఉండేది. గత ప్రభుత్వంలో ఇది కేవలం పై స్థాయిలో ఉన్న వారికి మాత్రం ఆదాయవనరుగా మారిందని అందుకే వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి వ్యతిరేకంగా పని చేశారని చెబుతారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో పాత విధానాలే తీసుకు వచ్చినా నిజాయితీగా లిక్కర్ దుకాణాలను వేలంపాటలో దక్కించుకునే పర్వాలేదు కానీ దందాలు చేయాలనుకుంటే మాత్రం సాధ్యం కాదని సంకేతాలు పంపుతున్నారు. ఇలా ఎమ్మెల్యేలు లిక్కర్, ఇసుకల్లో పదే పదే జోక్యం చేసుకుంటే ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అందుకే చంద్రబాబు వారిని కట్టడి చేస్తున్నారు.

అయితే ఎమ్మెల్యేలు తమకు ఆదాయ మార్గాలేమిటని మథనపడే అవకాశం ఉంది. ఎందుకంటే రాజకీయాలు చేయాలంటే ఎంతో ఖర్చు అవుతుంది. పార్టీ క్యాడర్ ను చూసుకోవాలి. పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకోవాలి. మరి వీటికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందన్న ఆవేదన ఎమ్మెల్యేల్లో కనిపించే అవకాశం ఉంది. నిజాయితీగా వ్యాపారాలు చేసుకుంటే ప్రభుత్వం తరపున పార్టీ నుంచి సహకారం అందుతుంది కానీ.. అక్రమ వ్యాపారాలకు సహకరించే ప్రశ్నే లేదని చంద్రబాబు స్పష్టం చేయనున్నారు.ఇందు కోసం టీడీపీ ఎల్పీ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశంలో చంద్రబాబు ఎమ్మెల్యేలకు తన పాలసీని స్పష్టం చేయనున్నారు. గీత దాటిదే ఎవర్నీ వదిలేది లేదని హెచ్చరించే అవకాశం ఉంది.

## త్వరలో దువ్వాడ బయోపిక్

**శ్రీకాకుళం :** త్వరలో దువ్వాడ బయోపిక్ తెరపైకి రానుందా? ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయా? టాలీవుడ్ ప్రముఖ నిర్మాత ఒకరు ఆ ప్రయత్నాల్లో ఉన్నారా? ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.గత మూడు నెలలుగా దువ్వాడ ఫ్యామిలీ వివాదం తెలుగు రాష్ట్రాల ప్రజలకు వినోదాన్ని పంచింది. ప్రతిరోజు ఇదో రచ్చగా మారింది. విజయవాడ వరదల సమయంలో కాస్త తగ్గుముఖం పట్టింది. లేకుంటే మీడియాకు సైతం ఇదే ప్రధాన అస్త్రంగా మారిపోయింది. ఆయనపై భార్య, కుమార్తెలు చేసిన ఆరోపణలు,చేసిన నిరసనలు, చూపించిన వాట్సాప్ మెసేజ్ లు, ఆస్తుల వ్యవహారాలు, పార్టీ ఆఫీస్ పంచాయితీలు ఇలా ఒకటేమిటి.. ప్రతిరోజు ఏదో ఒక అంశం బయటపడుతూనే ఉంది. అన్నింటికీ మించి దివ్వెల మాధురితో ఆయన లవ్ ట్రాక్ మరింత ఆకట్టుకుంది.

ఎవరేమనుకున్నా తాను దువ్వాడ తోనే ఉంటానని.. దీనిని లివ్ ఇన్ టుగెదర్ అన్నారని.. అడల్ట్రీ అంటారని.. దాని అర్థం డిక్షనరీలో కనిపించేది కాదని.. సుప్రీంకోర్టు సైతం ఇదే విషయాన్ని పేర్కొందని గుర్తు చేస్తూ మాధురి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయితొలుత దువ్వాడపై దూకుడుగా వ్యవహరించిన ఆయన భార్య వాణి స్వరంలో మార్పు వచ్చింది. దువ్వాడ శ్రీనివాస్ ఎలా ఉన్నా పర్వాలేదు.. ఎవరితో ఉన్నా పర్లేదు.పిల్లల కోసం అయినా తమతో కలిసి ఉంటే చాలు. మాతో పాటు ఒకే ఇంట్లో ఉంటే చాలు అనే స్థాయిలో భార్య వాణి కోరుకుంది. అయితే ఈ వివాదం కోర్టులో ఉంది కనుక.. విడాకులే శరణ్యం అన్నట్టు తేల్చి చెప్పారు దువ్వాడ శ్రీనివాస్. తన భార్య దువ్వాడ వాణి తో కలిసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. పిల్లల బాధ్యత మాత్రం తాను చూసుకుంటానని చెప్పుకొచ్చారు.ప్రస్తుతం దువ్వాడ శ్రీనివాస్, మాధురి జంట టీవీ ఛానల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. ప్రముఖ మీడియా ఛానళ్లకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తోంది. తిరుపతిలో ప్రత్యక్షమైన ఈ జంట భక్తులకు కనువిందు చేసింది. ఇందులో మాధురి పై కేసు కూడా నమోదు అయ్యింది. మరోవైపు దువ్వాడ ఎపిసోడ్ కు సంబంధించి కీలక విషయం ఒకటి బయటపడింది. త్వరలో దువ్వాడ శ్రీనివాస్ బయోపిక్ తెరకు ఎక్కనుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రథమార్థం దువ్వాడ బాల్యం, వ్యాపారం, వివాహం, రాజకీయం తదితర అంశాలను చూపిస్తారు. ద్వితీయార్థం మాత్రం మాధురితో లవ్ ట్రాక్ చూపిస్తారని తెలుస్తోంది. వీలైనంత త్వరగా ఈ సినిమా పట్టాలెక్కించేందుకు నిర్మాత ప్రయత్నిస్తున్నట్లు సమాచారం

## బయిటకొస్తున్న విడుదల రజనీ అక్రమాలు

**గుంటూరు :** మొన్న జగనన్న కాలనీలు.. నిన్న క్రషర్ యజమానులు.. నేడు పాఠశాల ఉపాధ్యాయులు ఎవరు చూసినా కూడా ఆ జిల్లాలో ఆమె బాధితులే.. డైరెక్ట్ గా ఆమె ఎటాక్ చేయొచ్చు. లేకపోతే ఆమె పేరు చెప్పి మరొకరైనా బెదిరించవచ్చు. మంత్రి హోదాలో ఆమె చేసిన పెత్తనం, ఆమె టీమ్ చేసిన దౌర్జన్యాలతో వివిధ వర్గాల వారు తీవ్రంగా నష్టపోయారంట. ప్రభుత్వ, ప్రజల ధనాన్ని దోచుకోవటమే ఎజెండాగా ఆమె చెలరేగారని అంటున్నారు ఫిర్యాదుదారులు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలన ఎంత నిర్లక్ష్యంగా, దౌర్జన్యపూరితంగా సాగిందో చెప్పటానికి ఎన్నికల ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ. రాష్ట్ర నలుమూలల్లో ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఇష్టానుసారం అరాచకాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ప్రజలకు మంచి చేస్తారని ఆలోచనతో ఓటు వేసి ప్రజాప్రతినిధులను గెలిపించుకుంటారు ప్రజలు.. కానీ వైసీపీ ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి సొంత ఇల్లు చక్కదిద్దుకోవడానికే ప్రాధాన్యమిచ్చారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో పల్నాడు జిల్లాలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలే నిదర్శనమని చెప్పాలి.గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విడుదల రజనికి సంబంధించి వెలుగులోకి వస్తున్న కేసులను పరిశీలిస్తే ప్రతి ఒక్కళ్ళు ముక్కున వేలు వేసుకోవాల్సిందే.. రైతుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు ఎవరినీ వదిలిపెట్ట లేదంట మన మాజీ మంత్రి. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచే రజినిపెత్తనం మొదలైందంటారు. ఇక మూడేళ్ల తర్వాత ఆ ఫస్ట్ టైం ఎమ్మెల్యేని మంత్రిని చేశారు జగన్.. ఇక అప్పటి నుంచి లేడీబాస్ తరహాలో చెలరేగిపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆఖరికి ప్రభుత్వ పాఠశాల పనుల్లో కూడా రజని వర్గం అక్రమాలకు పాల్పడిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.. ఆమే కాదు రజని బంధువులు, అనుచరులు, తెలిసిన వాళ్ళు ఇలా ప్రతి ఒక్కరు ఆమె పేరు చెప్పి అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. జగనన్న కాలనీల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడంతో.. ప్రభుత్వం మారగానే బాధితులు బయటికి వచ్చి ఆమెపై ఫిర్యాదులు చేశారు.. దీంతో చేసేదేమీ లేక వారికి రజనీ వర్గీయులు డబ్బు తిరిగిచ్చారువారిది ముగిసింది అనుకునే లోపే స్టోన్ క్రషర్స్ యజమానులు తమ నుంచి కోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేశారంటూ పోలీసులను ఆశ్రయించారు. దీంతో విడుదల రజనీకి సంబంధించి మరో అక్రమం బయటకు వచ్చింది. ప్రస్తుతం స్కూలు రెన్యువేషన్ కి సంబంధించి చేపట్టే నాడు నేడు కార్యక్రమంలో పెద్ద ఎత్తున అక్రమం జరిగిందని.. దానికి కారణం విడుదల రజనీకి సంబంధించిన బంధువులేనని



ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు బయటికి వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. నాడు నేడు పనుల కోసం విడుదలైె నిధుల్లో 40 లక్షల రుపాయలు దుర్వినియోగమయ్యాయని వారు చిలకలూరిపేట టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ప్రస్తుతం బయటకు వస్తున్న ఫిర్యాదులను బట్టి రజని ఏ స్థాయిలో అధికారం చెలాయించారో అర్థమవుతుంది.. తనకు అనుకూలురైన అధికారుల్ని నియమించుకుని.. తన మాట వినని వారిని బదిలీ చేయించి.. తన మాటే శాసనం అన్నట్లు వ్యవహరించేవారని బాధితులు అంటున్నారు .. వైసీపీ ప్రభుత్వంలోనూ విడుదల రజనీపై పలు ఫిర్యాదులు చేసినా అవన్నీ బుట్టదాఖలు అయ్యాయంటున్నారు .. అప్పుడు నిస్సహాయంగా ఉండిపోయిన బాధితులంతా ఇప్పుడు బయటకు వస్తూ ఆమె ముఠా అక్రమాలను బయట పెడుతున్నారు. ఇవే కాదు భయపడి బయటికి రాలేని వాళ్ళు చాలామంది ఉన్నారంటున్నారు.రజిని అన్ని అక్రమాలకు పాల్పడబట్టే చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆమెపై వ్యతిరేకత పెరిగిపోయింది. ఆ విషయం సర్వేల్లో తేలడంతో వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆమెను గుంటూరు వెస్ట్ ఇన్చార్జ్‌గా పంపించారు. గుంటూరు వెస్ట్‌లో గెలవడానికి రజని ఘనంగానే ఖర్చు పెట్టారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

టీడీపీ నుంచి పోటీ చేసిన గల్లా మాధవి రాజకీయాలకు కొత్త అయినప్పటికి రజని 51 వేల పైచిలుకు ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఓటమి తర్వాత రజని వైసీపీ కార్యకలాపాల్లో ఎక్కడా కనిపించడం లేదు.

వరుసగా తనపై వస్తున్న ఫిర్యాదులతో మీడియాకు, జనానికి ముఖం చూపించడమే మానేశారు. దాంతో వైసీపీ వర్గాలే ఆమెపై భగ్గు మంటున్నాయి.విడుదల రజినిపై వస్తున్న ఫిర్యాదులకు సంబంధించి పార్టీ వర్గాలు సైతం ఎక్కడా ఖండిస్తున్న పరిస్థితి లేదు కనీసం ఆమె చుట్టూ ఉన్న కార్యకర్తలు కూడా ఇప్పటివరకు దీనిపైన ఎక్కడ మాట్లాడిన పరిస్థితులు లేవు.. అయితే ఫిర్యాదులు అయితే అందుతున్నాయి కానీ.. వాటిపై ఇంత వరకు ఎలాంటి చర్యలు లేకపోవడం విమర్శల పాలవుతుంది. మరి కూటమి సర్కారు ఆవిమర్శలకు ఎలా రిప్లై ఇస్తుందో చూడాలి.

# భూ సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు.

### - అడిషనల్ కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్



**మంథని ( ప్రశ్న న్యూస్)** మండలంలో పెండింగ్ ఉన్న భూ సమస్యల పరిష్కారానికి పొగడ్బందీ చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ తెలిపారు అడిషనల్ కలెక్టర్ ఎలిగేడు మండలంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులు వివరాలు తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ వాటి పరిష్కారానికితీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. మీసేవా కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సకాలంలో వాటిని జారీ చేయాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో తహసిల్దార్ బషీరుద్దిన్, నాయబ్ తహసిల్దార్ కిరణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరువు భత్యం విడుదల చేయాలి

### - టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్




**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** మెదక్ ఉద్యోగులకు న్యాయంగా రావలసిన ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్లో ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలని, గత ప్రభుత్వంలోని మూడు విడతలు, నూతన ప్రభుత్వ రెండు విడతల కరువు భత్యాన్ని వెంటనే చెల్లించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. వీటితోపాటు ఉద్యోగుల నెలసరి భాగస్వామ్యంతో నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, మెడికల్ సిబ్బంది ఏం పి ఎచ్ ఏ లకు అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పునరుద్ధరించాలని, డిజిటల్ క్రాఫ్ట్ సర్వే నిమిత్తం వ్యవసాయ విస్తరణ అధికారులకు సహాయకులను నియమించాలని, పంచాయతీ కార్యదర్శులు పల్లె ప్రగతి కి వెచ్చించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, టీఎస్ జి ఎల్ ఐ కార్యాలయాన్ని సంగారెడ్డి నుండి మెదక్ పట్టణానికి తరలించాలని తదితర తీర్మానాలు జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్ ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. అదేవిధంగా ఈనెల 22 న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ వద్ద భోజన విరామ సమయ ధర్నా చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా సహా అధ్యక్షులు ఎండి ఇక్బాల్ పాష, కోశాధికారి ఎం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కే ఫణి రాజ్, ఎండి ఫజలుద్దిన్, కోటి రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు పోతురాజు శంకర్, పంపరి శివాజీ, కిరణ్ కుమార్, రాధా, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ప్రచార కార్యదర్శి నర్సింలు, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యురాలు దోమ మరియ, రామాయంపేట, చేగుంట, అల్లాదుర్గ్, నర్సాపూర్ మరియు ఏడుపాయల వనదుర్గ యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు అనుముల ప్రభాకర్, అశోక్ రెడ్డి, ధర్మాచందర్, రాకేష్, ప్రశాంత్, విజయ్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు జంగం నగేష్ కుమార్, పశుసంవర్ధక శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి లింగమూర్తి, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి శేఖర్, నీటిపారుదల శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి శ్రీ హర్ష, వైద్య ఆరోగ్యశాఖ ఫోరం జిల్లా కార్యదర్శి మంజుల, సలావుద్దీన్, చంద్రశేఖర్ తదితర సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రని కలిసిన పెద్దపెల్లి జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతికుమార్



**మంథని ( ప్రశ్న న్యూస్)** శుక్రవారం ఎన్టీపీసీ జ్యోతి భవన్ లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రని బీజేపీ పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతి కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పెద్దపల్లి జిల్లాలో బడుగు బలహీన వర్గాలు పలు రకాలుగా ఇబ్బందులకు గురి అవుతున్న విషయమై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్ర గారితో చర్చిస్తూ వారికి న్యాయం చేసే విధంగా సమస్యలను జాతీయ నేతల దృష్టికి తీసుకువెళ్లాలని పలు అంశాల విషయమై వారితో చర్చించడం జరిగింది... ఈ విషయంలో రామచంద్ర సానుకూలంగా స్పందించి తగిన రీతిలో పెద్దపెల్లి జిల్లా ప్రజలకు న్యాయం చేసే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని ఎందుకంటే తనకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన పెద్దపల్లి జిల్లాకు ప్రప్రథమంగా న్యాయం చేసే విధంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఇక్కడ సమస్యలను రాష్ట్రస్థాయిలో మరియు జాతీయస్థాయిలో దృష్టి సారించే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఇదేవిధంగా వారి అనుకూలమైన స్పందనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని క్రాంతి ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

# ఈ డబ్ల్యూ ఎస్ వల్ల ఎస్సీ ఎస్టీ బీసీల రిజర్వేషన్లకు గండి..

### - విజయ్ కుమార్ నార మల్ల జర్నలిస్ట్



**మంథని ( ప్రశ్న న్యూస్)** కరీంనగర్ (18-10-2034)రాజ్యాంగంలో అంబేద్కర్ రిజర్వేషన్లు కల్పించింది, ఎస్సీ ఎస్టీ బీసీలకు, నరేంద్ర మోడీ ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలకి %జుఙం% ద్వారా రిజర్వేషన్ కల్పించడం జరిగింది, దీనిని అప్పట్లో అందరూ స్వాగతించినప్పటికీ, ఈ డబ్ల్యూ ఎస్. వల్ల ఎస్సీ ఎస్టీ బీసీలకి చాలా అన్యాయం జరుగుతుంది, ఈ విషయాన్ని ఎవరు గమనించట్లేదు, అంటరానితనం ఉండకూడదు అనే ఉద్దేశంతో అంబేద్కర్ రిజర్వేషన్ కల్పిస్తే, నరేంద్ర మోడీ ప్రభుత్వం అగ్రవర్ణాలకి ఈ డబ్ల్యూ ఎస్ పేరిట రిజర్వేషన్లు కల్పించారు, ఇది చాలా ప్రమాదకరం, ఈ విషయమై ఎస్సీ ఎస్టీ నాయకులకి అవగాహన లేక వ్యతిరేకించలేదు, ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ విషయమై మీ ముందు కొన్ని ఆధారాలని చూపబోతున్నము, ఇటీవల జరిగిన డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలను క్షుణ్ణంగా గమనిస్తే ఈ డబ్ల్యూ ఎస్ వల్ల ఎస్సీ ఎస్టీ బిసి లకు ఎంత అన్యాయం జరిగిందో కనిపిస్తుంది, నల్గొండ జిల్లాలో రిజర్వేషన్ల ప్రక్రియ చూస్తే %జుఔ% 2050 ర్యాంకు వారికి ఉద్యోగం వచ్చింది, ఎస్సీలకి 1370 ర్యాంకు వస్తే గాని ఉద్యోగం రాలేదు, అలాగే ఆదిలాబాద్ లో ఈ డబ్ల్యూ ఎస్ 1948 ర్యాంకు వచ్చిన వారికి ఉద్యోగం వచ్చింది, ఎస్సీలకి 493 ర్యాంకు వస్తే గాని ఉద్యోగం రాలేదు, వీటిని గమనిస్తే అగ్రవర్ణాల వారికి ఎక్కువ ర్యాంకు వచ్చినప్పటికీ ఉద్యోగాలు రావడం జరిగింది, అస్తమానం రిజర్వేషన్ వల్ల ఎస్సీ ఎస్టీలు ఉద్యోగాలు సాధిస్తున్నారు అని అరిచేవారు ఒకసారి ఈ విషయాన్ని గమనించండి, ఈడబ్ల్యూఎస్ వారికి ఎస్సీ ఎస్టీ బీసీల కంటే ఎక్కువ ర్యాంకు వచ్చినప్పటికీ ఉద్యోగాలు సాధించారు, ఈ విషయాన్ని ఎస్సీ ఎస్టీ బీసీ నాయకులు గమనించాలి, రిజర్వేషన్ రద్దు చేయాలని, కోర్టు తీర్పుని వెనక్కి తీసుకోవాలని ఎస్సీ లోని పెద్దలు పోరాడుతున్నారు, ముందు మీరందరూ పోరాడాల్సింది ఈ డబ్ల్యూ ఎస్ వ్యతిరేకంగా, లేనిపక్షంలో భవిష్యత్తులో ఈ బీజేపీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ మరియు బిసి రిజర్వేషన్లు ఎత్తివేసే

# ఏ.టి.సి కోర్సుల పై విస్తృత ప్రచారం కల్పించాలి.

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
### - పెద్దపల్లి, రామగుండం ఐటిఐ లలో ఏటిసి కేంద్రాల ఏర్పాటు
### - ఒక్కో ఏటిసి కేంద్రంలో 6 కోర్సులలో 172 సీట్లు
### - ఏటీసీ కోర్సుల అడ్మిషన్లకు అక్టోబర్ 30 గడువు
### - అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాల పై పత్రిక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**మంథని ( ప్రశ్న న్యూస్)** జిల్లాలో ఐటిఐ కేంద్రాల లో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సుల ప్రవేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాల పై పత్రిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఐటిఐ కళాశాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ లను ప్రారంభించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా హైదరాబాదులో ఒకేసారి 65 ఏటిసి కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. మొదటి దశలో 25 ఏటీసీ కేంద్రాలలో ప్రభుత్వం అడ్మిషన్స్ ప్రారంభిస్తుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు వచ్చాయని అన్నారు. మన జిల్లాలో ఉన్న ఐటిఐ రామగుండం, ఐటిఐ పెద్దపల్లిలో 2 అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు కావడం జరిగిందని అన్నారు. మన జిల్లాలో ఉన్న 2 ఏ.టి.సి కేంద్రాలు మొదటి దశలో ఎంపిక కావడం జరిగిందని , ఒక్కో చోట 6 కోర్సులలో 172 సీట్లు అడ్మిషన్స్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని ఏ.టి.సి లలో అడ్మిషన్స్ పొందేందుకు అక్టోబర్ 30, 2024 చివరి తేదీ అని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఏ.టి.సీ కోర్సులు పొందేందుకు అర్హులని అన్నారు. ఈ కోర్సులతో మల్టి నేషనల్ కంపెనీలలో తప్పనిసరిగా ఉద్యోగం లభిస్తుందని అన్నారు.మన జిల్లాలో ఒక సంవత్సరం కాలపరిమితి గల మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ %డ% డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టీసీ యూజింగ్ అడ్వాన్స్డ్ టూల్ కోర్సులలో 40 సీట్లు ఉన్నాయని, రెండు సంవత్సరాల కాల పరిమితి గల బేసిక్ డిజైనర్ అండ్ పర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్సుడ్ సి.ఎన్.సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు.ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ప్రకారం టాటా కన్సల్టెన్ వారితో సమన్వయం చేసుకొని ఈ కోర్సులను డిజైన్ చేశామని అన్నారు. ఐటీఐ పెద్దపల్లి లోని ఏటిసి కేంద్రంలో 172 సీట్లకు 110 పైగా సీట్లు ఇప్పటి వరకు భర్తీ జరిగాయని, రామగుండం ఏటీసీ కేంద్రంలో 35 సీట్లు మాత్రమే నిండాయని, జిల్లాలో ఉన్న యువత యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కోర్సులలో జాయిన్ కావాలని కలెక్టర్ కోరారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులలో జాయిన్ అయ్యేందుకు అడ్మిషన్ కోసం %ఉఛ్.వశ్రీఖఅస్త్రుఖఖ.స్త్రశీజ.ఱఅ% ఆన్ లైన్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో (పదవ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టిసి, ఆధార్ కార్డ్) పెద్దపల్లి ఐటిఐ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులు ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రంలో ప్రవేశాలకు కనీస వయసు 14 సంవత్సరాలు మాత్రమేనని అన్నారు.ఏ.టి.సి కేంద్రం భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, కోర్సులకు సంబంధించి అవసరమైన పరికరాల సైతం జిల్లాకు చేరుకున్నాయని అన్నారు. సెలవు దినాలలో కూడా అడ్మిషన్స్ స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి తిరుపతి, పెద్దపల్లి, రామగుండం ఐటిఐ ప్రిన్సిపాల్స్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవను వరించిన కాలనీ సేవా పువష్కార్ అవార్డు



బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) నిస్వార్థంగా చేసే ప్రజాసేవకు ప్రజల మద్దత్తు ఎప్పటికి ఉంటుందని 119.సబితా ఇంద్రారెడ్డి కాలనీ నివాసితులు శేఖర్ గౌడ్, చంద్రకళ దంపతులు నిరూపించారు. బడంగ్ పేట్ మున్సిఫల్ కార్పోరేషన్ పరిధిలోని సభితా ఇంద్రారెడ్డి కాలనీ ఫేస్ 2 లో కాలనీ అభివృద్ధి కార్యక్రమాలలో నిస్వార్థంగా సేవలందించి అహర్నిశలు పాటు పడుతున్న శేఖర్ గౌడ్, చంద్రకళ దంపతుల కృషిని గుర్తించిన కాలనీ వాసులు కాలనీ సేవా పురష్కార్ అవార్డును అందచేసారు. ఈ కార్యక్రమంలో రాజుచారి, మల్లారెడ్డి, అంజనేయులు, బలరామ్, నర్సింహ తదితరులు పాల్గోన్నారు.

# సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నూతనంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) హస్తకళావృత్తుల వారికి ప్రోత్సాహాన్ని అందిస్తూ వారి ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించేందుకు పలు చోట్ల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవి దేవకీ తెలిపారు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నూతనంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి అందులో హస్తకళలను భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన హస్తకళ కళాకారులను, వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొ



న్నారు. కేవలం హస్తకెళలే కాకుండా వినోదపరితమైన కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేసి చిన్న పెద్ద తేడా లేకుండా వినోదాన్ని అందించే వివిధ క్రీడలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 171 ప్రాంతాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రదర్శనలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా డ్వాక్రా మెక్మా సంఘాలకు ప్రదర్శన మూలంగా ప్రోత్సాహం లభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కోటా దేవికా దేవి నిర్వాహకులు మహేశ్వరరావు అడ్వైజర్ సాయి చౌదరి రబ్బాన్ ఆజాద్ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సాంప్రదాయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి - అఘోరి( నాగసాదు)




కీసర (ప్రశ్న న్యూస్) హిందూ సంప్రదాయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అప్పటివరకు తన పోరాటం కొనసాగిస్తానని నాగ సాధు తెలిపారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం పరిధిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం సదర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన



అనంతరం శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలపై సనాతన ధర్మంపై దాడులను ప్రతి ఒక్క హిందువు ముక్త కంటంతో కండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దాడులను అరికట్టేంతవరకు తన పోరాటం కొనసాగిస్తానని ,శివుని ఆజ్ఞ ప్రకారం తను జీవించేది 30 సంవత్సరాలేనని, ఇప్పటికే ఐదు సంవత్సరాలు గడిచాయని మిగిలిన ఈ జీవితం హిందుమతాన్ని పరిరక్షించడానికి పాటుపడతానన్నారు. హిందూ దేవాలయాలపై, విగ్రహాలపై ఎవ్వరు దాడి చేసిన కర్మ ఎవ్వరిని వదిలిపెట్టదు అంటూ ఆమె హెచ్చరించారు.

# అబద్ధమే ఆశ్చర్యపోయేలా సీఎం రేవంత్ మాటలు

### - మూసీ పునరుజ్జీవం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
### - తీవ్రస్థాయిలో ఫైరయిన మాజీమంత్రి హరీష్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మూసీ నది పునరుజ్జీవం పేరుతో సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీశారని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. నిన్నటి సీఎం రేవంత్ ప్రెస్‌మీట్‌లో ఏఐ గ్రాఫిక్స్ హైరైజ్ బిల్డింగులు చూపించి మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ వెనుక దాగి ఉన్న స్టంట్ ఏంటో తెలియాల్సి ఉందన్నారు. తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించిన హరీష్ రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నిర్మాణ సమయంలో అక్కడి ప్రజలను బలవంతంగా తరలించారన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలను హరీష్ తప్పుబట్టారు. మూసీ నుంచి మల్లన్నసాగర్, రంగనాయక సాగర్‌కు వెళ్దామని సీఎంకు సవాల్ విసిరారు. స్వయంగా తానే కారు డ్రైవింగ్ చేస్తానని పక్కన కూర్చుంటే ఇద్దరం కలిసి అక్కడకు వెళ్దామని అన్నారు. 'సెక్యూరిటీ లేకుండా వస్తా అన్నావ్ కదా, పోదాం పదా. డేట్, టైం మీరే చెప్పండి, కారు డ్రైవింగ్ చేసుకుంటూ ఇద్దరమే పోదాం. నేను డ్రైవ్ చేస్తా, నువ్వు పక్కన కూర్చో. లేదంటే నేడు ఉదయం 9 గంటలకు నేను సిద్ధం. ముందు మూసీ నిర్వాసితుల వద్దకు, ఆ తర్వాత ఆర్అండ్ఆర్ కాలనీ, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కట్ట మీదకు పోదాం. అక్కడే కూర్చొని మాట్లాడుదాం.' అని హరీష్ సవాల్ విసిరారు.మల్లన్న సాగర్, రంగనాయక సాగర్‌లో బాధితులుగా మిగిలిన వారికి రెండురెట్ల పరిహారంతో పాటు 250 గజాల ఇండ్లు మున్సిపాల్టీలో కట్టించామన్నారు. 18 ఏండ్లు నిండిన వారందరికీ ఆర్ఆండ్ఆర్ ప్యాకేజీ అందించామని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి మల్లన్న సాగర్ నిర్వాసితుల పట్ల అంత ప్రేమ ఉంటే మిగిలిపోయిన వారికి ఆర్అండ్ఆర్ కోసం మరో రూ.200 కోట్లు అందించి సహాయం చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవంపై సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలతో అబద్ధమే అశ్చర్య పోయిందని హరీష్ ఎద్దేవా చేశారు. తాము మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదన్న ఆయన తమ ప్రభుత్వ హయంలోనే 2,800 కోట్లతో 36 శుద్ధి కేంద్రాలను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. గత సీఎం కేసీఆర్ హయాంలో మూసీలోకి రూ.1100 కోట్లతో గోదావరి జలాలను తరలించేందుకు డీపీఆర్ సైతం సిద్ధమైందన్నారు. తాము మూసీ పునరుజ్జీవానికి వ్యతిరేకం కాదని.. పేదల ఇండ్లను కూల్చడాన్నే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ పేర్లతో సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని హరీష్ విమర్శించారు.

## మూసీపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు

# అర్థరహితం

- చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్న హరీష్ రావు
- మల్లన్నసాగర్ బాధితులకు మంచి ప్యాకేజీ ఇచ్చామని వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** మూసీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 'రేవంత్ రెడ్డి సవాలుకు సిద్ధం. రేపు రమ్మంటావా.. ఎల్లుండి రమ్మంటావా. సెక్యూరిటీ లేకుండా వస్తా అన్నావ్. పోదాం పదా. డేట్, టైం మీరే చెప్పండి, కారు డ్రైవింగ్ చేసుకుంటూ ఇద్దరమే పోదాం. లేదంటే రేపు ఉదయం 9 గంటలకు నేను సిద్ధం. ముందు మూసీ నిర్వాసితుల వద్దకు, ఆ తర్వాత ఆర్అండ్ఆర్ కాలని, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కట్ట మీదకు పోదాం అక్కడే కూర్చొని మాట్లాడుదాం' అంటూ మాజీ మంత్రి సవాల్ విసిరారు. 2013 చట్టానికి మించిన ప్రయోజనాలు మల్లన్న సాగర్ ప్రజలకు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ అని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్ళను కూల్చటాన్ని మాత్రమే బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి సీఎం మాటలతో అబద్ధం కూడా ఆశ్చర్యపోయిందన్నారు. ప్రజల దృష్టిని మరల్చడం కోసమే సీఎం రేవంత్ మూసీ అంశాన్ని తీసుకొచ్చా రన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చటంలో కాంగ్రెస్ చతికిలపడిందని విమర్శించారు. నదీ జలాల శుద్ధితో మూసీ నది పునర్జీవ పక్రియ మొదలు పెట్టాలన్నారు. మొదట మూసీ నదిలో వ్యర్థాలు వచ్చి చేరకుండా అడ్డుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చారని మండిపడ్డారు. మూసీలో గోదావరి నీళ్ళను కలపటానికి డీపీఆర్ కూడా సిద్ధమైందని తెలిపారు. గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి కీలక కామెంట్స్ చేశారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విషవలయం లో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు సీఎం రేవంత్. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారాయన. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, కిష్టాపూర్ ఎక్కడికైనా.. సెక్యూరిటీ లేకుండా తానువ స్తానని అన్నారు. విపక్ష నేతలు కూడా రావాలని సవాల్ విసిరారు. అక్కడ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిద్దామన్నారు. '

## ఆలయాలపై దాడులు జరుగుతున్నా చర్యలేవీ

- కాంగ్రెస్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఈటెల



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** గత నెల రోజులలో.. తెలంగాణాలో 6 హిందూ దేవాలయాలపై దాడులు జరగడంపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. ఇంతకన్నా దారుణం ఉంటుందా అని అన్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం సిగ్గుచేటన్నారు. సికింద్రాబాద్ లో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రాహాన్ని ధ్వంసం చేసిన వాడు, చావు దెబ్బలు తిని అరెస్ట్ అయిన తరువాత కూడా ఏమి మారకుండా హాస్పిటల్ లో నుండి సోషల్ మీడియాలో విద్వేష పూరిత పోస్టులు పెట్టగలిగిండు అంటే.. ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం అవుతుందని అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కార్ పై ఈటెల రాజేందర్ విమర్శలు గుప్పించారు. ప్రజల దృష్టిలో.. హిందూ సమాజానికి ఈ ప్రభుత్వం రక్షణ ఇవ్వగలదనే నమ్మకం కోల్పోయిందని అన్నారు. ఈ మతోన్మాద దాడులకు, ప్రభుత్వ చేతగానితనానికి నిరసనగా ప్రజలు సికింద్రాబాద్ బంద్ కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈటెల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తోణం ఆలయ విధ్వంసలకులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

## యాదగిరిగుట్టలో భక్తులకు సౌకర్యాలు మెరుగు

- మంత్రి కొండా సురేఖ వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** యాదగిరిగుట్టలో భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆలయంలో 14చోట్ల మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. 47 చోట్ల టాయిలెట్స్ నిర్మించినట్లు చెప్పారు. విష్ణు పుష్కరిణీ గుండాన్ని ఏర్పాటు చేశామన్నారు. చంటి బిడ్డ తల్లులకు ప్రత్యేక లాంజ్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల సౌకర్యం కల్పించామని చెప్పారు. రూ. 15కోట్లతో దాతల సహాయంతో అన్నదాన సత్రం నిర్మించామని మంత్రి కొండా సురేఖ అన్నారు. 60కిలోల బంగారు తాపడంతో రాజగోపురం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. లడ్డూ నాణ్యతలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. భద్రాద్రి అభివృద్ధి కోసం కొత్త మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. రూ. 3కోట్లతో జానకి సదనం నిర్మిస్తున్నామని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన 24సేవలు ఆన్ లైన్?లో అందిస్తున్నామని ప్రకటించారు. వేములవాడ దేవస్థానానికి చెందిన 850కోడెలను రైతులకు అందించినట్లు మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.టీటీడీఏ(÷ఆం) కు ప్రభుత్వం రూ. 70 కోట్లు విడుదల చేసిందని ప్రకటించారు. వెండి పల్లకీలు, బంగారు తాపడం రాజగోపురం నిర్మించాలని నిర్ణయించామన్నారు. రూ.110కోట్లతో బాసర ఆలయ పునర్నిర్మానం చేస్తామన్నారు. అందుకోసం మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధమైందని అన్నారు. ఆదాయం ఆధారంగా ఆలయాల వర్గీకరణ చేస్తామని వివరించారు. వివాదంలో ఉన్న దేవాదాయ, అటవీ శాఖ భూములపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# సెటిల్మెంట్ చేశారా

# మళ్ళీ నిర్మాణం జరుగుతుంది.?

- అనుమతులు శూన్యం అక్రమ నిర్మాణాలు అడ్డగోలు
- పేరుకే జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది
- చర్యలు ఉండవు కానీ కార్యచరణతో అక్రమ నిర్మానుదారులకు వత్తాసు పలుకుతున్నారు
- పలుకుబడి ఉంటే చాలు "ఎస్ బాస్" అంటూ వాలిపోతున్న అధికారులు





**సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తార్నాక డివిజన్లో అడ్డగోలు ఆక్రమ నిర్మాణాలు జరుగుతుంటే నిమ్మకు నీరు ఎత్తనట్టు వహిస్తున్న జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు. పలుకుబడి ఉన్న బిల్డర్లకు రాజకీయ నాయకుల అండదండలతో అనుమతులు మంజూరు కాకుండానే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. వీరికి ఆజ్యం పోస్తూ జిహెచ్ఎంసి అధికారులు భారీగా జిహెచ్ఎంసి కజానాకు గండి కొడుతూ అక్రమ నిర్మాణదారుల నుండి భారీగా వసూలు చేస్తూ భారీ అక్రమ నిర్మాణాలకు పూర్తి మద్దతును అందిస్తున్నారు. ఇందుకు నిదర్శనం తార్నాక లోని ప్రముఖ సెంటెన్స్ స్కూల్ ఎదురుగా నిర్మాణం అవుతున్న భారీ అక్రమ నిర్మాణం. పత్రికలలో కథనాలు వచ్చిన చర్యలు చేపట్టని జిహెచ్ఎంసి అధికారులు, ప్రధాన రహదారిలో వెలిసిన భారీ ఆక్రమ నిర్మాణంను గతంలో ఏసీపీ రజిత కూల్చివేశారు. అయితే ప్రస్తుతం అధికారులు సిబ్బంది ఎంతకు సెటిల్మెంట్ చేసుకున్నారో కానీ నిర్మాణం చక చక జరిగిపోతుంది కూల్చివేసిన దానికి మరమ్మత్తులు చేసి రంగులు వేసి అధికారులకు కావలసింది సమర్పించుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో జిహెచ్ఎంసి అధికారులు చర్యలు చేపట్టక పోవడానికి గల కారణం రాజకీయ నాయకులు పలుకుబడి గల బిల్డర్లే కాదు ఉన్నత అధికారుల వరకు తెలియకుండా మేనేజ్ చేస్తున్న చైన్ మెన్లు. జిహెచ్ఎంసిలో వీరి పాత్ర సృష్టికర్త వలే ఉంటుంది అంతా వీరు నడిపించి చూపించిన మాదిరిగానే ఉన్నత అధికారులకు కనిపిస్తుంది. జిహెచ్ఎంసి కమిషనర్ కాస్త అధికారులపై దృష్టి సారిస్తే ఇలాంటివి తావివ్వకుండా ఉంటుందని ప్రజా సంఘాలు భావిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, న్యాక్ ఇంజనీర్లు కాస్త జిహెచ్ఎంసిలో విధులు నిర్వహిస్తున్నమన్న విషయం మర్చి అక్రమ నిర్మాణదారులకు దాసోహం చేస్తూ విధులు నిర్వహిస్తున్నట్టు ఉంది వారి కార్యచరణ అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చైన్ మెన్ లు వేతనాలకు మించి అవినీతి సొమ్ము కోట్లలో సంపాదిస్తూ జిహెచ్ఎంసి ఆదాయాన్ని కూడా దండుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భారీ ఆక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయకుండా, అక్రమ భవనాలను కూల్చివేయకుండా కాలం వెళ్లదీస్తూ ప్రజలనే ఏం మారుస్తూ నడిపిస్తున్నారు చైన్ మేన్లు వారి హవాని.ప్రజలు జిహెచ్ఎంసి కి పలుమార్లు వచ్చిన కాలం వెళ్లి తీసి చర్యలు తీసుకోకుండా పాత భవనం అంటూ, నేను లేనప్పుడు జరిగింది అంటూ, దాని వెనుక ఓ చెత్త లీడర్ పేరు చెప్పి ఏం చేయలేమంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. ఇలాంటి టౌన్ ప్లానింగ్ అవినీతి అధికారులని ఆక్రమ నిర్మాణదారులకి తగిన బుద్ధి చెప్పే విధంగా జిహెచ్ఎంసి కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ బాధ్యతారహిత్యంగా వ్యవహరించడం వలన సికింద్రాబాద్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా వెలుస్తున్నాయని పత్రికలో వచ్చిన కథనాలపై కూడా జోనల్ కమిషనర్ స్పందించకపోవడం వెనక ఆర్థిక లావాదేవీలే కారణమన్న అనుమాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిహెచ్ఎంసి కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు పేర్కొన్నారు.

## వైబ్ మీడియా ఎంటర్టైన్మెంట్

# చానెల్ లోగో లాంచ్: సృజనాత్మకతకు నాంది





VIBE MEDIA
Where Every Moment is a Vibe!





**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** నగరంలో ఘనంగా వైబ్ మీడియా లోగో ఆవిష్కరణ కొత్త శకానికి నాంది పలికింది. ఈ కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు, మీడియా ప్రముఖులు, కళాకారులు పాల్గొనడం విశేషం. ఈ చానల్ ప్రారంభం ద్వారా సమకాలీన ఎంటర్టైన్మెంట్ రంగంలో నూతన ఒరవడిని సృష్టించేందుకు వైబ్ మీడియా సిద్ధంగా ఉందని వారు తెలిపారు. ఈ సందర్భంగా నెట్జ్ మీడియా గ్రూప్ అధినేత, వైబ్ మీడియా ఛైర్మన్ శ్రీధర్ యాలాల మాట్లాడుతూ, వైబ్ మీడియా వ్యాపార విధానం, కంటెంట్ నాణ్యత, సాంకేతికతను వినియోగించుకుని ప్రేక్షకులకు అత్యుత్తమ వినోదం అందించడానికి చానల్ కట్టుబడి ఉందని తెలిపారు. కంటెంట్ కేవలం వినోదం మాత్రమే కాకుండా, ఆలోచనలకు దారితీసేలా ఉండాలని, వినోదాన్ని నూతనంగా నిర్వచించడానికి వైబ్ మీడియా కృషి చేస్తుందని చెప్పారు. యువత కోసం ఉండే అవకాశాలపై చర్చిస్తూ, వాణిజ్యపరమైన, సామాజిక అంశాల కలయికతో సరికొత్త కార్యక్రమాలను రూపొందించడం ద్వారా ఈ చానెల్ సుదీర్ఘకాలం ప్రభావాన్ని చూపించేలా కృషి చేస్తామని తెలిపారు.గ్రీన్ క్యూరీస్ ఎండీ పీవీ రమణ మాట్లాడుతూ వినూత్నతకు పెద్ద పీట వేసే వైబ్ మీడియా, కొత్త అవకాశాలను సృష్టిస్తూ, ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదిస్తుందని తెలిపారు. కార్యక్రమాల్లో కలగలిపిన రకాలత మరియు సృజనాత్మకతతో వైబ్ మీడియా త్వరలోనే ఒక పెద్ద బ్రాండ్‌గా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ యంగ్ లీడర్స్ ఫౌండర్ - ప్రెసిడెంట్ టి జయంత్ తన ప్రసంగంలో వైబ్ మీడియా ద్వారా అనేక కళాకారులు, యువత సృజనాత్మకంగా వ్యక్తీకరించుకునే వేదికను పొందుతారని అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తూ, ప్రజలకు సాంస్కృతికంగా, సామాజికంగా ఉపయోగకరమైన కంటెంట్ అందించడంలో ఈ చానల్ ముందంజలో ఉంటుందని అన్నారు. బిజెపి ఎండోమెంట్ సెల్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అర్పిత ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ "వైబ్ మీడియా ఎంటర్టైన్మెంట్ చానెల్ ప్రారంభం మా రాష్ట్రంలో సాంస్కృతిక, సామాజిక రంగాల అభివృద్ధికి మద్దతు ఇస్తుంది. ఈ చానల్ ద్వారా యువతకు కొత్త అవకాశాలు, ప్రతిభను ప్రదర్శించడానికి మరింత వేదికలు లభిస్తాయి" అని అన్నారు. నమస్తే హైదరాబాద్ పత్రిక ఎడిటర్ సోమన్న ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ వైబ్ మీడియా ఎంటర్టైన్మెంట్ చానెల్ యొక్క సృజనాత్మకతను, నూతన కంటెంట్ ప్రసారం చేయడంలో తీసుకుంటున్న కృషిని ప్రశంసించారు. వారు మాట్లాడుతూ, "వైబ్ మీడియా కొత్త తరహా వినోదాన్ని ప్రేక్షకులకు అందించడంతో పాటు, యువతకు కొత్త సృజనాత్మకులకి వేదికగా నిలుస్తుంది. ఈ చానెల్ భారతీయ మీడియా రంగంలో కొత్త ఒరవడిని సృష్టించడానికి కీలకపాత్ర పోషించనుంది" అన్నారు. వైబ్ మీడియా ఎంటర్టైన్మెంట్ చానల్ ప్రారంభం మీడియా రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతూ, అత్యున్నత క్వాలిటీ కంటెంట్ అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైబ్ మీడియా ఛైర్మన్ మరియు నెట్జ్ మీడియా గ్రూప్ అధినేత శ్రీధర్ యాలాల, వారి అబ్బాయి ఆరోన్ చంద్ర, గ్రీన్ క్యూరీస్ ఎండీ పీవీ రమణ, తెలంగాణ యంగ్ లీడర్స్ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ టి జయంత్, బిజెపి ఎండోమెంట్ సెల్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అర్పిత, నమస్తే హైదరాబాద్ పత్రిక ఎడిటర్ సోమన్న, సీనియర్ జర్నలిస్ట్ శంకర్, వైబ్ మీడియా టీం సభ్యులు ప్రకాష్, కృష్ణ, సిద్ధార్థ్, కె. లక్ష్మీ నరసింహ, సామ్రాట్, అరవింద్, హరి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత, వైబ్ మీడియా టీం సభ్యులు తమ ఉత్సాహం వ్యక్తం చేస్తూ, చానెల్‌లో వచ్చే కార్యక్రమాలపై ప్రజల రుచి మరింత విస్తరించబోతున్నట్లు తెలిపారు.

తార్నాకలో జరిగిన వేడుక మనసు హెూరా హెూరీ,
నెట్జ్ చైర్మన్ శ్రీధర్ యాలాల మాటలు స్ఫూర్తి భారీ,
గ్రీన్ క్యూరీస్ రమణ అభినందన మెరుగు,
టి జయంత్ ఉత్సాహం అందరి హృదయాలను చేరువు.
అర్పిత మాటల్లో భవిష్యత్తు ఆశ,
సోమన్న ప్రసంగంలో సృజనాత్మకతను చూశావు ఆశ,
వైబ్ మీడియా రంగంలో పుటించనుంది కొత్తదనం,
ప్రేక్షకుల హృదయాలలో చేరనుంది విశ్వాసం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588